తెలంగాణ ప్రభుత్వం

# వ్యవసాయ పాడి పంటలు

( VYAVASAYA PADIPANTALU )

సంపుటి-79 సంచిక-10 వ్యవసాయ శాఖ పేజీలు - 52 అక్టోబర్ - 2021



## రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు, వ్యవసాయశాఖ సిబ్బందికి


## బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు !



13 సెప్టెంబర్ 2021న బీఆర్ కేఆర్ భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి శోభ కరంద్లాజే గారితో సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్., వ్యవసాయశాఖ ప్రత్యేక కమీషనర్ హన్మంతు కొండిబ తదితరులు

13 సెప్టెంబర్ 2021న బీఆర్ కేఆర్ భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి శోభ కరంద్లాజే గారితో సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్., వ్యవసాయశాఖ ప్రత్యేక కమీషనర్ హన్మంతు కొండిబ, వ్యవసాయ అదనపు సంచాలకులు కె.విజయ్‌కుమార్ సహా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాల అవసరాలు, వ్యవసాయ పథకాల ప్రాధాన్యతను గుర్తించి దానికి అనుగుణంగా కేంద్రం నుండి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి విజ్ఞప్తి పత్రం సమర్పించారు.



తెలంగాణ ప్రభుత్వం

# వ్యవసాయ పాడి పంటలు

( VYAVASAYA PADIPANTALU )

సంపుటి : 79 అక్టోబర్ - 2021 సంచిక : 09

శ్రీ ప్లవ నామ సంవత్సరం భాద్రపదం - ఆశ్వీయుజం

వ్యవసాయశాఖ సలహాలు, సూచనలు, వ్యవసాయ పాడిపంటలు మాస పత్రిక, ఇతర సమాచారం కోసం http://vyavasayam.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి!


## సంపాదక వర్గం




ప్రధాన సంపాదకులు

ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్

వ్యవసాయ కమిషనరు



సంపాదకులు

జి.నారీమణి

అదనపు వ్యవసాయ సంచాలకులు

సహాయ సంపాదకులు

- టి.సుజాత
- కె.శివ ప్రసాద్
- కె.చంద్రకళ
- కె.సురేఖా రాణి
- డి.వి.రామక్రిష్ణారావు

డి.టి.పి - డిజైనింగ్

ఎస్.ప్రశాంత్ కుమార్



**రచనలు పంపాల్సిన చిరునామా**

సహాయ వ్యవసాయ సంచాలకులు (ముద్రణ)
వ్యవసాయ కమిషనరు వారి కార్యాలయం
ఎల్.బి. స్టేడియం ఎదురుగా, హైదరాబాద్-500 001.
ఫోన్ : 040-23383519
Mail ID : tspadipantalu@gmail.com



Published & Printed by
M Raghunandan Rao, I.A.S.,
Commissioner of Agriculture,
Government of Telangana,
Opp. L.B. Stadium, Basheerbagh,
Hyderabad-500 001,
Designed at M/s.Sri Chaithanya Graphics,
Shop No.2, #3-5-377, Vittalwadi Center, Narayanaguda,
Hyderabad - 500 029
on behalf of
Commissioner & Director of Agriculture, Telangana,
Editor : G. Nareemani


## విషయ సూచిక


1. రాష్ట్రంలో నమోదైన వర్షపాత వివరాలు....4
2. సంపాదకీయం....5
3. అక్టోబర్ మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులు....6
4. వాతావరణం - పంటల పరిస్థితి....14
5. కవర్‌పేజీల కథనాలు....16
6. యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటల సాగు....18
7. యాసంగి వేరుశనగ సాగులో రైతులు పాటించాల్సిన సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు....20
8. పత్తికోత వెంటనే నువ్వుల సాగు లాభదాయకం - ఒక విజయగాథ....23
9. కొన్ని సామెతలు....25
10. యాసంగి కంది సాగులో మెళకువలు....26
11. వర్షాధార ఆముదం సాగు....29
12. అధిక వర్షాలు కురిసిన తరువాత పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు....31
13. వరిలో బాక్టీరియా ఆకుఎండు తెగులు, నివారణ చర్యలు....33
14. పత్తి పంటలో నీటి ముంపు ప్రభావం - పోషక యాజమాన్య పద్ధతులు....34
15. రైతుల ముంగిటకు అన్నపూర్ణ కృషి ప్రసార సేవ (సరికొత్త సమాచార సాంకేతిక పరిజ్ఞానం)....35
16. భారీ వర్షాల సమయంలో పిడుగుపాటుకు గురికాకుండా రైతులు పాటించవలసిన జాగ్రత్తలు....37
17. ఆలుగడ్డ సాగు యాజమాన్యం....38
18. స్వల్పకాలిక పంట ధనియాల సాగు....39
19. సాగు... సంగతులు..2....41
20. జాతీయ పోషకాహార వారోత్సవాలు-2021 పై ప్రత్యేక కథనం! పోషక ధాన్యాలు, పోషక పెరటి తోటల సాగు లోనే మన దేశ ఆరోగ్య భద్రత!....43
21. పాడి అభివృద్ధికి దూడల పోషణ....47
22. ఫోన్ - ఇన్ - లైవ్....49


79 సంవత్సరాలుగా రైతాంగానికి సలహాలు, సూచనలు అందిస్తూ, వ్యవసాయరంగంలో వస్తున్న సాంకేతిక మార్పులు, అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు, రాయితీలను గురించి సమాచారం తెలియజేస్తూ రైతాంగానికి కరదీపికగా వెలువడుతున్న 'వ్యవసాయ పాడి పంటలు' పత్రికను చదువుదాం. రైతులందరిచేత చదివిద్దాం!

- సం.



## రాష్ట్రంలో సాగైన పంటల విస్తీర్ణం (ఎకరాలలో)

## రాష్ట్రంలో నమోదైన వర్షపాత వివరాలు (మి.మీ.లలో)

| క్ర. సంఖ్య | జిల్లాలు | వానాకాలం పంటల సాగు విస్తీర్ణం 29.09.2021 వరకు | | 01-06-2021 నుండి 29-09-2021 వరకు | |
|---|---|---|---|---|---|
| | | సాధారణం | నమోదు | సాధారణం | నమోదు |
| 1. | రంగారెడ్డి | 443203 | 399142 | 501.5 | 761.6 |
| 2. | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 22173 | 17113 | 559.0 | 804.5 |
| 3. | వికారాబాద్ | 479867 | 424913 | 623.5 | 855.3 |
| 4. | నిజామాబాద్ | 440324 | 426831 | 853.0 | 1399.9 |
| 5. | కామారెడ్డి | 422889 | 418763 | 824.7 | 1237.9 |
| 6. | మెదక్ | 230992 | 208518 | 727.8 | 983.9 |
| 7. | సంగారెడ్డి | 625179 | 569977 | 685.7 | 886.1 |
| 8. | సిద్దిపేట్ | 499651 | 466093 | 594.7 | 1157.8 |
| 9. | మహబూబ్‌నగర్ | 321103 | 470524 | 474.4 | 721.3 |
| 10. | నాగర్‌కర్నూల్ | 567548 | 522508 | 456.7 | 494.4 |
| 11. | వనపర్తి | 229341 | 208195 | 430.4 | 551.3 |
| 12. | జోగులాంబ గద్వాల | 332998 | 272938 | 382.0 | 429.3 |
| 13. | నారాయణ్‌పేట్ | 392623 | 212392 | 420.6 | 702.5 |
| 14. | నల్గొండ | 956582 | 865631 | 508.1 | 726.0 |
| 15. | సూర్యాపేట్ | 470700 | 417855 | 638.5 | 745.6 |
| 16. | యాదాద్రి భువనగిరి | 362450 | 313358 | 544.9 | 833.0 |
| 17. | వరంగల్ (రూరల్) | 333307 | 318376 | 834.5 | 1271.4 |
| 18. | వరంగల్ (అర్బన్) | 163567 | 157734 | 702.2 | 1265.8 |
| 19. | జయశంకర్ భూపాలపల్లి | 205904 | 258836 | 926.7 | 1174.3 |
| 20. | జనగాం | 294280 | 281639 | 671.6 | 1006.3 |
| 21. | మహబూబాబాద్ | 279049 | 286365 | 786.9 | 1109.6 |
| 22. | ములుగు | 128031 | 65635 | 1091.4 | 1196.1 |
| 23. | ఖమ్మం | 559344 | 497513 | 785.0 | 1026.5 |
| 24. | భద్రాద్రి కొత్తగూడెం | 325341 | 336192 | 898.5 | 1165.4 |
| 25. | కరీంనగర్ | 299284 | 283703 | 711.9 | 1227.2 |
| 26. | జగిత్యాల | 303054 | 277231 | 850.7 | 1253.3 |
| 27. | పెద్దపల్లి | 248918 | 234727 | 886.1 | 1010.6 |
| 28. | రాజన్న సిరిసిల్ల | 212470 | 214378 | 713.2 | 1391.1 |
| 29. | అదిలాబాద్ | 503477 | 507625 | 996.9 | 1383.0 |
| 30. | మంచిర్యాల | 296679 | 273156 | 982.4 | 1015.4 |
| 31. | నిర్మల్ | 366563 | 380979 | 948.5 | 1410.5 |
| 32. | కొమరంభీం ఆసిఫాబాద్ | 346376 | 351065 | 1015.8 | 1375.1 |
| 33. | హైదరాబాద్ | - | - | 557.7 | 740.9 |
| | **మొత్తం** | **1,16,63,267** | **1,09,39,903** | | |

**గమనిక:** 'వ్యవసాయ పాడిపంటలు' పత్రిక సాఫ్ట్ కాపీని
**http://vyavasayam.telangana.gov.in** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

\- సంపాదకులు



# సంపాదకీయం

### వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేద్దాం..


## పంటల వైవిధ్యీకరణతో సుస్థిర, లాభసాటి సేద్యానికి బాటలు వేద్దాం..

ఒక రుతువులో వేరువేరు నాటే సమయాలు, వేరు వేరు పంట కోత సమయాలు ఉన్న వేరు వేరు పంటలను వేసుకోవడమే పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) అని అంటారు. సాగు విధానంలో మనం ఎంతో భిన్నత సాధించాల్సి ఉంది. ఏక పంటల విధానంతో ఇప్పటికే చాలా నష్టాలు చవిచూసాం. అందువల్ల బహుళ పంటలతో సుస్థిర దిగుబడులు సాధించే దిశగా ఆలోచనలు చేద్దాం. ఈ విధంగా చేయడం వలన ఉత్పాదకాల వినియోగంపై ఒత్తిడి తగ్గడమే కాక దిగుబడులు గరిష్ట స్థాయిని చేరుకుంటాయి. అంతే కాకుండా వనరుల వినియోగంలో సమతుల్యత సాధించగలం. ఏక పంటల విధానంలో పొంచి ఉన్న పర్యావరణ ముప్పును ఆర్థిక ఇబ్బందిని ఎదుర్కోగలుగుతాం. రాను రాను పంటల దిగుబడులు తగ్గిపోతున్నాయి. అందువల్ల మనమంతా సుస్థిర పంట సాగు విధానాల వైపు మళ్ళవలసి ఉంది. అది పంటల వైవిధ్యీకరణ / క్రాప్ డైవర్సిఫికేషన్ తోనే సాధ్యమవుతుంది. పలు మార్లు నేలను దున్నే పాత పద్ధతులను విడనాడాలి. నేలలో సేంద్రియ పదార్థం పెంపొందేలాగా కృషి చేయాలి.

హరిత విప్లవ కాలం ఆ తర్వాత క్రమంలో రైతులు వ్యవసాయ రంగంలో అనేక కొత్త సవాళ్ళను ఎదుర్కొంటున్నారు. అవి భూగర్భ జల వనరులు తగ్గిపోవడం, భూసారం పడిపోవడం, నేలల నాణ్యత పడిపోవడం, ఉప్పు తేలడం, చీడపీడలు పునరుజ్జీవం పొందడం, వాతావరణ కాలుష్యం పెరిగిపోవడం మొత్తంగా వ్యవసాయం నష్టదాయకంగా పరిణమించింది. పంటల వైవిధ్యీకరణతో రైతులు ఈ సమస్యలను అధిగమించగలరు. అంతే కాకుండా సుస్థిర ఆదాయాన్ని పొందగలరు. వాతావరణ మార్పులను ఎదుర్కోగలరు. మార్కెట్‌లో ధరల మార్పును నియంత్రించగలరు. మొత్తంగా సమతుల ఆహారాన్ని అందించగలరు. తమకున్న ప్రకృతి వనరులను కాపాడుకోగలరు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం కూడా తగ్గుతుంది. పర్యావరణాన్ని కాపాడుకోవడమే కాకుండా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఆహార భద్రతకు, పంటల వైవిధ్యీకరణే ఏకైక మార్గం. వ్యవసాయంలో ఎదురవుతున్న రిస్క్ ను కూడా పంటల వైవిధ్యీకరణతో ఎదుర్కోగలం.

పంటల వైవిధ్యీకరణ వలన ప్రత్యామ్నాయ పంటల ద్వారా లాభాలు పెరుగుతాయి. వేరువేరు నాటే సమయాలు, కోత సమయాల వల్ల వాతావరణ మార్పులను తట్టుకుని నిలవవచ్చు. చీడపీడలు తగ్గడమే కాకుండా మానవ వనరుల పంపిణీలో సమతుల్యత సాధించవచ్చు. సాంప్రదాయ సాగుకు భిన్నంగా వేసుకున్న పంటలతో ఎక్కువ విలువ చేర్పు కూడా జరుగుతుంది. వర్షాధార ప్రాంతాలలో పంటల వైవిధ్యీకరణ ఆహార భద్రతకు బాటలు వేస్తుంది. ఉపాధి పెరిగి ఆదాయం పెరుగుతుంది. పర్యావరణానికి మేలు చేస్తుంది. ఆ దిశగా రైతాంగం ఆలోచిస్తారని, తమ పరిస్థితులకు అనుగుణమైన సాగును చేపడతారని ఆశిస్తున్నాం. ఆ క్రమంలో వ్యవసాయశాఖ తన తోడ్పాటును ఎల్లప్పుడూ అందిస్తుంది. **రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు, వ్యవసాయశాఖ సిబ్బందికి బతుకమ్మ, దసరా శుభాకాంక్షలతో..**





# అక్టోబర్ మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ

**వరి :** రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో వరి పంట చిరుపొట్ట దశ నుండి గింజ పట్టే దశలలో ఉంది. చిరుపొట్ట దశలో ఉన్న పొలాలకు ఆఖరి దఫా ఎరువులు వేసుకోవాలి. అందుకు గాను ఎకరానికి 30-35 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను బురద పదనులో వేసుకోవాలి.

అక్టోబర్ మాసంలో ముఖ్యంగా సన్న గింజ రకాలలో సుడిదోమ, కాండం తొలిచే పురుగు, ఆకుముడత, ఆకు / కంకి నల్లి, అగ్గి తెగులు, బాక్టీరియా ఎండాకు తెగులు ఉధృతి పెరగడానికి చాలా అవకాశం ఉంటుంది. కావున ఈ చీడపీడలపై రైతులు అప్రమత్తంగా ఉండి ఆశించిన వెంటనే కింది సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

**సుడిదోమ / దోమ పోటు :**

- వరి పొలాల్లో నీరు తగ్గించి, అడపాదడపా ఆరబెట్టాలి.
- దోమ ఉధృతికి దోహదపడే పురుగు మందులైన క్లోరిపైరిఫాస్, ప్రొఫెనోఫాస్, సింథటిక్ పైరిత్రాయిడ్స్ లేదా సిఫారుసు చేయని బయోమందులను వాడకూడదు.
- తొలి దశలో దోమ నివారణకు ఎకరానికి 300 గ్రా. ఎసిఫేట్ 75 ఎస్.పి. లేదా 320 మి.లీ. బుప్రొఫెజిన్ మందులను పిచికారీ చేయాలి.
- దోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే ఎకరానికి 80 గ్రా. డైనోటెఫ్యూరాన్ లేదా 120 గ్రా. పైమెట్రోజైన్ లేదా 50 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ + ఎథిప్రోల్ మందులను మార్చి మార్చి పొలంలో నీరు తగ్గించి మొక్కల దుబ్బులపై పడే విధంగా పాయలు తీసి పిచికారీ చేయాలి.

**కాండం తొలిచే పురుగు / ఆకు ముడత :** రెక్కల పురుగుల ఉధృతి గమనించినట్లయితే అంకురం, చిరుపొట్ట దశలలో ఉన్న పంటకు తప్పని సరిగా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి. 400 గ్రా. లేదా క్లోరాంట్రానిప్రోల్ 60 మి.లీ. ఎకరానికి 200 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలి.

**ఆకునల్లి / కంకినల్లి :** నల్లి ఆకుల వెనుక భాగంలో ఉండి రసాన్ని పీల్చడం వలన ఆకులు పసుపు పచ్చగా మారతాయి. పొట్ట దశలో లేత కంకుల నుండి రసం పీల్చడం వలన గింజ తాలు పోవడం లేదా రంగు మారడం జరుగుతుంది.

నల్లి నివారణకు ఎకరానికి 1 లీ. డైకోఫాల్ లేదా 200 మి.లీ. స్పైరోమెసిఫెన్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**అగ్గి తెగులు :** తెగులు ఉధృతి ఆకుమచ్చ దశలోనే నివారించకపోతే ఆ తర్వాత దశలలో మెడవిరుపు ఆశించి అధిక నష్టం కలుగుతుంది. నివారణకు ఎకరానికి 300 మి.లీ. ఐసోప్రొథయోలోన్ లేదా 120 గ్రా. ట్రైసైక్లోజోల్ లేదా 500 మి.లీ. కాసుగామైసిన్ మందును తెగులు ఉధృతిని బట్టి 7-10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

**బాక్టీరియా ఎండాకు తెగులు :** తెగులును గమనించిన తరువాత నత్రజని ఎరువులు తాత్కాలికంగా నిలిపివేయాలి. తెగులు వ్యాప్తిని అరికట్టడానికి ఎకరానికి 80 గ్రా. అగ్రిమైసిన్ లేదా ప్లాంటామైసిన్ లేదా 40 గ్రా. స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ పిచికారీ చేయాలి.

**మొక్కజొన్న :** గింజ పాలు పోసుకునే దశలో పక్షులు, అడవి పందుల బెడద తీవ్రంగా ఉంటుంది. పక్షుల బెడద నుండి కాపడడానికి కంకులను పక్కనున్న ఆకులతో చుట్టాలి. పంట నలువైపులా 2-3 వరుసలలో ఈ పద్ధతి పాటించాలి.



- ఎరుపు రంగు మెరిసే రిబ్బన్లను ఉత్తర - దక్షిణ దిక్కుగా పంటకు 0.5 మీటర్ల ఎత్తులో కట్టాలి.
- పక్వానికి వచ్చిన పైరులోని కండెల పైపొర ఎండిపోయి, గింజల అడుగు భాగంలో నల్లటి మచ్చ ఏర్పడినప్పుడు కోత చేపట్టాలి.
- కండెలను ఎండబెట్టి తేమ శాతం 15కు తగ్గిన తర్వాత నూర్పిడి చేయాలి.
- గింజలను 10-12 శాతం వరకు ఆరబెట్టి నిలువ చేయాలి.
- అక్టోబర్ 15 నుండి నవంబర్ 15 వరకు విత్తుకున్నట్లయితే పంటలో దిగుబడులు అధికంగా పొందడానికి అవకాశముంది. విత్తేటప్పుడు 50 కిలోల యూరియా, 70 కిలోల డి.ఎ.పి., 250 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను ఎకరా పొలంలో ఆఖరి దుక్కిలో వేయాలి. చదును చేసిన పొలంలో 60 సెం.మీ. దూరంలో తూర్పు - పడమర దిశలలో బోదెలు వేసుకుని 20 సెం.మీ. దూరంలో బోదెకు దక్షిణం వైపున పైనుంచి 1/3వ వంతు ఎత్తులో విత్తుకోవాలి. విత్తిన రెండు రోజుల లోపల నేలలో తేమ ఉండగానే అట్రజిన్ 50 శాతం కలుపు మందును తేలిక నేలల్లో 800 గ్రా. లేక బరువు నేలల్లో 1200 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసి వెడల్పాకు కలుపు నివారించవచ్చు.

**చిరుధాన్యాలు :**

**ఖరీఫ్ జొన్న :** జూన్ రెండవ పక్షంలో విత్తుకున్న పంట కోత దశలో ఉంటుంది. కంకిలోని గింజలు తెల్లగా మారి, ఎండిపోయినప్పుడు అలాగే గింజ కింది భాగంలో నల్లని చార ఏర్పడిన తర్వాత కంకులను కోయాలి.

**మాఘీజొన్న :** ఆగస్టు, సెప్టెంబర్‌లో విత్తుకున్న జొన్న పంట 20-30 రోజుల దశలో ఉన్నట్లయితే దంతితో అంతరకృషి చేసి కలుపు మొక్కలను నివారించాలి. విత్తిన 40 రోజుల తర్వాత కలుపు మొక్కల ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే 2,4-డి మందును ఎకరాకు 600 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కలుపు తీసిన తర్వాత ఎకరాకు 40 కిలోల నత్రజనిని ఇచ్చే ఎరువును పైపాటుగా వేసుకోవాలి.

**రబీ జొన్న :** రబీలో జొన్నను అక్టోబర్ చివరి పక్షం వరకు విత్తుకోవచ్చు.

**అనువైన రకాలు :** ఎం.35-1, సి.ఎస్.వి216, ఆర్.సి.ఎస్.వి.14 ఆర్. పాలమూరు జొన్న.

**అనువైన సంకరాలు :** సి.ఎస్.ఎచ్.15 ఆర్, సి.ఎస్.వి. 16 ఆర్.

- ఎకరాకు 3 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తేటప్పుడు ఒక కిలో విత్తనానికి 3 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 7-10 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందును కలిపి విత్తనశుద్ధి చేసుకుని విత్తుకోవాలి.
- విత్తేటప్పుడు సాళ్ళమధ్య 45 సెం.మీ. మొక్కల మధ్య 15 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి.
- విత్తిన 48 గంటల లోపు అట్రజిన్ మందును 600 గ్రా. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి తడినేలపై పిచికారీ చేయాలి.

**సజ్జ, రాగి, కొర్ర :** పై పంటలన్నీ కోత దశలో ఉంటాయి. గింజ గట్టిపడిన తర్వాత కోత కోసి నిల్వ చేసుకోవాలి.

**రబీ రాగి :** రబీలో రాగిని అక్టోబర్ చివరి వారం వరకు విత్తుకోవచ్చు.

**అనువైన రకాలు :** భారతి, హిమ

**విత్తిన మోతాదు :** ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుంది. ఒక ఎకరాకు 5 సెంట్లలో పెంచిన నారు సరిపోతుంది. ఒక వేళ వెదజల్లే పద్ధతిలో విత్తుకున్నప్పుడు ఎకరాకు 3-4 కిలోల విత్తనం అవసరమవుతుంది. విత్తేటప్పుడు ఒక కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండిజమ్ మందును కలిపి విత్తనశుద్ధి చేసుకొని విత్తుకోవాలి.

విత్తేటప్పుడు సాళ్ళ మధ్య 30 సెం.మీ. మొక్కల మధ్య 10 సెం.మీ దూరం ఉండేలా విత్తుకోవాలి. నారు నాటేముందు పెండిమిథాలిన్ 600 మి.లీ. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**వేరుశనగ :** ఖరీఫ్‌లో విత్తుకున్న పంటపై ఈ దశలో పురుగు తాకిడి ఎక్కువగా ఉంటుంది. లద్దె పురుగు, పచ్చ పురుగు ఆశించే అవకాశం ఉన్నందున తొలిదశ పురుగు నివారణకు క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. ఎదిగిన పురుగులను థయోడికార్బ్ 1.0 గ్రా. లేదా నొవాల్యూరాన్ 1.0 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి లేదా విషపు ఎరలను వాడి నివారించాలి.

- ❖ ఆకుమచ్చ తెగుళ్ళ నివారణకై ఒక ఎకరానికి హెక్సాకొనజోల్ 400 మి.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ❖ వైరస్ తెగులు సాధారణంగా తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. కావున వాటికి ఆశ్రయం కల్పించే కలుపును తీసివేయాలి. ఒక ఎకరానికి 80 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ❖ బూజుతెగుళ్ళు లేక కాండం కుళ్ళు తెగులు నివారణకు ఒక ఎకరానికి 200 మి.లీ. టెబ్యుకొనజోల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ❖ రబీ వేరుశనగను సెప్టెంబర్ మాసం రెండవ పక్షం నుండి నవంబర్ మాసం వరకు విత్తుకోవచ్చు. ఎకరానికి 75-80 కిలోల గింజల అవసరం. 1 గ్రా. టెబ్యుకొనజోల్‌తో ఒక కిలో విత్తనాన్ని శుద్ధి చేసుకోవాలి. కొత్తగా వేరుశనగ సాగు చేసే నేలలో రైజోబియం కల్చరుని పట్టించాలి. 200 గ్రా. రైజోబియం కల్చరును ఒక ఎకరానికి సరిపోయే విత్తనానికి పట్టించాలి.
- ❖ ట్రాక్టరు సహాయంతో లేదా ఎద్దుల సహాయంతో నడిచే గొర్రుతో వరుసలలో విత్తుకోవాలి. కూలీల కొరత ఎక్కువగా ఉన్న ఈ సమయంలో యాంత్రీకరణ ద్వారా పంటను విత్తుకున్నట్లయితే కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చు.
- ❖ కలుపు నివారణకు పెండిమిథాలిన్ 30 శాతం అనే కలుపు మందును ఎకరానికి 1.3-1.6 లీ. 200 లీటర్ల నీటితో కలిపి విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు నేలపై బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలి.

**ఆముదం :** ఈ మాసంలో దాసరి పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దాసరి పురుగు నివారణకు 1 గ్రా. థయోడికార్బ్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉండి, పురుగులు పెద్దవిగా ఉన్నప్పుడు లార్వాలు మొక్కలపై నుండి ఏరి నాశనం చేయాలి.

- ❖ పొగాకు లద్దె పురుగు చిన్నవిగా ఉన్నప్పుడు గొంగళి పురుగులు ఆకు కింద గుంపులు గుంపులుగా చేరి పత్ర హరితాన్ని గోకి రంధ్రాలు చేస్తాయి. గొంగళి పురుగులు తిన్న జల్లెడ రంధ్రాలు ఉన్న ఆకులను గుర్తించి నాశనం చేయాలి. అలాగే ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పెద్ద పురుగులు ఆకులను మొత్తం తిని ఈనెలను మిగిలిస్తాయి. ఈ జల్లెడాకులను ఏరి నాశనం చేయాలి. అలాగే నొవాల్యూరాన్ 1 మి.లీ. లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. లేదా విషపు ఎరలను పొలంలో అక్కడక్కడా వెదజల్లాలి.
- ❖ ఎండు తెగులును గమనించినప్పుడు 1 గ్రా. కార్బండిజమ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ అనే శిలీంధ్ర నాశనిని ఒక లీటరు నీటికి కలుపుకొని మొక్క మొదళ్ళలో బాగా తడిచేట్లు పోయాలి. అలాగే పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- ❖ ఈ మాసంలో వాతావరణంలో తేమ అధికంగా ఉండి వర్షాలు పడినప్పుడు బూజు తెగులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వాతావరణ హెచ్చరికలను అనుసరించి వర్షం వచ్చే ముందు లేదా కనీసం 6 గంటల ముందు 1 గ్రా. కార్బండిజమ్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్‌ను లీటరు నీటికి కలిపి మొక్కలు మొత్తం తడిచేలా పిచికారీ చేసుకోవాలి. తెగులు సోకిన గెలను కోసి దూరంగా వేసి తగలబెట్టాలి.
- ❖ రబీ ఆముదం సాగుకు అక్టోబర్ మొదటి పక్షం అనువైన సమయం.

- ఒక ఎకరానికి 2 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తనాన్ని విత్తే ముందు విత్తనశుద్ధి చేసుకోవాలి. ఒక కిలో విత్తనానికి 3 గ్రా. కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.
- ఈ మాసంలో దాసరి పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దాసరి పురుగు నివారణకు 1 గ్రా. థయోడికార్బ్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉండి, పురుగులు పెద్దవిగా ఉన్నప్పుడు లార్వాలు మొక్కలపై నుండి ఏరి నాశనం చేయాలి.
- పొగాకు లద్దె పురుగు చిన్నవిగా ఉన్నప్పుడు గొంగళి పురుగులు ఆకు కింద గుంపులు గుంపులుగా చేరి పత్ర హరితాన్ని తింటాయి.

**నువ్వులు :** ఆగస్టు మాసంలో వేసిన నువ్వులు ప్రస్తుతం పూత, కాయ కట్టే దశలో ఉంది. ఈ దశలో కోడు ఈగ, ఆకుముడత, కాయ తొలిచే పురుగు ఆశించే అవకాశాలు ఎక్కువ. వీటి నివారణకు 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

- బీహారి గొంగళి పురుగును గమనించినట్లయితే 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 1.0 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- వెర్రి తెగులు పూత సమయంలో ఆశిస్తుంది. తెగులు కనిపించిన వెంటనే తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. పైరుపై డైమిథోయేట్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- బూడిద తెగులు గమనించినట్లయితే నీటిలో కరిగే గంధకం పొడి 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**పొద్దుతిరుగుడు :** జూలై చివరి మాసంలో విత్తిన పొద్దుతిరుగుడు ప్రస్తుతం పూత దశలో ఉంది. ఈ దశలో 2 గ్రా. బోరాక్స్ లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారీ చేసుకున్నట్లయితే గింజలు బాగా తయారవుతాయి. మొదట బోరాక్స్‌ని వేడి నీటిలో కరిగించి తగిన ద్రావణం చేసుకోవాలి.

- ఈ దశలో శనగ పచ్చ పురుగు ఆశించే అవకాశం ఎక్కువ. దాని నివారణకు ఎకరానికి 4-5 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలి. దీని లద్దె పురుగులు, కోశస్థ దశలు గింజల మధ్య చేరి గింజలను తింటూ అధిక నష్టాన్ని కలుగజేస్తాయి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు క్వినాల్‌ఫాస్ లేదా క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లేదా 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- వర్షాలు పడినప్పుడు ఈ పంటపై ఆకుమచ్చ తెగులు వచ్చే అవకాశం ఎక్కువ. ఉష్ణోగ్రతలు తగ్గి చలి మొదలయినట్లయితే తుప్పు తెగులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ రెండు తెగుళ్ళ నివారణకు లీటరు నీటికి 3 గ్రా. మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పూత దశలో ఎక్కువగా వర్షాలు పడినట్లయితే పువ్వు కుళ్ళు తెగులు ఆశించి మొక్క చివరి భాగంలో, పువ్వు కింద ఉన్న ఆకులు శిలీంధ్రం ఆశించి ఎండిపోతాయి. దీని నివారణకు 3 గ్రా. గంధకం పొడి లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పొద్దుతిరుగుడులో ఏ దశలోనైనా నెక్రోసిస్ తెగులు ఆశించే అవకాశం ఉంది. ఈ తెగులు తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ తెగులు సోకిన మొక్కల ఆకుల ఈనె మధ్య భాగం ఎండిపోయి, మొదట బూడిద రంగుకు మారి తరువాత నల్లగా మారి వంకరలు తిరిగిపోతుంది. తెగులు సోకిన మొక్కలను 2 మి.లీ. ఫిప్రోనిల్ లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో మూడు నాలుగు సార్లు పిచికారీ చేసి ఈ తెగులు వ్యాప్తిని అరికట్టవచ్చు.

**కుసుమ :** ఈ పంటను నల్లరేగడి నేలలో వర్షాధారపు రబీ పంటగా సాగు చేసుకోవచ్చు. కుసుమ మంచి ప్రత్యామ్నాయ రబీ పంట. కొద్దిపాటి క్షారత్వం గల సమస్యాత్మక భూములలో కుసుమను లాభదాయకంగా పండించవచ్చును. అడవి పందుల బెడద ఎక్కువగా

ఉన్న ప్రాంతాలలో కుసుమను నిర్భయంగా సాగు చేసుకోవచ్చు.

❖ తెలంగాణలో సెప్టెంబర్ రెండవ పక్షం నుండి అక్టోబర్ మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు.

❖ కుసుమను ఏక పంటగా పండించేటప్పుడు పత్తి లేదా కంది పంటతో మార్పిడి చేయడం వలన కుసుమను ఆశించే ఎండు తెగులును రాకుండా నివారించుకోవచ్చు.

❖ కుసుమను శనగ లేదా ధనియాలతో 1:2 నిష్పత్తిలో అంతర పంటగా సాగు చేసుకుని అధిక నికర ఆదాయాన్ని పొందవచ్చు.

❖ నీరు నిలువని బరువైన నల్లరేగడి లేదా నీటి వసతి గల ఎర్ర గరప నేలలు ఈ పంట సాగుకు మిక్కిలి అనుకూలం. ఆమ్లత్వం గల భూములు పనికిరావు.

❖ ఏక పంటగా రబీలో వేసుకునేటప్పుడు వేసవి దుక్కి చేసి 2-3 సార్లు గుంటక తోలుకోవాలి. డి.సి.ఎచ్-129, పి.బి.ఎన్.ఎస్.-12 లేదా టి.ఎస్.ఎఫ్-1 రకాల విత్తనాన్ని సేకరించాలి.

❖ ఎకరానికి 4 కిలోల విత్తనాన్ని విత్తనశుద్ధి చేసుకొని 3 గ్రా. థైరమ్ లేదా 1 గ్రా. కార్బండిజమ్ కిలో విత్తనానికి గొర్రుతో గానీ నాగలి సాళ్ళలో గానీ 45 సెం.మీ. వరుసల మధ్య 20 సెం.మీ. మొక్కల మధ్య ఉండేటట్లు విత్తుకోవాలి.

❖ వర్షాధారపు పంటకు 30-40 కిలోల యూరియా, 60 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేసుకోవాలి. నీటి వసతి కింద పంట సాగు చేసినట్లయితే 50 శాతం యూరియా, పూర్తి సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చివరి దుక్కిలో వేసుకోవాలి. మిగతా 50 శాతం యూరియాను 35 రోజుల తర్వాత నీటి తడి కట్టేటప్పుడు వేసుకోవాలి.

❖ కుసుమ పంటకు తొలి దశలో పేను తాకిడి ఉంటుంది. పేను బంకను గమనించినట్లయితే డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

**సోయాచిక్కుడు :** సోయా పంట ప్రస్తుతం కాయ వృద్ధి చెందే దశలో ఉంది. ఈ దశలో పంటకు నీరు చాలా అవసరం. ఎక్కువ రోజులు బెట్ట వాతావరణం ఉన్న ప్రాంతాలలో నీటి వసతి ఉన్నచోట పంటకు ఈ తరుణంలో 1,2 తడులు 10 నుండి 15 రోజుల వ్యవధిలో ఇవ్వాలి. అప్పుడే దిగుబడి బాగా వస్తుంది.

❖ పంటకు సకాలంలో నీటి తడులు ఇవ్వడంతో పాటు పైపాటుగా కూడా 1,2 సార్లు పోషకాల పిచికారీ అధిక దిగుబడికి దోహదం చేస్తుంది. దీనికి గాను లీటరు నీటికి 10 గ్రా. మల్టి-కె లేదా 10 గ్రా. పాలీఫీడ్ (19:19:19) 10-15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

❖ ప్రస్తుతానికి సోయా పంటను అక్కడక్కడ పొగాకు లద్దె పురుగు ఆశించి ఆకులను, లేత కాయలను నష్ట పరుస్తోంది. దీని నివారణకు లీటరు నీటికి 1.5 గ్రా. థయోడికార్బ్ లేదా 1 మి.లీ. నొవాల్యూరాన్ లేదా 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ పిచికారీ చేయాలి.

❖ పంటపై ఈ దశలో వివిధ ఆకుమచ్చలు, కాయ ఎండు తెగుళ్ళు ఆశించే అవకాశం ఉంది. నివారణకు, ముందు జాగ్రత్తకు లీటరు నీటికి 2.5 గ్రా. కార్బండిజమ్ లేదా మాంకోజెబ్ పిచికారీ చేయాలి. తెగులు ఎక్కువగా ఉంటే లీటరు నీటికి ఒక మి.లీ. ప్రొపికొనజోల్ పిచికారీ చేయాలి.

**అపరాలు :** రబీలో నీటి పారుదల కింద 3-4 తడులు ఇచ్చే సౌకర్యం కలిగిన బోర్లు, బావుల కింద పెసర, మినుము, కంది పంటలను పండించవచ్చు.

❖ మిగులు తేమ, మంచును ఆధారంగా చేసుకొని లేదా 1-2 తేలికపాటి తడులిచ్చి నల్లరేగడి భూములలో శనగ పంటను పండించవచ్చు.

❖ చౌడు నేలలు తప్ప నీరు ఇంకే మధ్యస్థ, బరువైన నేలలు అనుకూలం.

❖ పెసర / మినుము / కంది పంటలను అక్టోబర్ 20 లోపు విత్తుకుంటే మంచి దిగుబడులు పొందవచ్చు.

❖ శనగ పంట అక్టోబర్ నెలలో విత్తుకుంటే పూత, పిందె దశలో బెట్ట, అధిక ఉష్ణోగ్రత సమస్య రాకుండా మంచి దిగుబడులు సాధించవచ్చు.

❖ ఆఖరి దుక్కిలో ఎకరానికి 18 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులు వేయాలి.

❖ కందిలో అదనంగా 18 కిలోల యూరియా విత్తిన 30-40 రోజులకు వేయాలి.

❖ శనగలో 18 కిలోల గంధకం నిచ్చే ఎరువు ఆఖరి దుక్కిలో వేయాలి.

**అనువైన రకాలు :**

**పెసర :** డబ్ల్యూ.జి.జి.-42, డబ్ల్యూ.జి.జి.-37, ఎన్.జి.జి.-295, ఎన్.జి.జి.-347, టి.ఎం.-96-2, ఎం.జి.జి.-351

**మినుము :** పి.యు-31, ఎల్.బి.జి.-752, ఎల్.బి.జి.-787, టి.బి.జి.-104

**శనగ :** జె.జి.-11, ఎం.బి.ఇ.జి.-3, ఎం.బి.ఇ.జి-47

**కంది :** డబ్ల్యూ.ఆర్.జి.-65, ఐ.సి.పి.ఎల్-87119, ఐ.సి.పి.ఎల్-85063, టి.డి.ఆర్.జి.-4

**విత్తనమోతాదు (ఎకరానికి) :** కంది - 8 కిలోలు, పెసర / మినుము - 6 కిలోలు, శనగ 25-30 కిలోలు

**విత్తనశుద్ధి :** పెసర / మినుములో కిలో విత్తనానికి 5 మి.లీ. మోనోక్రోటోఫాస్, 2.5 గ్రా. మాంకోజెబ్ ఆఖరిగా ఎకరం విత్తనానికి 200 గ్రా. రైజోబియం కల్చరును పట్టించాలి. శనగలో 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా 1.5 గ్రా. విటావిక్స్, 8 గ్రా. ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేసి ఆఖరిగా 8 కిలోల విత్తనానికి 200 గ్రా. రైజోబియం కల్చరును పట్టించి నీడలో ఆరబెట్టి తగు పదునులో విత్తుకోవాలి.

**విత్తేదూరం :** పెసర / మినుము, శనగ పంట 30×10 సెం.మీ., కంది 60-75×10 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి.

❖ విత్తిన 24 గంటలు లేదా మరుసటి రోజు బాగా తేమ ఉన్నప్పుడు పెండిమిథాలిన్ లీటరు నీటికి 5 మి.లీ. కలిపి ఎకరానికి 200 లీటర్ల ద్రావణం పిచికారీ చేసి కలుపును నివారించాలి.

❖ రబీలో కంది పంటను వేరుశనగలో అంతర పంటగా 1:7 లేదా 2:7 నిష్పత్తిలో విత్తవచ్చు.

❖ శనగ పంటను కొత్తిమీరతో 16:4 నిష్పత్తిలో అంతర పంటగా వేయవచ్చు.

**ప్రస్తుత పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :** రబీలో సెప్టెంబర్ రెండవ పక్షంలో విత్తిన పెసర / మినుములో బెట్ట / వేడి వాతావరణ పరిస్థితులు రసం పీల్చే

## రాష్ట్రంలో నిషేధింపబడిన క్రిమి సంహారక మందుల జాబితా

ఈ దిగువ పేర్కొనబడిన క్రిమి సంహారక మందులు రాష్ట్రంలోని పురుగు మందుల పరీక్షా కేంద్రాలలో నాసిరకంగా నమోదు అయ్యాయి. అందువలన కింద సూచించిన తయారీ కంపెనీల బ్యాచ్ నెంబర్లు గల క్రిమి సంహారక మందులు నిల్వ చేయడం, అమ్మడం నిషేధించాం. రైతులు ఈ విషయాలను గమనించాలి.

| క్ర.సం | కంపెనీ పేరు | నాసిరకంగా గుర్తించిన పురుగుమందు | బ్యాచ్ నెం. |
|---|---|---|---|
| 1. | అస్త్రో అగ్రిటెక్ ఇండియా ప్రై.లిమిటెడ్ సికింద్రాబాద్ | మోనోక్రోటోఫాస్ 36 శాతం ఎస్.ఎల్.(ట్రేడ్‌నేమ్ -మోనోషెల్) | ఎంకె01 |
| 2. | శ్రీ ఇండస్ట్రీస్, కర్ణాటక | ఎసిఫేట్ 75 శాతం ఎస్.పి.(ట్రేడ్‌నేమ్- శ్రీథేన్) | 03 |
| 3. | అగ్రిసన్ క్రాప్ సైన్స్, రాజ్‌కోట్ | ప్రొఫెనోఫాస్ 50శాతం ఇ.సి.(ట్రేడ్‌నేమ్- సన్‌ఫెక్స్) | ఎసి-06 |
| 4. | ఎలికోన్ ఆర్గానిక్ | హెక్సాకొనజోల్ 5 శాతం ఎస్.సి (ట్రేడ్‌నేమ్-కాంటెక్‌ప్లస్) | 001 |
| 5. | బాయార్డ్ ఆగ్రోసైన్సెస్ ప్రై.లిమిటెడ్ | ఫిప్రోనిల్ 5 శాతం ఎస్.సి.(ట్రేడ్‌నేమ్-రాపిడ్) | బిఎ/ఎఫ్ఎస్/001 |

పురుగులు ఆశిస్తే మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తొలి దశలో విత్తిన 25-30 రోజుల వరకు కలుపు లేకుండా చూడాలి. అవసరం మేరకు తేలిక పాటి తడి ఇచ్చి భూమి బెట్టకు రాకుండా అంతరకృషి చేస్తే పైరు ఎదుగుదలకు తోడ్పడుతుంది.

- ❖ కంది మధ్యకాలిక రకాలు ఎదుగుదల దశలో, స్వల్పకాలిక రకాలు ఎదుగుదల / మొగ్గ దశలో ఉంటాయి. బెట్ట పరిస్థితులలో రసం పీల్చే పురుగులు పచ్చదోమ / పేనుబంక ఆశిస్తాయి. వీటిని వేపనూనె 5 మి.లీ., ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించాలి.
- ❖ స్వల్పకాలిక కంది పూతకు త్వరగా వస్తుంది. ఎప్పటికప్పుడు గమనించి పైన సిఫారుసు చేసిన రసాయనాలు మొగ్గ దశలో పిచికారీ చేసి పూత దశలో క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ., నొవాల్యూరాన్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే శనగ పచ్చ పురుగు, మారుకా మచ్చల పురుగు ఉధృతిని తగ్గించవచ్చు.
- ❖ కందిలో అవసరం మేరకు అంతరకృషి చేస్తే తేమ కప్పబడి బెట్ట రాకుండా కాపాడుతుంది.
- ❖ బెట్ట పరిస్థితులలో 2 శాతం యూరియా ద్రావణం లేదా లీటరు నీటికి 5 గ్రా. మల్టికె కలిపి పిచికారీ చేస్తే పంటకు ఉపయోగకరం.

**పత్తి :** ప్రస్తుతం పత్తి పంట మంచి పూత, కాత దశలో ఉంది. ముందుగా జూన్‌లో వేసి మంచి పాటు చేసిన పత్తిలో చెట్టుకు సరాసరి 25 కాయల వరకు వృద్ధి చెందుతున్నాయి.

- ❖ గులాబీ రంగు కాయ తొలిచే పురుగు అక్టోబర్ / నవంబర్ మాసాలలో చలికాలంలో పత్తిని ఆశించి నష్టపరిచే అవకాశం ఉంది. కావున అక్టోబర్ మొదటి పక్షం నుండి గులాబీ రంగు పురుగు ఉధృతిని గమనిస్తూ, నియంత్రణ చర్యలు చేపట్టాలి.
- ❖ ఈ దశలో ఆశించే గులాబీ పురుగు నివారణకు చేనులో 10 శాతం గుడ్డిపూలు లేదా 10 శాతం పురుగు ఆశించిన కాయలను గమనించినా సస్యరక్షణ చర్యలను వెంటనే చేపట్టాలి. ఈ దశలో ముఖ్యంగా ఇండాక్సాకార్బ్ 1 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.4 లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా. లాంటి మందులలో ఏదైనా ఒకదానిని లీటరు నీటికి చొప్పున కలిపి మందులు మారుస్తూ అవసరాన్ని బట్టి వారం - పదిరోజుల కొకసారి పిచికారీ చేయాలి.
- ❖ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే సింథటిక్ పైరిత్రాయిడ్ మందులైన సైపర్‌మెత్రిన్ లేదా లామ్డాసైహాలోత్రిన్ లాంటి వాటిని ఒక లీటరు నీటికి ఒక మి.లీ. చొప్పున లేదా లామ్డా సైహాలోత్రిన్ + క్లోరాంట్రానిలిప్రోల్ 0.5 మి.లీ. ఒకటి, రెండుసార్లు, పిచికారీ చేసుకొంటే ఫలితం బాగుంటుంది.
- ❖ ప్రస్తుత బెట్ట వాతావరణంలో పత్తి పంటను చాలా చోట్ల పచ్చదోమ, తామర పురుగులు, పిండినల్లి ఆశించి నష్టపరుస్తున్నాయి. వీటికి తోడు చలికాలంలో అక్టోబర్ రెండవ పక్షం నుండి పత్తిని తెల్లదోమ, పేనుబంక ఆశించే అవకాశం ఉంది.
- ❖ పచ్చదోమ ఎక్కువగా ఉంటే ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లీటరు నీటికి కలిపి మందు మారుస్తూ పిచికారీ చేయాలి.
- ❖ తామర పురుగు ఎక్కువగా ఉంటే ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డైఫెన్ థయూరాన్ 1.25 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ❖ పిండినల్లి ఆశించినప్పుడు మొదటగా అక్కడక్కడ పురుగు బాగా ఆశించిన మొక్కలను పెరికి వేసి కాలబెట్టాలి. పురుగు ఉధృతి మామూలుగా అక్కడక్కడ మొక్కల మీద ఉంటే ఆశించిన మొక్కలపై పిచికారీ చేయడం లేదా చేనులో పురుగు చాలా మొక్కలపై ఉంటే అప్పుడు లీటరు నీటికి 3 మి.లీ ప్రొఫెనోఫాస్ లేదా 2.0 గ్రా. ఎసిఫేట్ లేదా 1.6 మి.లీ. బ్యుప్రొఫెజిన్ లాంటి

మందులను 1 మి.లీ. సాండోవిట్ లేదా టీ పాల్ లాంటి జిగురు మందుతో కలిపి చెట్లు తడిచేటట్లుగా చేనంతా బాగా పిచికారీ చేయాలి. అవసరముంటే వారం - పది రోజులలో మందు మార్చి రెండవ సారి పిచికారీ చేయాలి.

- తెల్లదోమ ఆశించినప్పుడు లీటరు నీటికి 2 మి.లీ. ట్రైజోఫాస్ లేదా 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా 2 మి.లీ. ఫిప్రోనిల్ లేదా 1.25 మి.లీ. డైఫెన్ థయూరాన్ లాంటి మందులను 1500 పి.పి.ఎం గల 5 మి.లీ. వేపనూనెతో కలిపి బాగా పిచికారీ చేయాలి. అలాగే తెల్లదోమ నివారణకు ఎకరాకు 15-20 వరకు మార్కెట్‌లో లభించే పసుపు రంగు జిరుగు కార్డులను చేనులో అమర్చాలి.
- రసం పీల్చే పురుగులతో పాటు పత్తిపై ఆకుమచ్చలు, బాక్టీరియా నల్లమచ్చలు ఆశిస్తున్నాయి. కావున నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. కార్బండిజమ్ + మాంకోజెబ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్, 0.1 గ్రా. ప్లాంటోమైసిన్ అంటీబయాటిక్ పొడిని కలిపి పిచికారీ చేయాలి.
- పురుగు మందులతో పాటు కాయ తయారయ్యే దశలో లీటరు నీటికి 10 గ్రా. మల్టికె లేదా పాలీఫీడ్ (19:19:19) లేదా యూరియాను ప్రతి 10 రోజుల వ్యవధిలో ఒకసారి కలిపి 2 లేదా 3 సార్లు పిచికారీ చేయాలి. దీనివలన కాయ ఎదుగుదల బాగుండి ఎక్కువ దిగుబడికి దోహదపడుతుంది.
- 100 రోజుల దాటిన పత్తి పంటకు భూమి ద్వారా ఎరువులు అందించవలసిన అవసరం లేదు, గొర్రు, గుంటకల ద్వారా పశువులతో చేసే అంతరకృషి కూడా ఆపివేయాలి.

**చెరకు :** ఈ మాసంలో చెరకు పరిపక్వ దశలో ఉంటుంది. చెరకు రస పక్వతలో వచ్చే మార్పులలో అధిక భాగం కనిష్ట ఉష్ణోగ్రతపై ఆధారపడి ఉంటుంది. అంటే చెరకు రసంలో పంచదార పాలు హెచ్చుగా ఉండడానికి వాతావరణం చల్లగాను, పొడిగాను, గాలిలో తేమ తక్కువగా ఉన్నట్లయితే చెరకులో పంచదార కూడిక ఎక్కువగా ఉంటుంది.

- రైతులు పక్వదశలో ఎరువులు వేయడం వలన లాభం కన్నా నష్టం జరిగే అవకాశం ఉంటుంది. అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, నత్రజని ఎరువులు వేయడం వలన చెరకు పంట ఆలస్యంగా పక్వానికి వస్తుంది. అంతే కాకుండా నత్రజని ఎరువులు వేయడం వలన చెరకులో లేవడితనం ఎక్కువయి చెరకు రసంలో సేంద్రియ ఆమ్లాలు శాతం అధికంగా ఏర్పడి నాణ్యత లోపిస్తుంది. ఇలా అధికంగా ఉన్న నత్రజని వలన రసంలో తగినంత భాస్వరం ఉండక ఫ్యాక్టరీలో రసం శుభ్రపడక నాణ్యత కోల్పోతుంది.

చెరకులో ఆకురాల్చడం, జడ చుట్టడం వంటి పైపాటి పనులు పరోక్షంగా రస నాణ్యతను పెంచడానికి దోహదం చేస్తాయి. అదే విధంగా మట్టిని ఎగదోయడం వలన చెరకు పడిపోకుండా ఉండి, పిలకలు కూడా ఒకేసారి పక్వానికి వచ్చి రస నాణ్యతను పెంచేందుకు దోహదం చేస్తాయి. దీని వలన దూదేకుల పురుగు, తెల్లపేను, తెల్లనల్లి పురుగుల ఉధృతిని కూడా తగ్గించవచ్చు.

వాతావరణంలో 19-35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, 80-90 శాతం గాలిలో తేమ ఉన్నప్పుడు తెల్ల పేను (ఊలి ఎఫిడ్) అభివృద్ధి చెందుతుంది. దీని తల్లి, పిల్ల పురుగులు ఆకుల అడుగుభాగంలో గుంపులుగా ఉండి రసాన్ని పీల్చడం వలన తెలుపు, పసుపు వర్ణం మిళితమైన మచ్చలు ఏర్పడతాయి. మొదట అంచులు తర్వాత మొత్తం ఆకులు క్రమేపి ఎండిపోతాయి. ఈ పురుగుల విసర్జన తియ్యని జిగట పదార్థం బాగా ఉండి కిందనున్న ఆకులపై భాగాన పడి, దాని మీద సూటీమోల్డ్ అనే నల్లని శిలీంధ్రం పెరిగి ఆకు మసిబారుతుంది. దీని నివారణకు పంటకు సిఫారసు చేసిన మోతాదులో నత్రజని ఎరువులు వాడాలి. పురుగు ఆశించిన ఆకులను తీసి తగులబెట్టాలి. లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. మోతాదులో కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఆశించిన తోటల నుండి చెరకును ఇతర ప్రాంతాలకు రవాణా చేయకూడదు.

(ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సహకారంతో..)



# వాతావరణం - పంటల పరిస్థితి

డా.జి.శ్రీనివాస్, ప్రధాన శాస్త్రవేత్త - అధిపతి,
వ్యవసాయ వాతావరణ పరిశోధనా కేంద్రం, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, రాజేంద్రనగర్, ఫోన్. 040-24016901

రాష్ట్రంలో 01-06-2021 నుండి 29-09-2021 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 714.7 మి. మి. గాను 1009.5 మి.మి అనగా సాధారణ వర్షపాతం కంటే 41% ఎక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో వివిధ జిల్లాలో ఇప్పటివరకు నమోదైన వర్షపాతం ప్రకారం ఆదిలాబాద్, కొమరంభీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, జనగాం, యదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, నల్గొండ, ఖమ్మం, నారాయణపేట జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. మంచిర్యాల్, పెద్దపల్లి, జోగులాంబ గద్వాల్, నగర్ కర్నూల్, సూర్యాపేట, ములుగు జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైనది.

రాష్ట్రంలో 22.09.2021 వరకు వానాకాలం పంటకాలానికి విస్తీర్ణం గమనిస్తే సాధారణ విస్తీర్ణంలో(ఎకరాలలో) వరి - 182 శాతం (6175534), జొన్న - 32 శాతం (37409), మొక్కజొన్న - 71 శాతం (704487), కంది - 89 శాతం (759832), పెసర - 43 శాతం (88339), మినుములు - 71 శాతం (47251), వేరుశనగ - 65 శాతం (28483), ఆముదము - 8 శాతం (5333), సోయాచిక్కుడు - 83 శాతం (373698), పత్తి - 97 శాతం (4625556) సాగు చేశారు.

ఈ సంవత్సరం ఖరీఫ్‌లో ఇప్పటి వరకు పప్పుదినుసులు 67 శాతం, మొత్తం ఆహారధాన్యాల పంటలు 138 శాతం, నూనె గింజల పంటలు 69 శాతం, మొత్తం మీద 111 శాతం వరకు పంటలు సాగుచేశారు.

### వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు :

- వర్షాలు అధికంగా కురిసిన ప్రాంతాలలో వరిలో బాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించకుండా, తెగులు ఆశిస్తే నివారించడానికి నత్రజని ఎరువులను తాత్కాలికంగా (5-7 రోజులు) వాయిదా వేయాలి.
- వరిలో తాటాకు తెగులు, కాండంతొలిచే పురుగు ఆశించడానికి అనుకూలం. పురుగు, తెగులు గమనించినట్లయితే, నివారణకు
- తాటాకు తెగులు - 2 మి.లీ. క్వినాల్ ఫాస్ లేదా ప్రొఫినోఫాస్ లేదా 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

2020 జూలై నాటికి వ్యవసాయ పాడిపంటలు పత్రిక ప్రారంభమై 77 ఏళ్ళు పూర్తిచేసుకుని 78వ వడిలోకి అడుగు పెట్టింది. ఈ చారిత్రక నేపథ్యంతో జనవరి 2021 నుంచి పత్రిక సంపుటి సంఖ్యను 79గా సరిచేసాం. ఈ మార్పును గమనించగలరు.
- సం.

- కాండంతొలిచే పురుగు - 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలను ఎకరా పొలంలో వేసుకోవాలి.
- వరిలో మానిపండు తెగులు సోకడానికి అనుకూలం. తెగులు గమనిస్తే నివారణకు 1 మీ.లీ. ప్రొపికోనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- అధిక వర్షాల వలన నల్లరేగడి నేలలోని పత్తికి ఎండు తెగులు సోకడానికి అవకాశం ఉన్నది. నివారణకు, 3 గ్రా. కాపర్ఆక్సిక్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పత్తిలో కాయ కుళ్ళు తెగులు, బ్యాక్టీరియా నల్ల మచ్చ తెగులు సోకడానికి అనుకూలం, నివారణకు 10 లీటర్ల నీటికి 1గ్రా. పోషామైసిన్ లేదా 1గ్రా. స్ట్రెప్టోసైక్లిన్, 30 గ్రాములు కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును కలిపి 15 రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారీ చేసుకోవాలి.
- కందిలో ఫైటాప్తోర ఎండు తెగులు గమనిస్తే నివారణకు, 2 గ్రా. మ్యాంకోజేబ్ మందును లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.
- వంగలో కొమ్మ, కాయతొలిచే పురుగు నివారణకు, పురుగు సోకిన కొమ్మలను తుంచి నాశనం చేయాలి, 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా 0.4 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- కూరగాయ పంటలలో రసంపీల్చే పురుగుల నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ లేదా 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- దక్షిణ తెలంగాణ జిల్లాల్లో నల్ల రేగడి నేలల్లో నిలువ ఉండే తేమను ఉపయోగించుకుంటూ శనగ, కుసుమ పంటలను అక్టోబర్ రెండవ పక్షంలో విత్తుకోవాలి.
- నీటి వసతి గల ప్రాంతాలలో ఆరు తడి పంటలైన మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలను విత్తుకోవాలి.

## వ్యవసాయశాఖ తెలుగు వెబ్ సైట్ సందర్శకుల వివరాలు




http://vyavasayam.telangana.gov.in 30 సెప్టెంబర్ 2021 నాటికి తెలుగు వెబ్‌సైట్ సందర్శకుల సంఖ్య : 11,31,746
పై వెబ్‌సైట్ నుండి వ్యవసాయ పాడిపంటలు సాఫ్ట్ కాపీని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

# కవర్‌పేజీల కథనాలు..

## మొదటి కవర్..

## దొడ్డు వడ్లను కేంద్రం కొనుగోలు చేయాలి

ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గనిర్దేశనంలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ అనుకూల విధానాలతో ముందుకు సాగుతోంది. వరి సాగు నుండి నూనె, పప్పుగింజలు, ఆయిల్ పామ్ సాగు వైపు రైతాంగాన్ని మళ్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. 2020 – 21 రెండు సీజన్లు కలిపి 141.01 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఎఫ్ సీ ఐ ద్వారా సేకరించి తెలంగాణ దేశంలో రెండో స్థానంలో నిలిచింది పంటల మార్పిడి అనేది నిరంతర ప్రక్రియ .. ఒకేసారి ఆకస్మికంగా రైతులు ఇతర పంటలకు మళ్లడం అనేది కష్టతరం .. కావున దొడ్డు వడ్లను సేకరించం అనే ఎఫ్ సీ ఐ నిర్ణయం వాయిదా వేయాలి. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. రూ.15 వేల కోట్లు రైతుబంధు, రూ.1440 కోట్లు రైతుబీమా, రూ.25 వేల కోట్లు సాగునీటి ప్రాజెక్టులు, రూ.10 వేల కోట్లతో వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరంటు సరఫరా, పంటల కొనుగోళ్లు ఇలా దాదాపు రూ.55 వేల కోట్ల నుండి రూ.60 వేల కోట్లు వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు ఖర్చు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. రాష్ట్ర స్థూల ఆదాయంలో వ్యవసాయ రంగం వాటా 2013 – 14 లో 13.8 శాతం నుండి 2019 – 20కి 19.3 శాతం, 2020 – 21కి 20.90 శాతానికి పెంచుకున్నాం. కరోనా క్లిష్ట పరిస్థితులను తట్టుకుని నిలబడడం విశేషం. రాష్ట్ర తలసరి ఆదాయం 2013-14లో రూ.1.12 లక్షల నుండి 2019-20కి 103 శాతం వృద్ధితో రూ.2.28 లక్షలకు చేరుకుని దేశంలో 14 వ స్థానం నుండి 5 స్థానానికి చేరుకున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ అనుకూల విధానాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టి చెంది ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయి. వ్యవసాయం, పంటల ఉత్పత్తిలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్రాలు వృద్ధిచెందేందుకు కేంద్రం తోడ్పాటునందించాలి. వరికి ప్రత్యామ్నాయంగా 20 లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగును అత్యంత ప్రాధాన్యతగా ముందుకు తీసుకెళుతున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్‌కు వంద శాతం రాయితీపై నిధులను ఉదారంగా కేటాయించాలి. వంటనూనెల దిగుమతుల మీద ఏటా రూ.70 వేల కోట్లు ఖర్చు చేస్తోంది.. ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం ద్వారా ఆ ఖర్చును తగ్గించవచ్చు. వ్యవసాయరంగంలో ప్రాధాన్యత లేని రాష్ట్రాలకు బదులు వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇచ్చే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, చత్తీస్‌ఘడ్, తమిళనాడు వంటి రాష్ట్రాలకు కేంద్రం ప్రాధాన్యతనిచ్చి అధిక నిధులు కేటాయించాలి. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా దేశంలో పంటల ఉత్పత్తి ఉండేలా రాష్ట్రాలకు కేంద్ర ప్రోత్సాహం ఉండాలి. రాష్ట్రాల అవసరాలు, వ్యవసాయ పథకాల ప్రాధాన్యతను గుర్తించి దానికి అనుగుణంగా కేంద్రం నుండి నిధులు కేటాయించాలి. 13 సెప్టెంబర్ 2021న బిఆర్ కెఆర్ భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి శోభ కరంద్లాజే గారితో సమావేశంలో తెలంగాణ వ్యవసాయ ప్రగతి, వ్యవసాయ పథకాలను వివరించి, రాష్ట్రానికి నిధులు పెంచాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కోరారు.

కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభ కరంద్లాజే మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల మీద దృష్టి సారించాలన్నారు. ఎగుమతులు పెరిగితేనే రైతుల ఆదాయం రెట్టింపు అవుతుంది. దేశంలో మనం పండించిన పంటలు అధికశాతం మనం వినియోగానికే పరిమితం అవుతున్నాయి. పంటల సాగులో ఎరువులు, రసాయనాల వినియోగం తగ్గించి, వరి ధాన్యం, కూరగాయలు, పండ్ల ఉత్పత్తిలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించినప్పుడే ఇతర దేశాలకు ఎగుమతి చేయగలుగుతాం. ఈ దిశగా రైతులు దృష్టి సారించాలని అన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్, ఐ.ఎ.ఎస్., కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి శోమిత బిశ్వాస్, ఐ.ఎ.ఎస్., రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్. వ్యవసాయ ప్రత్యేక కమీషనర్ హన్మంతు కొండిబ, వ్యవసాయ అదనపు సంచాలకులు కె.విజయ్‌కుమార్ టి.ఎస్.ఆగ్రోస్ ఎండీ కె.రాములు, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## మూడవ కవర్..

# అగ్రిహబ్ ప్రారంభం

30 ఆగస్టు 2021 న రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, కె.తారకరామారావు, సబిత ఇంద్రారెడ్డిలు అగ్రి హబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పురపాలక, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు మాట్లాడుతూ.. రైతులకు తెలిసినన్ని విషయాలు ఎవరికీ తెలియదని, వారికి సమస్య, పరిష్కారం రెండూ తెలుసునని మనం ఆ పరిష్కారాలకు సాంకేతిక సొబగులు అద్దాలని అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతోందని అందుకు అనుగుణంగా సాంకేతిక వినియోగం పెరగాలని అన్నారు. అగ్రి హబ్ ద్వారా రైతులకు మెరుగైన సాంకేతిక సహకారం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ యువతకు అగ్రి హబ్ ఒక వేదిక కావాలని, ఆవిష్కరణలో వారిని భాగస్వాములను చేయాలని వర్సిటీ అధికారులకు సూచించారు. వారు రూపొందించే ప్రతి పరికరాన్ని అగ్రి హబ్ వేదికగా మరింత అభివృద్ధి పరచాలని తెలిపారు. అగ్రి హబ్‌లో ప్రతి బోర్డును తెలుగులో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన 2601 రైతు వేదికలకు టి–ఫైబర్ ద్వారా హైస్పీడ్ ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీని వల్ల విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతులు నేరుగా మాట్లాడే అవకాశం కలుగుతుందని అన్నారు.

ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. అగ్రి హబ్ ప్రారంభోత్సవం తెలంగాణలో వ్యవసాయ ఆవిష్కరణలకు తొలి అడుగని అన్నారు. రైతులు సాంప్రదాయ వ్యవసాయం నుంచి సాంకేతిక వ్యవసాయం వైపు మళ్ళాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు సగటున ఏటా సుమారు 60 వేల కోట్లు ఖర్చు చేస్తున్నది ఒక్క తెలంగాణ ప్రభుత్వమేనని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎం.పి. రంజిత్ రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్., నాబార్డు చైర్మన్ చింతల గోవిందరాజులు సహా పలువురు ప్రజా ప్రతినిధులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## నాల్గవ కవర్..

# చిరుధాన్యాలతోనే పోషక భద్రత

టి.ఎస్.అగ్రోస్ బోర్డు సమావేశం సందర్భంగా రాజేంద్రనగర్‌లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధన (ఐఐఎంఆర్) సంస్థలోని వివిధ యూనిట్లను రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్., వ్యవసాయ శాఖ ప్రత్యేక కమీషనర్ హన్మంతు కొండిబ, హాజరయ్యారు.

ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి మాట్లాడుతూ.. చిరుధాన్యాలతోనే పోషక భద్రత. పంటల మార్పిడిలో భాగంగా నూనెగింజలతో పాటు చిరుధాన్యాలను ప్రభుత్వం ప్రోత్సాహిస్తుంది. అన్నిరకాల చిరుధాన్యాలు ఆహారంలో ఉంటేనే సరయిన పోషకభద్రత. చిరుధాన్యాల సాగు వైపు రైతులు దృష్టి సారించాలి. పేద రైతులే చిరుధాన్యలను పండిస్తారన్న ధోరణి పోవాలి. ప్రతి రైతు తన పొలంలో 10 నుండి 20 శాతం సాగుభూమిని చిరుధాన్యాల సాగుకు కేటాయించాలి. వ్యవసాయ శాఖ చిరుధాన్యాల సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో మరింత అవగాహన పెంచి చైతన్యవంతం చేస్తుంది. ఇదివరకే అందుబాటులో ఉన్న ప్రాసెసింగ్ సౌకర్యాలు క్షేత్రస్థాయికి చేరాలి. చిరుధాన్యాల మార్కెటింగ్ పై వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ల సదుపాయాలు క్షేత్రస్థాయికి చేరేందుకు అగ్రోస్ సంస్థ కృషిచేయాలి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) సహకారంతో ఔత్సాహిక యువతను అగ్రి ఎంటర్ ప్రీనర్స్, స్టార్టప్స్ ద్వారా చిరుధాన్యాల ప్రాసెసింగ్ వైపు మళ్లించాలి. ఈ దిశగా ఐఐఎంఆర్ చేస్తున్న కృషి అభినందనీయం. అన్నిరకాల చిరుధాన్యాలకు కేంద్రం కనీస మద్దతుధర ప్రకటించాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో రాబోయే ఫుడ్ ప్రాసెసింగ్ సెజ్ లలో యూనిట్ల ఏర్పాటులో ఐఐఎంఆర్ ముందుకురావాలి ప్రజలందరూ చిరుధాన్యాల వినియోగాన్ని పెంచుకోవాలని అన్నారు..

ఈ సమావేశంలో ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ విలాస్, న్యూట్రిహబ్ సీఈఓ డా.దయాకర్ రావు, టి.ఎస్.అగ్రోస్ ఎండీ కె.రాములు, తదితరులు పాల్గొన్నారు.



# యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటల సాగు

డా.జి.సంతోష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కె.స్వాతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, యు.నాగభూషణం, సీనియర్ శాస్త్రవేత్త,
ఎం.బలరాం, అసోసియేట్ డీన్, వ్యవసాయ కళాశాల, వరంగల్

తెలంగాణ ప్రభుత్వం యాసంగిలో వరికి బదులుగా ఇతర పంటలను వేసుకోవాల్సిందిగా రైతులకు సూచన చేసింది. కేంద్రం వద్ద 5 సంవత్సరాలకు సరిపడా నిల్వలు ఉండడంతో ఒక్క కిలో బాయిల్డ్ రైస్ కూడా కొనే పరిస్థితి లేదు. గత యాసంగిలో కరోనా పరిస్థితుల దృష్ట్యా నష్టపోవద్దనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సుమారు 2,000 కోట్ల రూపాయలు అదనంగా వెచ్చించి 92 లక్షల టన్నుల ధాన్యం సేకరించింది. కానీ ఈ సంవత్సరం పైన తెలిపిన పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం వరి ధాన్యాన్ని కొనే పరిస్థితి ఉండకపోవచ్చు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు యాసంగిలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన శనగలు, వేరుశనగలు, పెసర్లు, మినుములు, ఆవాలు, పొద్దుతిరుగుడు వంటి పంటలను సాగుచేసుకోవడం ఉత్తమం. వరికి ప్రత్యామ్నాయంగా ఇతర ఆరుతడి పంటలను పండించడం వలన తక్కువ ఖర్చు, తక్కువ నీటి వినియోగంతో పంట సాగుదలను పూర్తి చేసుకోవచ్చు.

**ఆరుతడి పంటలతో లాభాలు :**

- ఆరుతడి పంటలకు పెట్టుబడి, విద్యుత్ ఖర్చు తక్కువ.
- ఆరుతడి పంటలుగా పప్పుజాతి పంటలను పండించడం ద్వారా భూసారాన్ని వృద్ధి చేసుకోవచ్చు. లెగ్యూమ్ / పప్పుజాతి మొక్కల వేర్లలో ఉండే రైజోబియం బాక్టీరియా గాలిలో ఉండే నత్రజనిని భూమిలో స్థిరీకరించి భూమిని సారవంతం చేస్తుంది.
- చాలా వరకు ఆరుతడి పంటలలో వరితో పోల్చుకున్నట్లయితే తక్కువ కాల వ్యవధిలో పంటకాలం పూర్తవుతుంది. దీనివల్ల జనవరి, ఫిబ్రవరి మాసాల్లో తక్కువ కాల వ్యవధి గల ఇతర పంటలను వేసవి పంటలుగా వేసుకునే వెసులుబాటు దొరుకుతుంది.
- ఆరుతడి పంటలతో పంట మార్పిడి వల్ల పంటలను ఆశించే పురుగులు, తెగుళ్ళ బెడద కూడా తగ్గుతుంది.
- ఆరుతడి పంటలుగా పప్పుజాతి పంటలను వేసుకున్నట్లయితే, పంటకు అవసరమయ్యే పోషకాలు తక్కువ కావున పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుంది.

**ఏయే పంటలను సాగు చేసుకోవాలి :** ఆరుతడి పంటలను వేసుకునేటప్పుడు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు - నేల రకం, నీటి లభ్యత, సరైన పోషక యాజమాన్యం, మార్కెట్ డిమాండ్.

**నేల రకం :** నేల రకాన్ని బట్టి దానిలో వేసుకోబోయే పంటలను ఎన్నుకోవాలి. తేలికపాటి నేలలో వేరుశనగ, ఆముదం వంటి పంటలను పండించుకోవచ్చు. అదే పూర్తిగా నల్లరేగడి నేలలయినట్లయితే శనగ పంటను, తేలిక పాటి నల్లరేగడి నేలల్లో మొక్కజొన్న, జొన్న, రాగి, పెసర వంటి పంటలను ఎన్నుకోవాలి.

**నీటి లభ్యత :** ఆరుతడి పంటలలో కూడా నీటి అవసరం వేర్వేరు పంటల్లో వేర్వేరుగా ఉంటుంది. రాగిలో నీటి అవసరం చాలా తక్కువగా ఉంటుంది. (250-300 మి.మీ.). **నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు రాగితో పాటు పొద్దుతిరుగుడు, చిరుధాన్యాలను ఎన్నుకోవాలి.** కొంచెం నీటి లభ్యత ఎక్కువగా ఉన్నప్పుడు మొక్కజొన్న,కుసుమ, పెసర వంటి పంటలు పండించుకోవచ్చు. ఆరుతడి పంటల్లో నీటి వినియోగం తక్కువే అయినప్పటికి, కొన్ని కీలక దశల్లో నీటి ఎద్దడి వల్ల పంట దిగుబడి తీవ్రస్థాయిలో ప్రభావితమయ్యే అవకాశం ఉంది. కావున కీలక దశల్లో నీటి ఎద్దడి ఏర్పడకుండా, ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. చాలా పంటల్లో పూత దశ కీలకమైనది. ఈ దశలో నీటి ఎద్దడి వల్ల మొగ్గలు, పూవులు, కాయలు రాలిపోయి దిగుబడి చాలా వరకు తగ్గిపోతుంది. కావున పూత దశలో ఖచ్చితంగా 1-2 తడులు ఇచ్చుకునే విధంగా చూసుకోవాలి.

**ఆరుతడి పంటలకు అవసరమైన నీటి పరిమాణం, కీలక దశలు :**

**పొద్దుతిరుగుడు** – 400 మి.మీ. నీటి పరిమాణం అవసరం. మొగ్గలు ఏర్పడే దశ, పూత, గింజలు పాలు పోసుకునే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

**కంది, పెసర** – 300 మి.మీ. నీటి పరిమాణం అవసరం. పూత, గింజలు ఏర్పడే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

**రాగి** – 250 మి.మీ. నీటి పరిమాణం అవసరం. పూత, గింజలు పాలు పోసుకునే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

**వేరుశనగ** – 500 మి.మీ. నీటి పరిమాణం అవసరం. ఊడలు దిగే దశ, పూత, గింజలు నిండే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

**మొక్కజొన్న** – 600 మి.మీ. నీటి పరిమాణం అవసరం. పూత, గింజలు పాలు పోసుకునే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

రైతులు సూక్ష్మనీటి పారుదల (డ్రిప్ / స్ప్రింక్లర్) పద్ధతులను అవలంబిస్తే చాలా తక్కువ నీటితో కావాల్సిన నీటి తడులను అందించుకోవచ్చు.

**పోషక యాజమాన్యం :** ఆరుతడి పంటల్లో కీలక దశలైన పూత, గింజలు నిండే దశల్లో స్థూల, సూక్ష్మ పోషకాల కొరత లేకుండా చూసుకోవాలి. ఉదాహరణకు వేరుశనగలో ఊడలు దిగే, పూత దశల్లో కాల్షియం లోపం వల్ల కాయల సంఖ్య తగ్గడం, కాయల్లో గింజలు నిండుకోకపోవడం జరుగుతుంది. దీనిని నివారించడానికి ఎకరానికి 200 కిలోల జిప్సంను ఊడలు దిగే సమయంలో వేసుకోవాలి. అలాగే పొద్దుతిరుగుడులో పూత దశలో బోరాన్ లోపం వల్ల గింజలు తాలుగా ఏర్పడడం, పూత రాలిపోవడం వంటివి గమనించవచ్చు. వీటి నివారణకు బోరాక్స్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పూత దశలో పిచికారీ చేయాలి.

**మార్కెట్ డిమాండ్ :** ఆరుతడి పంటలను విత్తుకునే ముందుగా మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకోవాలి. డిమాండ్ గల పంటలను పండించడం వల్ల పండిన పంటను నిల్వ ఉంచాల్సిన అవసరం లేకుండా, వెంటనే అమ్ముకోగలిగే వీలుంటుంది.

**యాసంగిలో విత్తుకోదగిన ఆరుతడి పంటల వివరాలు :**

**పొద్దుతిరుగుడు :** నవంబర్– డిసెంబర్‌లో అనువైనది. పంట కాలం 90–95 రోజులు. విత్తన మోతాదు 2.5–3.0 కిలోలు / ఎకరానికి. విత్తే దూరం – తేలిక నేలలు 45×20–25 సెం.మీ., నల్లరేగడి 60×30

**ఆవాలు :** అక్టోబర్–15–నవంబర్15 వరకు అనువైనది. పంట కాలం 120–125 రోజులు. విత్తన మోతాదు 2.0–2.5 కిలోలు ఎకరానికి. విత్తే దూరం 45×15–20 సెం.మీ.

**కుసుమ :** అక్టోబర్ 15– నవంబర్15 వరకు అనుకూలం. పంటకాలం 115–130 రోజులు. విత్తన మోతాదు 4 కిలోలు ఎకరానికి. విత్తే దూరం 45×20 సెం.మీ.

**వేరుశనగ :** ఉత్తర తెలంగాణ అక్టోబర్ 15 లోపు, దక్షిణ తెలంగాణ – నవంబర్ 15 లోపు విత్తుకోవచ్చు. పంట కాలం 100–120 రోజులు. విత్తన మోతాదు 80 కిలోలు ఎకరానికి. విత్తే దూరం 22.5×10 సెం.మీ; 30×10 సెం.మీ. పెద్దకాయలు.

**పెసర :** సెప్టెంబర్ 15–అక్టోబర్ వరకు అనుకూలం. పంట కాలం 60–65 రోజులు. విత్తన మోతాదు 6–8 కిలోలు ఎకరానికి. విత్తేదూరం 30×10 సెం.మీ.

**మినుములు :** సెప్టెబర్ 15–అక్టోబర్ వరకు అనుకూలం. పంట కాలం 75–80 రోజులు. విత్తన మోతాదు 6–8 కిలోలు ఎకరానికి. విత్తే దూరం 30×10 సెం.మీ.

**కందులు :** సెప్టెంబర్ 15 – అక్టోబర్ 15 వరకు అనుకూలం. పంట కాలం 120–140 రోజులు. విత్తన మోతాదు 6–8 కిలోలు ఎకరానికి. విత్తేదూరం నల్లరేగడి నేలల్లో 75–90×10 సెం.మీ; ఎర్ర నేలలు 45–60×10సెం.మీ.

# యాసంగి వేరుశనగ సాగులో రైతులు పాటించాల్సిన సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు

డా.ఒ.శైలా, కె.మమత, డా.వి.దివ్యారాణి, డా.వి.రామ్‌రెడ్డి, డా.ఎం.సుజాత, డా.సి.ఎచ్.దామోదర్‌రాజు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం

నూనెగింజల పంటల్లో వేరుశనగ ప్రధానమైనది. యాసంగిలో ఉత్తర తెలంగాణ రాష్ట్రంలో అక్టోబర్ రెండవ పక్షం లోపు, దక్షిణ తెలంగాణలో సెప్టెంబర్ మొదటి పక్షం నుండి నవంబర్ రెండవ పక్షం వరకు విత్తడానికి అనుకూలమైన సమయం. మన రాష్ట్రంలో ప్రధానంగా యాసంగిలో నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, గద్వాల్, మహబూబాబాద్, వికారాబాద్, సూర్యపేట్, నల్గొండ జిల్లాల్లో అధిక విస్తీర్ణంలో సాగువుతోంది. విస్తీర్ణం, వినియోగం అధికంగా ఉన్నప్పటికీ దానికి తగ్గ ఉత్పాదకత పొందలేకపోవడానికి గల కారణం మేలైనయాజమాన్య పద్ధతులను పాటించకపోవడం. సాగుచేసే ప్రాంతాన్ని బట్టి రకాల ఎంపిక, విత్తనశుద్ధి, కలుపు యాజమాన్యం, ఎరువుల మోతాదు, సాగునీటి యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు సక్రమంగా పాటిస్తే యాసంగి వేరుశనగ సాగులో ఆశించిన దిగుబడులు పొందే అవకాశం ఉంది.

**వేరుశనగ సాగుకు అనుకూలమైన నేలలు :** వేరుశనగ సాగుకు తేలికపాటి, నీరు నిలబడని, మురుగు నీరు చేరకుండా మంచి గాలి ప్రసరణ ఉన్న నేలలు అంటే, ఎర్ర చల్కా నేలలు, ఇసుకతో కూడిన గరప నేలలు, ఉదజని సూచిక 6.0-7.5 మధ్య గల నేలలు అనుకూలమైనవి.

**విత్తన ఎంపిక :** ఆయా ప్రాంతాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న మేలైన రకాలను ఎంపిక చేసుకోవాలి. యాసంగిలో నీటి వసతి కింద కదిరి-6, కదిరి-9, టి.ఎ.జి.-24, ఐ.సి.జి.వి-91114, ధరణి, కదిరి హరితాంధ్ర, కదిరి 1812 (లేపాక్షి) మొదలైనవి మేలైన రకాలు.

**విత్తన మోతాదు :** గింజ బరువు, విత్తే సమయాన్ని బట్టి విత్తన మోతాదు మారుతుంది. రబీలో ఎకరానికి 60-80 కిలోల విత్తనం అవసరమవుతుంది.

**విత్తనశుద్ధి :** విత్తే ముందు విత్తనశుద్ధి చాలా ప్రాముఖ్యమైనది. కిలో విత్తనానికి 1 గ్రా. టెబ్యుకొనజోల్ విత్తనశుద్ధి చేసుకోవాలి. తేలికపాటి నేలల్లో వేరు పురుగు సమస్య గమనించిన ప్రాంతాల్లో కిలో విత్తనానికి 6.5 మి.లీ. క్లోరిపైరిఫాస్, కాండం కుళ్ళు, వేరుకుళ్ళు వైరస్ తెగులు ఆశించే ప్రాంతాల్లో 1 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్.ను 7 మి.లీ. నీటిలో కలిపి ఒక కిలో విత్తనానికి పట్టించాలి. కొత్తగా వేరుశనగ సాగుచేసే ప్రాంతాల్లో ఎకరాకు సరిపడా కిలో విత్తనానికి 200 గ్రా. రైజోబియం కల్చర్‌ని పట్టించాలి. వేరుకుళ్ళు, మొదలు కుళ్ళు, కాండం కుళ్ళు తెగులు ఎక్కువగా ఆశించే పరిస్థితుల్లో విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చు.

**విత్తేదూరం :** రబీ వేరుశనగలో గుత్తి రకాలను 22.5×10 సెం.మీ. దూరంలో, పెద్ద గుత్తి రకాలను 30×15 సెం.మీ. దూరంలో విత్తాలి. విత్తే సమయంలో నేలలో తగిన తేమ ఉండాలి. విత్తనాన్ని గొర్రుతో గానీ, నాగటి చాళ్ళలో లేదా ట్రాక్టర్‌తో నడిచే సీడ్ డ్రిల్‌ను ఉపయోగించి విత్తుకోవాలి. విత్తనం 5 సెం.మీ. లోతుకు మించకుండా విత్తాలి.

**ఎరువుల యాజమాన్యం :** భూసార పరీక్షను అనుసరించి ఎరువుల మోతాదును నిర్ణయించుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 3-4 టన్నుల పశువుల ఎరువును వేసుకోవాలి. 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేసుకోవాలి. మొక్క మొలిచిన 30 రోజులకు 9 కిలోల యూరియాను పైపాటుగా వేస్తే మంచి దిగుబడులు వచ్చే ఆస్కారం ఉంది. వేరుశనగ పూత దశలో అంటే పంట 35-40 రోజుల దశలో ఒక ఎకరానికి 200కిలోల జిప్సంను రెండు వరుసల మధ్య వేసి అంతర కృషి చేయాలి.



దీనితో పాటు సూక్ష్మపోషకాలైన జింక్, ఐరన్ కూడా పంట ఎదుగుదలలో ప్రముఖ పాత్ర వహిస్తాయి. సాధారణంగా జింకు లోపించిన పైరులో ఆకులు చిన్నవిగా మారి మొక్కలు గిడసబారతాయి. ఈ లోపాన్ని సవరించడానికి ఎకరాకు 200 లీటర్ల నీటికి 1 లీటరు పెండిమిథాలిన్ పిచికారీ చేసినట్లయితే 20-25 రోజులకు వెడల్పాటి ఆకుల కలుపు ఉన్నట్లయితే ఎకరాకు 300 మి.లీ. ఇమాజితాపైర్ లేదా క్విజలోఫాస్ పి ఇథైల్ 400 మి.లీ. ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తద్వారా వెడల్పాటి ఆకుల లేదా గడ్డిజాతి కలుపు మొక్కలను నివారించవచ్చు.

**నీటి యాజమాన్యం :** రబీలో వేరుశనగలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. ఊడలు దిగే దశ నుండి కాయ అభివృద్ధి చెందే దశ వరకు నీటి ఎద్దడి, బెట్ట పరిస్థితులు లేకుండా జాగ్రత్త వహించాలి. తేలిక నేలల్లో 6-8 తడులు ఇవ్వాల్సి ఉంటుంది. విత్తే ముందు నేల బాగా తడిచేలా నీరు పెట్టాలి. తగినంత పదును ఉన్నప్పుడు విత్తనం వేసుకోవాలి. రెండవ తడిని విత్తిన తర్వాత మొలక వచ్చిన 20-25 రోజులకు (పూర్తిగా ఒకేసారి పూత వచ్చేందుకు) ఇవ్వాలి. తర్వాత తడులు నేల లక్షణం, బంక మట్టి శాతాన్ని అనుసరించి 7-10 రోజుల వ్యవధిలో ఇవ్వాలి. చివరి తడి పంటకోతకు 4-7 రోజుల ముందు ఇవ్వాలి. నీటి తుంపర్లు (స్ప్రింక్లర్స్) ద్వారా ఇచ్చినట్లయితే దాదాపు 25 శాతం నీటి ఆదా అయి, అధిక దిగుబడులు పొందవచ్చు.

**సస్యరక్షణ :** వేరుశనగలో నాటింది మొదలు పంట చేతికి వచ్చే వరకు చీడపీడలు పంటను ఎంతగానో నష్టం చేస్తుంటాయి. కాబట్టి రైతులు పంటను ఆశించే పురుగులు, తెగుళ్ళ నివారణ చేపట్టాల్సిన చర్యలు చూద్దాం.

సాధారణంగా వేసవిలో లోతు దుక్కులు చేయడం వల్ల పంటను నష్టపరిచే కీటకాలు, తెగుళ్ళ ఉధృతిని తగ్గించవచ్చు.

**వేరుశనగ పంటను ఆశించే పురుగులు :**

**వేరు పురుగు :** వేరుశనగలో వేరు పురుగు తల్లి పురుగులు వర్షాలు పడిన వెంటనే భూమి నుండి బయటకు వచ్చి చుట్టు పక్కలో ఉన్న వేప, రేగు చెట్లను ఆశిస్తాయి. ఆడ పురుగులు భూమిలో గుడ్లు పెడతాయి. పిల్ల పురుగులు తెల్లగా ఉండి ఎరుపు తల కలిగి, బాగా ఎదిగిన పురుగులు 'సి' ఆకారంలో ఉండి వేరుశనగ మొక్క వేర్లను ఆశిస్తాయి. వేరు పురుగు ఆశించిన

మొక్కలు వాడిపోయి, ఎండి చనిపోతాయి. మొక్కలని పీకితే సులువుగా ఊడి వస్తాయి. మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోతాయి. లోతు దుక్కి చేయడం వల్ల వేరు పురుగు కోశస్థ దశలు బయట పడి పక్షుల బారిన పడతాయి. లేదా ఎండ వేడికి చనిపోతాయి.

**నివారణ :** ఈ సమస్య ఉన్న ప్రాంతాల్లో పైన చెప్పిన విధంగా క్లోరిపైరిఫాస్‌తో విత్తనశుద్ధి చేయాలి. ఫోరేట్ 10 శాతం గుళికలు ఎకరాకు 6 కిలోలు చొప్పున ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

**ఆకుముడత పురుగు :** విత్తిన 15 రోజుల నుండి ఆకు ముడత పురుగు వేరుశనగను ఆశిస్తుంది. తొలి దశలో ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఉంటాయి. వీటి లోపల ఆకుపచ్చ రంగులో నల్లని తల కలిగిన పిల్ల పురుగులు ఉంటాయి. ఇవి రెండు మూడు ఆకులను కలిపి గూడు చేసుకొని వాటిలో ఉండి పచ్చని పత్రహరితాన్ని తినేయడం వల్ల ఆకులన్నీ ఎండి, దూరం నుండి కాలినట్లు కనిపిస్తాయి. దీనిని రైతులు అగ్గి తెగులు అని కూడా అంటారు.

**నివారణ :** ఈ పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. లేదా ఎసిఫేట్ 300 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలి. అంతర పంటగా జొన్న, సజ్జ 7:1 నిష్పత్తిలో వేయాలి. ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు అమర్చి రెక్కల పురుగు ఉనికిని, ఉధృతిని గమనించాలి.

**పొగాకు లద్దె పురుగు :** దీని తల్లి పురుగు లేత గోధుమ రంగులో ఆకులపైన లేదా ఆకు అడుగు భాగాన గుంపుగా గుడ్లు పెడుతుంది. పిల్ల పురుగులు గుంపులుగా ఉండి ఆకులపైన పత్రహరితాన్ని గోకి తినేసి జల్లెడ ఆకుగా మారుస్తాయి. బాగా ఎదిగిన పురుగులు మొక్కల అడుగుభాగాన లేదా మట్టి పెళ్ళలు రాళ్ళ కింద దాగి ఉండి రాత్రిపూట మొక్కలను ఆశించి ఆకులను పూర్తిగా తినేస్తాయి.

**నివారణ :** వేసవిలో లోతుగా దుక్కి చేయాలి. ఎకరాకు 4-5 లింగాకర్షక బుట్టలు అమర్చి మగ రెక్కల పురుగులను ఆకర్షిస్తాయి. ఎర పంటగా ఆముదం లేదా పొద్దుతిరుగుడు 30-40 మొక్కలు ఉండేలా విత్తాలి. పురుగులు చిన్నవిగా ఉన్నప్పుడు 5 శాతం వేప గింజల కషాయం పిచికారీ చేయాలి. 8-10 పక్షి స్థావరాలను ఎకరానికి అమర్చుకోవాలి. ఎదిగిన లార్వాలను నివారించడానికి నొవాల్యూరాన్ 200 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 40 మి.లీ. ఒక ఎకరానికి సరిపోయేలా 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విషపు ఎర (వరి తవుడు 5 కిలోలు + బెల్లం అర కిలో+ మోనోక్రోటోఫాస్ 500 మి.లీ.) ఎకరా పొలంలో సాయంత్రం వేళ చల్లాలి.

**తామర పురుగులు :** తామర పురుగులు పంటను ఆశిస్తే ఆకుల అడుగు భాగాన గోధుమ, ఇనుము రంగు మచ్చలు ఏర్పడతాయి. ఇది కాండం కుళ్ళు, మొవ్వ కుళ్ళు వైరస్ తెగులు పరిస్థితులు ఉన్నప్పుడు వీటి ఉధృతి ఎక్కువవుతుంది.

**నివారణ :** తామర పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ 320 మి.లీ. + వేప నూనె 1 లీ. + ఒక కిలో సబ్బు పొడి 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. థయోమిథాక్సామ్ 100 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలి.

**పచ్చ దీపపు పురుగులు :** ఇది ఆకు అడుగు భాగాన చేరి రసాన్ని పీలుస్తాయి. ఆకు కొన భాగాన 'వి' ఆకారంలో పసుపు రంగు మచ్చలు కలిగిస్తాయి.

**నివారణ :** తామర పురుగు నివారించడానికి తీసుకున్న చర్యలో పచ్చదీపపు పురుగులు నివారించడానికి వర్తిస్తాయి.

**పేనుబంక పురుగు :** పిల్ల, తల్లి పురుగులు మొక్క లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగం నుండి రసాన్ని పీలుస్తాయి.

**నివారణ :** పేనుబంక ఉధృతి ఎక్కువగా గమనిస్తే ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

విజయగాథ

# పత్తికోత వెంటనే నువ్వుల సాగు లాభదాయకం - ఒక విజయగాథ

డా.ఎ.రామకృష్ణ బాబు, డా.పి.అర్చన, ఏరువాక కేంద్రం, పాలెం, డా.ఎం.సుజాత, ప్రధాన శాస్త్రవేత్త, నూనెగింజల విభాగం,
డా.దామోదర్ రాజు, ఎ.డి.ఆర్. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం

సాధారణంగా పత్తి పంటను తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో మే చివరి వారం నుండి జూలై చివరి వారం వరకు వర్షాధారం, నీటి వసతి కింద విత్తుకొని 6-8 నెలల (డిసెంబర్-ఫిబ్రవరి) కాలంలో పంటను పూర్తి చేస్తారు. వాతావరణం అనుకూలించినప్పుడు, మార్కెట్ ధరలలో తీవ్ర వ్యత్యాసం ఉన్నప్పుడు పెట్టిన పెట్టుబడికి తగ్గట్లు ఆదాయం రాక సంవత్సరకాలం ఈ ఒక్క పంటతోనే సరిపుచ్చుకొని, రాబోయే వానాకాలం కోసం ఎదురు చూడడం పరిపాటి అయింది. పత్తి తీసిన వెంటనే అదే పొలంలో ఎటువంటి పంటలు వేసుకోవచ్చు, స్వల్పకాలిక పంటలు ఏవి, వాటిని సాగుచేయడం వల్ల పెట్టుబడికి తగ్గ ఆదాయం వస్తుందా లేదా శ్రమ వృథా అవుతుందా అనే సందిగ్ధంలో ముఖ్యంగా పత్తి రైతులు ఉంటున్నారు.



ఈ నేపథ్యంలో దక్షిణ తెలంగాణ మండలంలోని జోగులాంబ గద్వాల జిల్లా (ఉమ్మడి మహబూబ్‌నగర్), ఉండవెల్లి మండలం ఇటిక్యాల పాడు రైతు కొద్దిపాటి నీటి వసతితో పత్తి కోత అనంతరం వెంటనే నువ్వులు జగిత్యాల తిల్-1 (జె.సి.ఎస్.-1020) సాగు చేసి లాభాల బాటన నిలిచారు.

**రైతు వివరాలు :** శ్రీకారెడ్డి కృష్ణారెడ్డి అనే రైతు, ఇటిక్యాలపాడు గ్రామం, ఉండవెల్లి మండలం, జోగులాంబ గద్వాల జిల్లా వాసి. 10వ తరగతి వరకు చదివిన ఈ అభ్యుదయ రైతు సుమారు 25 సంవత్సరాలుగా వ్యవసాయాన్ని ప్రధానవృత్తిగా చేపడుతున్నారు. ఇతను తనకున్న 34 ఎకరాలలో వర్షాధారం కింద 20 ఎకరాలలో పత్తి పంటను సాగు చేస్తున్నారు. గత 2020-21 వానాకాలంలో అకాలంగా కురిసిన వర్షాలకు రైతు పత్తి పంటలో ఆశించిన దిగుబడి సాధించలేకపోయారు. పత్తి పంటను డిసెంబర్ చివరి వారంలో తీసివేసి పంట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల సలహా మేరకు జనవరి మొదటి వారంలో ప్రత్యామ్నాయ నువ్వులను సాగుచేశారు.

## రైతు అవలంబించిన మేలైన పద్ధతులు :

- 85రోజుల పంట కాలం గల కొత్త నువ్వు రకం జగిత్యాల తిల్-1 (జె.సి.ఎస్.1020) అనే జడకాతతో కూడిన తెల్లగింజ రకాన్ని సాగుచేశారు.
- రైతు సరైన సమయంలో విత్తడం (జనవరి మొదటి వారం) సమయానుకూలంగా యాజమాన్య పద్ధతులు చేపట్టడం, యూరియా 20 కిలోలు, 14-35-14 50 కిలోలు చివరి దుక్కిలో వేసి కలియదున్నారు. అలాగే విత్తిన 30 రోజులకు ఒక నీటి తడి ఇచ్చి ఎకరానికి 25 కిలోల యూరియా పైపాటుగా మొక్క మొదళ్ళ దగ్గర వేశారు.
- వరుసల మధ్య 20 సెం.మీ. మొక్కల మధ్య 15 సెం.మీ. దూరం ఇసుకలో కలిపి గొర్రుతో విత్తుకోవడం.
- విత్తనశుద్ధి ఎం-45 (3 గ్రా.)తో కలిపి చేశారు.

- పూత దశ, కాయ అభివృద్ధి, గింజ కట్టే దశలో నీటి ఎద్దడికి గురికాకుండా 2 సార్లు నీటి తడులు ఇచ్చారు.
- నువ్వు పంటను సరైన పక్వదశలో కోయడం (75-80 శాతం కాయలు లేత పసుపు రంగుకి మారి కింది 1-2 కాయలు కొంచెం పగిలి ఉండడం)

### సాగు ఖర్చు – ఆదాయం

| పద్ధతులు | ఖర్చులు / ఎకరానికి (రూ) |
|---|---|
| నేల తయారీ + పశువుల ఎరువు | 2000 |
| విత్తనం ధర | 500 |
| విత్తనశుద్ధి | 100 |
| గొర్రుతో విత్తడం | 500 |
| కలుపు నివారణ | 800 |
| ఎరువులు | 1400 |
| పురుగు మందులు (మోనోక్రోటోఫాస్ 250 మి.లీ./ఎ) | 400 |
| కోత | 2250 |
| ఎండిన తర్వాత గింజలను దులపడానికి | 1000 |
| మొత్తం ఖర్చు | 8950 |
| దిగుబడి | |
| స్థూల ఆదాయం క్విం. రూ. 10 వేలు చొప్పున(4.5 క్వింటాలు) | 45000 |
| నికర ఆదాయం 36,050/- | |

**రైతు అభిప్రాయం :** కొద్దిపాటి నీటి వసతి ఉన్న రైతులు వేసవిలో నువ్వులు పండించి మంచి దిగుబడులు సాధించవచ్చని నిరూపితమైంది అన్ని పెట్టుబడి పోగా 36,000 రూపాయల ఆదాయం వచ్చిందని చెప్పారు. సరైన సమయంలో విత్తడం, సమయానుకూలంగా చేపట్టే యాజమాన్యంపై నువ్వు దిగుబడి ఆధారపడి ఉంటుందని చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం వారి జగిత్యాల తిల్-1 అనే జడకాతతో కూడిన మేలైన తెల్లగింజ రకం ఎన్నుకోవడం ద్వారా ఎకరానికి నాలుగున్నర క్వింటాళ్ళ దిగుబడి వచ్చిందని రైతు తెలియజేశారు. పత్తి తర్వాత నువ్వు పంట సాగు లాభదాయకంగా ఉందని రైతు అభిప్రాయపడ్డారు.

**స్థిరత్వం / కొనసాగింపు :** జగిత్యాల తిల్-1 అనే తెల్లగింజ రకం రైతు పొలంలో మంచి దిగుబడి ఇవ్వడంతో రైతు వచ్చే సంవత్సరం స్వంతంగా 5 ఎకరాలలో సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. అలాగే ఇటిక్యాలపాడు గ్రామ పత్తి రైతులు కృష్ణారెడ్డి పొలాన్ని సందర్శించి నువ్వు పంట సాగు లాభదాయకంగా ఉందని గమనించి 30 మంది రైతులు తమ పొలాల్లో సాగు చేయడానికి ముందుకు వచ్చారు.



# కొన్ని సామెతలు..

సంకలనం : డి.వి.రామక్రిష్ణారావు, సహాయ సంపాదకులు, వ్యవసాయ పాడిపంటలు, వ్యవసాయ కమిషనర్ కార్యాలయం, హైదరాబాద్

అల్ప పాండిత్యం అనర్థానికి మూలకారణం

అసలు మానడం కన్నా ఆలస్యంగానైనా చేయడం మంచిది

ఆదర్శాలు శిఖరమెక్కి కూర్చుంటే, అవసరాలు అగాథంలోకి ఈడుస్తాయి

ఆవు మేత లేక చెడింది, పైరు చూడకుంటే చెడింది

ఆశ్లేష కురిస్తే ముసలి ఎద్దు రంకె వేస్తుంది

ఆశ్లేషలో అడుగుకు ఒక చినుకు పడినా అడిగినన్ని వడ్లు పండుతాయి

ఇంటి ఎద్దుకు బాడుగేముంది ?

ఇంటికి గుట్టు, మడికి గట్టు ఉండాలి

ఇచ్చిపుచ్చుకుంటూ ఉంటే వ్యవహారం, వచ్చి పోతూ ఉంటే బంధుత్వం

ఇసుక నేలను దున్ని బాగుపడిన వారు, బంక నేలను దున్ని చెడినవారు లేరు

ఉత్తర పదును, ఉలవకు అదును

ఉన్న ఊళ్లో అమ్ముడు పోని ఎద్దు పొరుగుళ్లో అమ్ముడు పోతుందా ?

ఊళ్లో అధికారమైనా ఉండాలి, ఊరంచు పొలమైనా ఉండాలి

ఎంత సంపదో అంత ఆపద

ఎంత పండినా కూటికే, ఎంత ఉండినా కాటికే..

ఎగిరెగిరి దంచినా అంతే కూలి, ఎగరక దంచినా అంతే కూలి

ఎద్దులేని సేద్యం, చద్దిలేని పయనం

ఎన్ని మాటలయినా పిడికెడు గింజలు కావు

ఏ ఆకు రాలినా ఈతాకు రాలదు

ఏమి చేసినా, సమకాలం వారు మెచ్చరు

# యాసంగి కంది సాగులో మెళకువలు

డా.ఎస్.సందీప్, డా.సి.సుధాకర్, సి.మాణిక్య మిన్ని, డా.కె.సుజాత, టి.రాజేశ్వర్ రెడ్డి, కె.సంధ్యారాణి, డా.ఎన్.ప్రవీణ్, సి.యమున
వ్యవసాయ పరిశోధనా స్థానం, తాండూర్, వికారాబాద్ - 501 141.

వానాకాలంలో అధిక వర్షాలతో పంట ముంపుకు గురై నష్టం కలిగిన ప్రాంతాలలో లేదా వానాకాలంలో సాగు చేసే స్వల్పకాలిక పంటలైన మొక్కజొన్న, పెసర, మినుము, సోయా తరువాత, నీటి వసతి కలిగిన ప్రాంతాలలో (మూడు నుండి నాలుగు తడులు ఇవ్వగలిగిన) వారు యాసంగిలో కందిని సాగు చేయవచ్చు. వానాకాలంలో విత్తిన కంది 160-180 రోజుల కాలపరిమితి కలిగి ఉంటే యాసంగిలో 120-130 రోజులలో పరిపక్వత చెందుతుంది కాబట్టి మధ్యకాలిక రకాలను ఎంపిక చేసుకోవాలి.

**రకాలు:** మధ్యకాలిక రకాలు యాసంగిలో సాగుకు అనుకూలము.

**హనుమ (టి.డి.ఆర్.జి. 4) :** పంట కాలం 120-130 రోజులు. దిగుబడి 5-6 క్వింటాళ్ళు ఎకరానికి. ఫ్యుజేరియం ఎండు తెగులును పూర్తిగా తట్టుకుంటుంది. వెర్రి తెగులు, శనగపచ్చ పురుగును కొంత మేరకు తట్టుకుంటుంది.

**ఆశ (ఐ.సి.పి.ఎల్ - 87119) :** పంట కాలం 120-130 రోజులు. దిగుబడి 6-7 క్వింటాళ్ళు ఎకరానికి. ఫ్యుజేరియం ఎండు తెగులు, వెర్రి తెగుళ్ళను పూర్తిగా తట్టుకుంటుంది.

**రుద్రేశ్వర (డబ్ల్యూ.ఆర్.జి -65) :** పంట కాలం 120-130 రోజులు. దిగుబడి 6-8 క్వింటాళ్లు ఎకరానికి. ఫ్యుజేరియం ఎండు తెగులు, శనగపచ్చ పురుగును కొంత మేరకుతట్టుకొనును. నల్లరేగడి భూములకు అనువైనది.

**లక్ష్మి (ఐ.సి.పి.ఎల్ - 85063) :** పంట కాలం 130-140 రోజులు. దిగుబడి 6-8 క్వింటాళ్లు ఎకరానికి. ఎండు తెగులును కొంత వరకు తట్టుకుంటుంది, యాసంగిలో విత్తినపుడు, ప్రధానమైన కొమ్మలు విడిగా ఎక్కువగా ఉంటాయి.

**ఎల్. ఆర్ . జి 41 :** పంట కాలం 130-140 రోజులు. దిగుబడి 6-8 క్వింటాళ్లు / ఎకరానికి. శనగపచ్చ పురుగును బాగా తట్టుకుంటుంది. ఎండు తెగులును తట్టుకోదు.

**నేలలు:** ఎర్ర చల్కా, నల్లరేగడి నేలలు, మురుగు నీరు పోయే వసతి గల నేలలు సాగుకు అనుకూలం. చౌడు నేలలు సాగుకు పనికిరావు.

**విత్తన మోతాదు:** ఎకరానికి 4-6 కిలోలు.

**విత్తే సమయం:** సెప్టెంబర్ రెండో పక్షం నుండి అక్టోబర్ రెండో పక్షం వరకు .

**విత్తన శుద్ధి:** విత్తనాలకు కాప్టాన్ లేదా థైరామ్ ఒక కిలో విత్తనానికి 3 గ్రా. మందుతో కలిపి విత్తన శుద్ధి చేయాలి. ఎండు తెగులు తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో జీవ శిలీంధ్రనాశిని ట్రైకోడర్మ విరిడిని 10 గ్రా. కిలో విత్తనానికి పట్టించాలి. విత్తడానికి ముందు 4 కిలోల విత్తనానికి 200 - 400 గ్రా. రైజోబియం కల్చర్ తో విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలి.

**విత్తేదూరం:** నల్లరేగడి భూముల్లో సాలుకు సాలుకు మధ్య 75 సెం.మీ లేదా 90 సెం.మీ., మొక్కకు మొక్కకు మధ్య 10 సెం. మీ. ఉండేలా విత్తుకోవాలి. ఎర్ర చల్క భూముల్లో సాలుకు సాలుకు మధ్య 45 సెం.మీ లేదా 60 సెం. మీ., మొక్కకు మొక్కకు మధ్య 10 సెం.మీ. ఉండేలా విత్తుకోవాలి.

**ఎరువుల యాజమాన్యం:** యాసంగి కందికి ఎకరాకు 16 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరంనిచ్చే ఎరువులు ఆఖరి దుక్కిలో లేదా విత్తనంతోపాటు వేసుకోవాలి.

**అంతర పంటలు:** యాసంగి కంది + యాసంగి వేరుశనగ (1:4)

**సమగ్ర కలుపు యాజమాన్యం:**

**మొలకెత్తక ముందు:** విత్తిన వెంటనే గాని మరుసటి రోజు గాని పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.3

నుండి 1.6 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**మొలకెత్తిన తరువాత:** పంట విత్తిన 20 రోజుల తరువాత, వెడల్పాకు కలుపు లేత దశలో నివారణకు ఇమాజితాఫిర్ 300 మి.లీ. (పర్సుట్) ఎకరాకు పిచికారీ చేయాలి. ఎక్కువగా గడ్డి జాతి కలుపు మొక్కలు ఉంటే క్విజాలోఫాప్-పి-ఇథైల్ 5% ఇ.సి. 400 మి.లీ. కలుపు మొక్కలు 3-4 ఆకుల దశలో ఉన్నప్పుడు 250 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కలుపు మందులు పిచికారీ చేసేటప్పుడు భూమిలో తగు తేమ ఉండేలా చూసుకోవాలి. రెండు జాతుల కలుపు మొక్కలు ఉంటే, పై రెండు మందులను కలిపి పిచికారీ చేసుకోవాలి

**అంతరకృషి:** విత్తిన 30, 60 రోజులకు గుంటకతో గాని గొర్రుతో గాని దంతేతో గాని అంతరకృషి చేయాలి. విత్తిన 60వ రోజు వరకు పైరులో కలుపు లేకుండా చూసుకోవాలి.

**నీటి యజమాన్యం:** యాసంగిలో సుమారు 250-300 మి.మీ నీరు అవసరం ఉంటుంది. మొగ్గ రాబోయే ముందు, కాయలు ఏర్పడే దశలో తప్పకుండా నీరు ఇవ్వాలి. మడుల పద్ధతి, బోదేలు-కాలువల పద్ధతిలో నీరు అందించవచ్చు. పంట బెట్టకు గురైనప్పుడు 20 గ్రా. యూరియా లేదా 10 గ్రా. మల్టీ-కే లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి తద్వారా పూత, కాత, రాలిపోకుండా కాపాడవచ్చు, బెట్ట నుండి కొంత ఉపశమనం కలుగుతుంది.

**చీడ పీడల యాజమాన్యం:**

**ఆకు గూడు పురుగు:** ఈ పురుగు పైరు ఎదుగుదల దశలో ఎక్కువగా ఆశిస్తుంది. ఈ పురుగు నివారణకు క్వినాల్ ఫాస్ 25% ఇసి 2.0 మీ లీ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**మారుక మచ్చల పురుగు:** ఈ పురుగులు లేత ఆకులను, పువ్వులను దగ్గరగా చేసుకొని గూడు లోపలి పత్రహరితాన్ని తింటూ పెరుగుతాయి. పూత ఆకులను దగ్గరగా చేసి గూడు లాగా చేయడం వలన కాయలు ఏర్పడకుండా ఉంటాయి. పిందే, కాయ దశల్లో పురుగు



ఆశిస్తే కాయకు రంధ్రం చేసి లోనికి వెళ్లి గింజలను తింటాయి. ఈ పురుగు నివారణకు స్పైనోశాడ్ 45% యస్.ఇ 0.3 మి.లీ లేదా ఎమమెక్టిన్ బెంజోయేట్ 5% యస్.జి. 0.4 గ్రా లేదా ఫ్లూబెండమైడ్ 39.35% యస్.సి 0.2 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5% యస్.సి 0.3 మి.లీ. లేదా లామ్డాసైహలోత్రిన్ 5% ఇ సి 1 మి లీ లీటరు నీటికి కలిపి లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**శనగ పచ్చ పురుగు:** ఈ పురుగులు మొగ్గ, పూత, పిందె, కాయదశలలో కందిపంటను ఆశిస్తాయి. ఈ పురుగు నివారణకు తొలిపూత దశల్లో క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ., పిందె, కాయ దశల్లో క్వినాల్ ఫాస్ 2.0 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. ఒక లీటర్ నీటికి కలిపి కొమ్మలు బాగా తడిచేలా పిచికారీ చేయాలి. పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు ఇండాక్సాకార్బ్ 14.5% యస్.సి 1.0 మి.లీ. లేదా స్పైనోశాడ్ 45% యస్.ఇ 0.3 మి.లీ లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5% యస్.సి 0.3 మి.లీ లేదా ఫ్లూబెండమైడ్ 39.35% యస్.సి 0.2 మి.లీ. లేదా లామ్డాసైహలోత్రిన్ 5% ఇ సి 1 మి.లీ లేదా ఎమమెక్టిన్ బెంజోయేట్ 5% యస్.జి. 0.4 గ్రా లేదా థయోడికార్బ్ 75% డబ్ల్యూ.పి 1.5 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**కాయతొలిచే ఈగ:** ఈ పురుగు నివారణకు ఎసిఫేట్ 75% యస్.పి 1.5 గ్రా. లేదా లామ్డాసైహలోత్రిన్ 5% ఇ సి 1 మి లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**తెగుళ్ళ యజమాన్యం:**

**ఫ్యూజేరియం ఎండుతెగులు:** పంట తొలిదశ నుంచి ఈ

తెగులు ఆశించినప్పటికీ పూత, పిందె దశల్లో తేమ తక్కువగా ఉన్నప్పుడు తెగులు తీవ్రత ఎక్కువ ఉంటుంది. ఈ తెగులు సోకిన మొక్కలు పూర్తిగా కానీ, మొక్కలో కొంత భాగం కాని వాడి ఎండి పోతాయి. దీని నివారణకు ఎలాంటి మందులు లేవు కనుక తెగులును తట్టుకునే ఐ.సి.పి.ఎల్. 87119 (ఆశ), డబ్ల్యూ.ఆర్.జి -65 (రుద్రేశ్వర), టి.డి.ఆర్.జి. 4 (హనుమ) లాంటి రకాలను విత్తుకోవాలి. పొగాకు లేదా జొన్న పంటలతో మార్పిడి చేయాలి.

**గొడ్డు మోతు తెగులు (స్టెరిలీటీ మొజాయిక్):** ఈ తెగులు సోకిన మొక్కలు పుష్పించవు, కాయలు కట్టవు కావున దీనిని గొడ్డుతెగులు అని అంటారు. ఈ తెగులు ఇరియోఫిడ్ అనే నల్లి ద్వారా వ్యాప్తి చెందుతుంది. నివారణకు 3 గ్రా కరిగే గంధకపు పొడి లేదా డైకొఫాల్ 18.5% ఇ సి ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి లేదా తెగులు తట్టుకునే ఐ.సి.పి.ఎల్. 87119, బి.ఎస్.ఎం.ఆర్ 853, బి.ఎస్.ఎం.ఆర్ 736 వంటి రకాలను సాగు చేయాలి.

**పైటోప్తోరా ఎండు తెగులు:** తెగులు ఆశించిన మొక్కలలో ఆకులపై నీటి మచ్చలు, కాండం, ఆకుతొడిమలపై గోధుమ రంగు లేదా నల్లని మచ్చలు కనిపిస్తాయి. తెగులాశించిన మొక్కల ఆకులు వాడి మాడి పోతాయి. కాండం, కొమ్మలు తెగులు సోకినా ప్రదేశంలో విరిగిపోతాయి. ఈ తెగులు భూమిలో నివసించే శిలింధ్రం వలన కలుగుతుంది. వర్షాలు, గాలిలో తేమ అధికంగా ఉంటే ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ తెగులు తగ్గించడానికి మాంకోజబ్ 75% డబ్ల్యూ.పి 3 గ్రా లేక మెటాలాక్సిల్ 25% డబ్ల్యూ.పి 2 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి లేదా తెగులు సోకిన మొక్క, వాటి చుట్టూ ఉన్న మొక్కలు తడిచేలా పోయాలి.

**పంటకోత:** పూత దశనుండి రకాన్ని బట్టి పంట 45-60 రోజులలో పరిపక్వతకు వస్తుంది. 80% కాయలు పూర్తిగా పరిపక్వత వచ్చిన తరువాత పంటను కోయాలి.

## వ్యవసాయశాఖ వెబ్ సైట్‌ల సందర్శకుల వివరాలు




http://agri.telangana.gov.in 30 సెప్టెంబర్ 2021 నాటికి ఇంగ్లీష్ వెబ్‌సైట్ సందర్శకుల సంఖ్య : 2,56,162

పై వెబ్‌సైట్ నుండి వ్యవసాయ పాడిపంటలు సాఫ్ట్ కాపీని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

# వర్షాధార ఆముదం సాగు

డా.కె.శ్రీనివాస్, ప్రధాన శాస్త్రవేత్త, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ, హైదరాబాద్

ఆముదం పంట విస్తీర్ణం, ఉత్పత్తులలో భారత దేశం ప్రపంచంలో ప్రథమ స్థానంలో ఉండగా, తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో గుజరాత్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్‌ల తరువాత నాలుగో స్థానంలో ఉంది. తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా నారాయణపేట్, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల్, వనపర్తి జిల్లాలలో ఆముదం సాగు అవుతోంది. అయితే తెలంగాణలో హెక్టారుకు 6-7 క్వింటాళ్లతో ఆముదం దిగుబడి దేశ సగటు కన్నా చాలా తక్కువగా ఉంది. తక్కువ దిగుబడికి ప్రధాన కారణం ఆముదం పంటను వర్షాధారంగా సాగు చేయడం, కీలక దశలలో పంట నీటి ఎద్దడికి గురి కావడం.సరైన వర్షపు నీటి యాజమాన్య పద్ధతులు, పంట యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఆముదం దిగుబడిని గణనీయంగా పెంచవచ్చు.

పంటలకు పక్షులు, వన్య ప్రాణుల బెడద ఉన్న ప్రాంతాలకు ఆముదం అనువైనది. ఆముదం పంటను అన్ని రకాల నేలల్లోనూ సాగుచేయవచ్చును. అయితే నీరు నిలువ ఉండే నేలలు, చవుడు నేలలు ఈ పంటకు అనువైనవి కావు. ఆముదం పంట కొంత మేరకు బెట్టను తట్టుకోగలదైనప్పటికీ, కీలక దశల్లో, ముఖ్యంగా పూత, కాయ ఏర్పడే దశలో పంట నీటి ఎద్దడికి గురి కావటం, తత్ఫలితంగా దిగుబడి తగ్గడం సర్వ సాధారణం కాబట్టి వాన నీటిని సద్వినియోగం చేసుకునేందుకు లోతు దుక్కి చేసుకోవడం, వాలుకు అడ్డంగా సాగు చేయటం, తగినంత మోతాదులో పశువుల ఎరువు కలియదున్నడం, రిడ్జ్ మరియు ఫర్రో లేదా బెడ్, ఫర్రో పద్ధతిలో సాగు చేయటం, పంట వరుసల మధ్య లోతుగా సాలు దున్నుకోవడం వంటి పద్ధతులు పాటించడం ద్వారా వాననీటిని సమర్థవంతంగా నేలలోకి సంగ్రహించి, మట్టిలో నిలువజేసి పంటకి అందించవచ్చు. ఆముదం పంటను కాస్త ఆలస్యంగా, అంటే రుతుపవనాలు తాకిన 30-45 రోజుల తరువాత విత్తుకోవచ్చు కాబట్టి తొలకరి వానలకు అలసంద, పిల్లి పెసర, జనుము వంటి పచ్చి రొట్ట పంటలను విత్తుకొని ఆముదం విత్తడానికి కొద్ది రోజుల ముందు నేలలోకి కలియదున్నినట్లైతే మట్టి నీటిని నిలువ చేసుకునే శక్తి పెరగడంతోబాటుమట్టిలో సేంద్రీయ పదార్థం, పోషకాల లభ్యత కూడా గణనీయంగా మెరుగౌతుంది.

ఆముదం పంట పలు తెగుళ్లకు గురి అవుతుంది కావున, కిలో విత్తనానికి 10 గ్రా ట్రైకోడెర్మావిరిడి లేదా 3గ్రా థైరామ్ లేదా 3 గ్రా కాప్టాన్ లేదా 1గ్రా కార్బండైజిమ్ మందును కలిపి విత్తన శుద్ధి చేసుకోవడం మంచిది.విత్తన శుద్ధి చేయటం ద్వారా మొలకకుళ్ళు, ఆల్టర్నేరియా ఆకు మచ్చ తెగులు, వడలు లేదా ఎండుతెగులు నివారించవచ్చు. ఖరీఫ్ ఆముదాన్ని జూన్ మొదటి పక్షం నుండి జూలై రెండో పక్షం వరకు విత్తుకోవచ్చు. అయితే జూన్‌లో విత్తుకున్న పంట పూత, కాయ దశలో వర్షాల వలన బూజు తెగులుకు గురి కావచ్చు కాబట్టి కొంత ఆలస్యంగా విత్తుకోవడం మేలు. వర్షాధార పంటను జులై తరువాత విత్తితే పంట పూత, కాయ దశలో బెట్ట పరిస్థితులకు లోనై దిగుబడి తగ్గుతుంది.

ప్రగతి, హరిత, క్రాంతి, కిరణ్, జ్యోతి, జ్వాల, జి.సి.హెచ్-4 రకాలు, డి.సి.హెచ్-177, పి.సి.హెచ్-111 హైబ్రిడ్లు తెలంగాణలో సాగుకు అనుకూలమైనవి. క్రాంతి, కిరణ్, డి.సి.హెచ్-177 బెట్టను తట్టుకోగలవి, వర్షాధార సాగుకి అనువైనవి. ఖరీఫ్ ఆముదాన్ని వర్షపాతం ఎక్కువ ఉన్న ప్రాంతాలలో, బరువైన నేలలలో 90×60 లేదా 120×45, వర్షపాతం తక్కువ, లేదా తేలిక పాటి నేలలలో 90×45 సెంటీమీటర్ల దూరంలో విత్తుకోవాలి.

విత్తిన రోజు గాని తరువాతి రోజు గాని ఎకరాకి 1.5 లీటర్లు పెండిమెతలిన్ 30%, లేదా 1 లీటరు అలాక్లోర్ 50% 250లీటర్ల నీటిలో కలిపి నేలపై పిచికారీ చేసి కలుపు సమస్యను చాలా వరకు నివారించవచ్చు. విత్తిన 30-40 రోజులకు గుంటక



లేదా గొర్రుతో అంతర కృషి చేసి కలుపు నివారించవచ్చు. ఆముదం పంట వరుసల మధ్య దూరం ఎక్కువ కాబట్టి పెసర, గోకర వంటి పంటలు ఆముదం సాళ్ళ మధ్య విత్తుకొని ఆదాయాన్ని పెంచుకోవచ్చు. ఆముదం పంట మట్టినుండి వ్యాపించే తెగుళ్లకు లోనౌతుంది కావున కంది, జొన్న వంటి పంటలతో పంట మార్పిడి చేయడం మంచిది.

ముందుగా చెప్పుకున్నట్లు విత్తడానికి ముందు ఎకరాకి 4 టన్నుల పశువుల ఎరువు మట్టిలో కలియదున్నినట్లైతే మట్టిలో సేంద్రీయ పదార్థం పెరిగి, తద్వారా మట్టి నీటిని సంగ్రహించి, దీర్ఘకాలం నిలుపుకునే సామర్థ్యం పెరగడమే కాక పంటకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలు లభిస్తాయి. సేంద్రీయ పదార్థం పెరగటంతో మట్టినుండి సంక్రమించే తెగుళ్ల సమస్య కూడా కొంతవరకు నివారణ అవుతుంది. ఆముదం పంటకు ఎకరాకి 24 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం, 12 కిలోల పొటాష్ ఎరువులను మూడవ వంతు నత్రజని, భాస్వరం, పొటాష్ మొత్తం విత్తే సమయంలోను, మిగతా నత్రజనిని రెండు దఫాలుగా 30-35 రోజులకి, 60-65 రోజులకి వేసుకోవాలి. హైబ్రిడ్లుసాగుచేసినప్పుడు, వర్షాలు బాగా పడి పంట ఏపుగా పెరిగినప్పుడు 90-95 రోజులకు 8 కిలోల అదనపు నత్రజని వేసుకోవాలి.

ఆముదం పంటను ఆశించే తెగుళ్లలో ముఖ్యమైనవి మొలక కుళ్ళు తెగులు, వడలు లేదా ఎండు తెగులు, బూజు తెగులు. వేసవి దుక్కులు చేయడం, తెగుళ్లను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవడం, విత్తన శుద్ధి చేసుకోవడం, పొలంలో నీరు నిలబడకుండా మురుగు వ్యవస్థ ఏర్పరచుకోవడం, పంట మార్పిడి చేయడం, పశువుల ఎరువు, ఇతర సేంద్రీయ ఎరువులు వాడటం వంటి పద్ధతులను పాటించి మొలక కుళ్ళు తెగులు, వడలు లేదా ఎండు తెగులు చాలావరకు నివారించవచ్చు. బూజు తెగులు పూత, కాయ దశలో వర్షాలు కురవడం, గాలిలో తేమ శాతం పెరగడం వంటి పరిస్థితులలో ఎక్కువగా సోకి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది. బూజు తెగులు నివారించడానికి కిరణ్, జ్వాల వంటి బోడి కాయ రకాలను ఎంచుకోవడం, మొక్కల మధ్య కాస్త ఎక్కువ దూరం ఉండేట్లు విత్తుకోవడం, తెగులు కనపడగానే సోకిన గెలలను కోసి పోలానికి దూరంగా పార వేయడం లేదా కాల్చి వేయడం వంటి యాజమాన్య పద్ధతులు పాటించాలి. తెగులు తీవ్రత ఎక్కువగా ఉన్నా, లేదా తుఫాను పరిస్థితులు నెలకొన్నా లీటరుకు 1 మిల్లీ లీటరు ప్రాపికొనజోల్ లేదా ఒక గ్రాము కార్బెండాజిమ్ పిచికారీ చేసి తెగులుని అరికట్టవచ్చు.

ఆముదం పంటకు నష్టం కలిగించే పురుగులలో నామాల పురుగు, పొగాకు లద్దె పురుగు, కాయ తొలిచే పురుగు ప్రధానమైనవి. పురుగులను ఏరివేయడం, పక్షి స్థావరాలు ఏర్పరచడం, పరాన్న జీవులను వినియోగించడం, లింగాకర్షక బుట్టలని అమర్చడం, లీటరుకు 5 మిల్లీ లీటర్లు వేప నూనె పిచికారీ చేయడం వంటి సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టి వీటిని చాలావరకు నివారించవచ్చు. పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు లీటరుకు 1.5 గ్రాము ఎసిఫేట్ లేదా 1.6 మిల్లీ లీటర్లు మోనోక్రోటోఫాస్ పిచికారీ చేసి అరికట్టవచ్చు.

సరైన వర్షపు నీటి యాజమాన్యంతో బాటు ఆయా ప్రాంతాలు, పరిస్థితులకు అనువైన పంట రకాలను ఎంచుకొని, సమగ్ర పోషక, కలుపు, క్రిమి, కీటక, తెగుళ్ల యాజమాన్య పద్ధతులు పాటించినట్లైతే ఆముదం దిగుబడి, ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

# అధిక వర్షాలు కురిసిన తరువాత పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డా.కె.మదన్ మోహన్ రెడ్డి, డా.జి.మంజులత, కె.శేఖర్, డా.ఇ.రజినీకాంత్, డా.జి.ఉషా రాణి, డా.డి.శ్రావణి, డా.ఎ.విజయభాస్కర్
ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధనా స్థానం, కరీంనగర్

వాతావరణంలోని మార్పుల కారణంగా అధిక వర్షాలు, తుఫానులు అనుకోకుండా సంభవించి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతం జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండటం, ఉష్ణోగ్రతలు పడిపోయి కొన్ని ప్రాంతాలలో గాలిలో అధిక తేమ వల్ల వివిధ పంటలలో చీడపీడలు ఆశించినట్లుగా గమనించారు. ఇలాంటి సమయంలో రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించి పంటలను చీడ పీడల నుండి కాపాడుకోవడమే కాకుండా ఆశించిన దిగుబడి పొందటానికి అవకాశం ఉంది.

**వరి:** ప్రస్తుతం వరి పంట పిలక దశ నుండి చిరు పొట్ట దశలో ఉంది. ముంపుకి గురైన వరి పొలాల్లో మురుగు నీటిని తీసివేయాలి, తాత్కాలికంగా నత్రజని ఎరువులు వేయడం ఆపాలి.

- ❖ ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరిలో బాక్టీరియా ఎండాకు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. దీని లక్షణం ఆకులపై పసుపు రంగు నీటి డాగు మచ్చలు ఏర్పడి అంచుల వెంబడి అలల మాదిరి పై నుండి కిందకు మట్టల వరకు వ్యాప్తి చెందుతాయి. ఇది గమనించిన పొలంలో నత్రజని ఎరువుని తాత్కాలింగా ఆపివేసి తెగులు ఆశించిన తొలిదశలోనే వ్యాప్తి నివారణకు మురుగు నీటిని తీసివేసి 0.4 గ్రాముల అగ్రిమైసిన్ లేదా 0.2 గ్రాముల ప్లాంటోమైసిన్ మందుని ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ❖ నీరు త్వరగా తగ్గని పొలంలో అధిక తేమను తట్టుకోవడానికి 1 శాతం పొటాషియం నైట్రేట్ (10 గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలిపిన ద్రావణం) ఎకరానికి 200 లీటర్ల ద్రావణాన్ని 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- ❖ ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పాముపొడ తెగులు గమనించినట్లయితే 2 మి.లీ. హెక్సకోనోజోల్ లేదా వ్యాలిడమైసిన్ లేదా 1 మి.లీ. ప్రొపికోనోజోల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. అవసరాన్ని బట్టి మరో 15 రోజులకు మందు మార్చి పిచికారీ చేసుకోవాలి.
- ❖ దోమ, ఆకుముడత తక్కువగా ఉన్న కూడా ఉధృతమయ్యే అవకాశం ఉన్నందున తొలి దశ నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాముల మందుని లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ❖ కొన్ని రకాలలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాముల మందుని లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ❖ సెప్టెంబర్ మాసంలో అధిక వర్షపాతం, తేమ శాతం ఉండి వరి పైరు ఈనిక దశలో ఉంటే కాటుక తెగులు ఉధృతి అధికంగా ఉంటుంది. నివారణకు వరి పైర్లు పూత సమయంలో / ఈనిక దశలో అధికంగా వర్షాలు కురుస్తున్నట్లైతే ముందస్తు జాగ్రత్తగా ఈనే దశలో (10-15% పూత దశలో) ఒకసారి, తరువాత 7-10 రోజులకు (25-30% పూత దశలో) మరోసారి ప్రొపికోనోజోల్ 200 మి.లీ. లేదా ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ + టేబుకోనజోల్ అనే మిశ్రమ శిలీంధ్ర నాశిని 80 గ్రాములు లేదా కార్బండజిమ్ 200 గ్రాములు మందుని 200 లీటర్ల నీటికి ఒక ఎకరానికి పిచికారీ చేయాలి. గింజ పాలు పోసుకునే దశ నుండి గింజ గట్టిపడే దశలో తెగుళ్ల మందులు పిచికారీ చేసినా పెద్దగా ప్రయోజనం ఉండదని రైతులు గమనించాలి.

**పత్తి:** అధిక తేమ, నీటి ముంపుని పత్తి పంట తట్టుకోలేదు. అధిక వర్షాలు, ఆకాశం మేఘావృతమై ఉండటం వలన పత్తి పంటలో వడలు తెగులు సోకె అవకాశం ఉంది. నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందుని ఒక లీటర్ నీటికి కలిపి మొక్కల మొదళ్ళ చుట్టూ నేలను తడపాలి.

- ప్రస్తుత పరిస్థితులలో ఆల్టర్ నేరియా ఆకుమచ్చ తెగులు, సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు వచ్చే అవకాశం ఉంది. దీని నివారణకు ప్రొపికోనోజోల్ 1 మి.లీ. లేదా క్యాప్టాన్ + హెక్సకోనోజోల్ 1 గ్రాము మందుని లీటర్ నీటికి కలిపి 2-3 పర్యాయాలలో 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.
- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కాయ కుళ్ళు తెగులు సోకడానికి అనుకూలం. నివారణకు 10 లీటర్ల నీటికి 1 గ్రాము పోశామైసిన్ లేదా 1 గ్రాము స్ట్రెప్టో సైక్లిన్ మందుని కలిపి 15 రోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారీ చేసుకోవాలి.
- రసం పీల్చే పురుగుల నివారణకు 1.5 గ్రాము ఎసిఫేట్ మందుని లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పత్తిలో గూడ రాలడానికి అనుకూలం. నివారణకు 2 మి.లీ. ప్లానోఫిక్స్ మందుని పది లీటర్ల నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- వర్షాలు ఆగిన తరువాత పై పాటుగా అదనపు మోతాదుగా ఎకరానికి 35 కిలోల యూరియా, 10 కిలోల పోటాష్ వేసుకోవాలి. ఒకవేళ నేలలో పై పాటుగా ఎరువులు వేయలేని పక్షంలో 20 గ్రాముల యూరియా లేదా 10 గ్రాముల మల్టీ-కె మందుని ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**కంది:** అధిక వర్షాలు కురిసిన ప్రాంతాలలో కంది పంటలో నిలువ ఉన్న నీటిని తీసివేయాలి. బొదే సాలు పద్ధతిలో విత్తిన పంటకు నిలిచిన వర్షపు నీరు పెద్దగా ఆటంక పరచదు కనుక పంట కొంతవరకు నిలదొక్కుకుంటుంది.

- వర్షాలు ఆగిన తరువాత 10 గ్రాముల మల్టీ-కె మందుని ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కందిలో ఫైటాఫ్తెర ఎండు తెగులు ఆశించటానికి అనుకూలం. తెగులు గమనించిన చోట వ్యాప్తి నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందుని ఒక లీటర్ నీటికి కలిపి మొక్క మొదళ్ళు పూర్తిగా తడపాలి.
- ఆకుమచ్చ తెగులు నివారణకు 1 గ్రాము కార్బండజిమ్ మందుని లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**మొక్కజొన్న:** ఈ పంట అధిక తేమను తట్టుకోదు కాబట్టి వర్షం తగ్గిన వెంటనే అంతర కృషి చేసి, ఎకరాకు 25-30 కిలోల వరకు యూరియా, 15 కిలోల పోటాష్ వేయాలి.

- ప్రస్తుత పరిస్థితులు ఎర్వీనియా ఎండు తెగులు ఆశించడానికి అనుకూలంగా ఉన్నందున నివారణకు 100 కిలోల వేప పిండి, 4 కిలోల బ్లీచింగ్ పౌడర్ కలిపి పొలమంతా చల్లుకోవాలి.

**సోయా చిక్కుడు:** వర్షాలు ఆగిన తరువాత, నేలలో పై పాటుగా ఎరువులు వేయలేని పక్షం లో 20 గ్రాముల యూరియా లేదా 10 గ్రాముల మల్టీ-కె మందుని ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- ఎడతెరిపి లేకుండా అధిక వర్షాలు పడటం వల్ల పొగాకు లద్దె పురుగు ఎక్కువయ్యే అవకాశం ఉంది. దీని నివారణకు క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాముల మందుని లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు తరువాత దశ నివారణకు 1.5 గ్రాముల థయోడికార్బ్ మందుని లీటర్ నీటికి పిచికారీ చేయాలి.
- అధిక వర్షాలు కురిసిన తరువాత సోయా పంటకు ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు 2.5 గ్రాముల కార్బండజిమ్ + మాంకోజెబ్ మందుని లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**అపరాలు, ఇతర ఆరుతడి పంటలు:**

- పాక్షికంగా దెబ్బతిన్న పంటలలో కూడా వీలైనంత త్వరగా నీటిని తొలగించి 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

# వరిలో బాక్టీరియా ఆకుఎండు తెగులు, నివారణ చర్యలు

ఎన్.సుమలత, కె.భవ్య, అర్చన పల్లె, వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్

మన తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితులకు, ఉష్ణోగ్రతలకు వివిధ తెగుళ్ళు ప్రధాన పంటల్లో ఆశించే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలంగాణలో ప్రధాన పంటలైన వరి, పత్తిలో తెగుళ్ళు వాటి నివారణ చర్యల వివరాలకు వస్తే, ప్రస్తుత పరిస్థితుల్లో బాగా కురిసిన వర్షాలకు వరిలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంది.

**వరిలో బాక్టీరియా ఆకుఎండు తెగులు :** దాదాపు అన్ని జిల్లాల్లోనూ వరి నాట్లు పూర్తి అయి, పంట వివిధ దశల్లో ఉంది. ఈ తెగులు ఆశించిన మొక్కల్లో ఆకుల అంచుల వెంబడి నీటిలో తడిచినట్లుగా మచ్చలు ఏర్పడి అలల మాదిరిగా పసుపు రంగు వర్ణంలో అంచుల వెంబడి బాక్టీరియా తెగులు వ్యాపించి తెగుళ్ళ తీవ్రత ఎక్కువ అయ్యే కొద్ది ఆకులు ఎండిపోతాయి. తెల్లవారుజామున గనక ఈ తెగులు సోకిన మొక్క ఆకులు గమనిస్తే ఆకు అంచుల వెంబడి నీటి బిందు వంటి అకారాలను గమనించవచ్చు. దీనిని బ్యాక్టీరియా ఊజ్ అని అంటారు. ఈ బిందువులలో బాక్టీరియా కణాలు ఉంటాయి. ఈ బిందువుల్లోని బ్యాక్టీరియా కణాలు పక్కనే ఉన్న ఆరోగ్యవంతమైన మొక్కల్లోకి నీటి ద్వారా గానీ, గాలి ద్వారా గాని వ్యాపించి తెగుళ్ళ వ్యాప్తి చేస్తాయి. ఈ బాక్టీరియా మొక్కలపై ఉన్న గాయాల ద్వారా లోనికి ప్రవేశిస్తుంది. నారుమడి నుంచి తీసే నాట్లు వేసేటపుడు కొనలను తుంచి నాటిన దశలో గనక ఈ బాక్టీరియా సోకినట్లయితే మొక్కల చివరి ఆకులు పసుపు రంగుకుమారి, ఎండిపోయి మొక్కలు చనిపోయే అవకాశం ఉంది.

తెగులు నివారణకు ముందుగా పాటించాల్సినది, నాణ్యమైన విత్తనాలు, తెగుళ్ళు సోకని విత్తనాలు ఎన్నుకొని, గడ్డిజాతి మొక్కలు ఏవికూడా పొలంలో, పొలం చుట్టూ కూడా లేకుండా చూసుకోవాలి. తెగులు లక్షణాలు కనిపించినట్లయితే, పొలంలోని నీటిని తీసివేయాలి. ఆ నీటిని పక్కన ఉన్న ఆరోగ్యవంతమైన వరి మడిలోకి పంపించరాదు.

నివారణకు అగ్రిమైసిన్ 0.4 గ్రా. / ప్లాంటామైసిన్ 0.2 గ్రా. చొప్పున వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. మోతాదుకు మించి నత్రజని వాడకాన్ని తగ్గించుకోవాలి. దఫాల వారీగా యూరియాని వాడాలి. నాట్లు వేసే దశలో చివరన తుంచకుండా నాటుకోవాలి. వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు కొనలు తుంచి నాటు వేస్తారు. ఒక వేళ పొలాల్లో గనక బాక్టీరియా తెగులు ఎక్కువగా ప్రతి సంవత్సరం పంట కాలాల్లో వచ్చే రైతులు ఈ విషయాన్ని గమనించుకొని కొనలు తుంచకుండా నాటువేసుకునే ప్రయత్నం చేయాలి. తెగులు ఆశించిన మొక్కలను తీసివేసి కల్చాలి. ఈ తెగులు గింజల / విత్తనం ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది. నాణ్యమైన విత్తనం, బాక్టీరియా తెగులు తట్టుకునే వరి రకాలు విత్తుకోవాలి. తెలంగాణలో అయితే వానాకాలానికి అనువైన వరంగల్ మసూరి డబ్ల్యూ.జి.ఎల్. 14 రకం బాక్టీరియా ఆకు ఎండు తెగులును తట్టుకునే రకం. ఈ తెగులు వ్యాపించడం వలన పంట దిగుబడి తగ్గే అవకాశం ఉన్నందున సరైన సమయంలో తెగుళ్ళ వ్యాప్తి తీవ్రతరం కాకముందే నివారణ చర్యలతో తెగుళ్ళ నివారణ చేసుకోవాలి.

---

- మురుగు నీరు తొలగించిన తరువాత 15 కిలోల యూరియా, 10 కిలోల మ్యురేట్ అఫ్ పోటాష్ వేసి అంతర కృషి చేయాలి.
- వేరు కుళ్ళు తెగులు నివారణకు 1 లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి.
- పంట తొలి దశలో ఉంటె 1 లీటర్ నీటికి 5 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్, 0.5 గ్రాముల నిమ్మ ఉప్పు, 20 గ్రాముల యూరియా తో పిచికారీ చేయాలి.
- పంట మొగ్గ దశలో ఉన్నట్లైతే 1 లీటర్ నీటికి 2.5 మి.లీ. క్లోరోపైరిఫాస్, 1 మి.లీ. డైక్లోరోవాస్ కలిపి పిచికారీ చేయాలి.

# పత్తి పంటలో నీటి ముంపు ప్రభావం - పోషక యాజమాన్య పద్ధతులు

డా.పి.రవి, శాస్త్రవేత్త, డా.ఎ.కృష్ణ చైతన్య, శాస్త్రవేత్త, సి.ఎచ్.వేణు రెడ్డి, ఆర్.ఎ., డి.ఎ.రజనీదేవి, శాస్త్రవేత్త, డా.ఎం.ఉమాదేవి, ఎ.డి.ఆర్.,
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పొలాస, జగిత్యాల

తెల్ల బంగారంగా పిలువబడే పత్తి పంట తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పండించే ఒక ప్రధానమైన పంట. మన తెలంగాణ రాష్ట్రంలో పండించే పత్తి పంటలో 70-80 శాతం వర్షాధారంగాను, మిగిలిన 20-30 శాతం నీటి వసతి కింద పండిస్తున్నారు. ఆరుతడి పంటగా పత్తి పంటను అధిక దిగుబడిని పొందవచ్చు. పత్తి పంట బెట్ట వాతావరణాన్ని బాగా తట్టుకోగలదు కానీ, ముంపు పరిస్థితులకు గురైనప్పుడు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటుంది. సాధారణంగా పత్తి పంట ముంపుకు గురైనప్పుడు ఆకులు పసుపు పచ్చగా మారి మొక్కలు గిడసబారతాయి. మొక్కలలో ప్రస్ఫుటమైన ప్రతికూల లక్షణాలు కనబడినప్పటికి ముంపు ప్రభావంతో దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నట్లు పరిశోధనా ఫలితాలు తెలియజేస్తున్నాయి. ముంపు తీవ్రత, వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలిలో తేమ శాతం, భూభౌతిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

**కారణాలు / లక్షణాలు :** ప్రధానంగా ముంపు ప్రభావంతో నీరు నేలలో నిలబడినప్పుడు భూమిలో పంట వేర్ల వద్ద నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గడమే కాకుండా మొక్కల వేర్లు, భూమిలో ఉండే సూక్ష్మజీవులు విడుదల చేసే విషపూరిత వాయువులు అధికంగా చేరతాయి. వేర్లకు ఆక్సిజన్ సరఫరా తగ్గడం వలన వేర్లలో శ్వాసక్రియ తగ్గి పోషక పదార్థాలను గ్రహించే శక్తి తగ్గుతుంది. తద్వారా ఆకులు వడలి మొక్కలు చనిపోతాయి. నీటి ముంపుతో నేల కూడా గట్టిపడుతుంది. మొక్క రోగ నిరోధక శక్తి సన్నగిల్లి, గాలిలో తేమ శాతం పెరగడం వలన తెగుళ్ళ ఉధృతి కూడా ఎక్కువ అవుతుంది. భూమిలోని ఆక్సిజన్ శాతం తగ్గడంతో పాటు పోషక పదార్థాల లభ్యత కూడా తగ్గుతుంది. ఈ మార్పు నేలలో ఉండే సేంద్రియ పదార్థం, ఉదజని సూచిక, రసాయన సమ్మేళనాల మీద ఆధారపడి ఉంటుంది.

ముంపు పరిస్థితుల్లో లభ్యత తగ్గే మొట్టమొదటి పోషకం నత్రజని. మొక్కలు తీసుకునే నైట్రేట్ రూపం నుండి పంట ముంపుకు లోనైనప్పుడు నైట్రైట్ రూపంలోకి మారుతుంది. మిగిలిన పోషకాలైన మాంగనీస్ మాంగనిక్ గాను, ఇనుప ధాతువు ఫెర్రస్ రూపం నుండి మొక్కలు గ్రహించలేని ఫెర్రిక్‌గా మారుతుంది. క్షార భూములు, చౌడు భూముల్లో అధిక మోతాదులో బైకార్బోనేట్లు ఏర్పడడం వలన ఇనుము, జింకు మట్టి రేణువులతో గానీ, కాల్షియం కార్బోనేట్ అణువులతో గాని బంధింపబడి మొక్కలకు అందవు.

**యాజమాన్యం :** ముంపుకు గురైనప్పుడు పత్తి చేలల్లో మురుగు నీటి సౌకర్యం ఏర్పాటు చేయడం ద్వారా మొక్కలు ఎక్కువ రోజులు ఒత్తిడికి గురి కాకుండా త్వరగా కోలుకోవడానికి వీలవుతుంది.

**పత్తి పంట ముంపుకు గురైనప్పుడు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు :**

- మురుగు నీటి పారుదల ఏర్పరచి, వర్షాలు తగ్గిన తర్వాత వీలైనంత త్వరగా అంతరకృషి చేసి నేలలో తేమశాతం తగ్గేటట్లుగా చూడాలి.
- 2 శాతం యూరియా లేక పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని ఎండ ఉన్న సమయంలో పిచికారీ చేయాలి.
- 0.2 శాతం ఫెర్రస్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేసి ఇనుపధాతు లోపాన్ని సవరించవచ్చు.
- సిఫారుసు చేసిన మోతాదు కంటే మూడవ వంతు అధికంగా నత్రజని, పొటాషియం ఎరువులను పైపాటుగా వాడాలి.
- పూత, పిందె రాలడం అరికట్టడానికి 10 పి.పి.ఎం. నాప్తలిన్ అసిటిక్ ఆసిడ్ (ఎన్.ఎ.ఎ) వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయడం ద్వారా మొక్కలలోని హార్మోన్లలో సమతుల్యత సాధించి పూత, పిందె రాలడాన్ని తగ్గించవచ్చు.
- తెగుళ్ళ యాజమాన్యానికి సిఫారుసు చేసిన పద్ధతులను పాటించాలి.

పైన పేర్కొన్న యాజమాన్య పద్ధతులను పాటించి ముంపుకు గురైన పత్తి పంటను కాపాడి, దిగుబడి, నాణ్యతలో కలిగే నష్టాలను అధిగమించి సాధారణ దిగుబడులు పొందవచ్చు.

# రైతుల ముంగిటకు అన్నపూర్ణ కృషి ప్రసార సేవ (సరికొత్త సమాచార సాంకేతిక పరిజ్ఞానం)

డా.పల్లె అర్చన, శాస్త్రవేత్త, డా.ఎ.రామకృష్ణబాబు, శాస్త్రవేత్త, ఏరువాక కేంద్రం, మహబూబ్‌నగర్ జిల్లా

వాతావరణ ప్రతికూలతలు పెరిగిపోతుండడం, రకాల ఎంపిక మొదలు ఆరుగాలపు కష్టాన్ని మార్కెట్ చేసుకునే వరకు రైతుకు ఎదురయ్యే కష్టాలు అనేకానేకం. సకాలంలో సరైన సూచనలు సలహాలు అందకే రైతులు శ్రమకి, పెట్టుబడికి తగ్గ ఫలితాన్ని పొందలేకపోతున్నారు. దీనిని అధిగమించేలా అందుబాటులోకి వచ్చిన పరిజ్ఞానమే అన్నపూర్ణ కృషి ప్రసార సేవ. కేవలం ఫోన్‌కాల్‌తోనే సమాచారం తెలుసుకునే అవకాశం కల్పిస్తుంది ఈ పరిజ్ఞానం. ఈ అన్నపూర్ణ కృషి ప్రసారసేవను ఏరువాక కేంద్రం, మహబూబ్‌నగర్ జిల్లాలో 2018లో మొదలు పెట్టారు.

ఈ విధానం ద్వారా వివిధ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలి. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి వాటిని నివృత్తి చేసుకోవడానికి నేరుగా చరవాణి ద్వారా అక్షర సందేశం, శబ్ద సందేశాల ద్వారా సలహాలు, సూచనలు ఇస్తారు. రైతులకు దైనందిన కార్యక్రమాల్లో ఎదురైన వివిధ అంశాలను సమయానికి శాస్త్రీయంగా సమచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తారు. రైతులు వ్యవసాయ, పశుపోషణ, చేపల పెంపకం, ఉద్యాన పంటల్లోని సమస్యలపై సందేహాలను తీర్చుకోవచ్చు. ఈ సేవలు కేవలం నమోదైన రైతులకు మాత్రమే అందిస్తారు.

ఇప్పటి వరకు ఏరువాక కేంద్రం, మహబూబ్‌నగర్ జిల్లా వారి ఆధ్వర్యంలో 2563 మందిరైతుల చరవాణి నంబర్లను నమోదు చేసుకున్నారు. రైతులు నమోదు చేసుకున్న నంబర్ల ద్వారానే సలహాలను అడుగుతారు. ఒక వేళ రైతులకు శాస్త్రవేత్తలతో తమ పంట సమస్యల గురించి చర్చించాలంటే ఉచిత ఫోన్ నంబర్ 1800425 3141ను కూడా ఏర్పాటు చేశారు. గత రెండు సంవత్సరాలుగా 81 మంది రైతులకు చరవాణి ద్వారా సందేహాలను తీర్చారు. అలాగే 342 అక్షర సందేశాలు, 100 శబ్ద సందేశాలను ఎప్పటికప్పుడు కాలానుగుణంగా పంపారు. ఒక వేళ రైతులు తమ నంబర్‌ను మార్చుకోవాలంటే ఏరువాక కేంద్రానికి వచ్చి మార్చుకోవడం జరుగుతుంది.

**ఈ అన్న పూర్ణ కృషి ప్రసార సేవ ముఖ్య లక్షణాలు, ఉపయోగాలు :**

- ఇది వెబ్ (ఇంటర్నెట్ ఆధారిత) ఐ.వి.ఆర్.ఎస్. (స్వర ఆధారిత), మొబైల్ యాప్ పరిజ్ఞానాలను (యు.ఎం.ఎ.ఎన్.ఎ.కె.పి.ఎస్) ఉపయోగించుకునే సమీకృత వ్యవస్థ.
- రైతు వివరాలు, పొలం వివరాల ఆధారంగా వ్యక్తిగత వ్యవసాయ సలహాలు అందించే వ్యవస్థ.
- ఉచిత ఫోన్ నెంబర్ ద్వారా రైతులు 24 గంటల్లో ఎప్పుడైన తమ సమస్యలను శాస్త్రవేత్తలకు నివేదించవచ్చు.
- ఒక వేళ శాస్త్రవేత్తలు సాంకేతిక కారణాలు వల్ల అందుబాటులో లేనప్పుడు,రైతులు తమ సమస్యలను ఉచిత ఫోన్ నెంబర్ ద్వారా రికార్డు చేసుకునే సదుపాయం ఉంది.
- రైతులు తమ సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని మాతృభాషలో పొందవచ్చు.
- రైతులు అడిగిన ప్రశ్నలు, సమాధానాలు ఎప్పుడైనా వారు మళ్ళీ మళ్ళీ వినడానికి, చూడడానికి సదుపాయం ఉంది. అలాగే ఉచిత ఫోన్ నెంబర్ ద్వారా రైతులు, వారు పాటించే ఉత్తమ వ్యవసాయ పద్ధతులను, వారి అనుభవాలను రికార్డు చేసి ఇతర రైతు స్నేహితులతో పంచుకోవచ్చు.
- స్మార్ట్ ఫోన్ గల రైతులు తమ ప్రశ్నలను యాప్ ద్వారా అడగవచ్చు. దీని కోసం రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుండి ఉమన్ (యు.ఎం.ఎ.ఎన్.ఎ.) యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని అందులో ఎ.కె.పి.ఎస్.ని సెలెక్ట్ చేసుకొని అందులో కూడా మీ పేరును అన్నపూర్ణ కృషి ప్రసార సేవలో నమోదు చేసుకుని తమ ప్రశ్నలను అడగవచ్చు.

పైన చెప్పినట్లుగా ఎంతో ఉపయోగకారిగా ఉన్న ఈ అన్నపూర్ణ మోడల్ మహబూబ్‌నగర్, నారాయణపేట్, జోగులాంబ గద్వాల జిల్లాలోని రైతులకు ఏరువాక



కేంద్రం, మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో విజయవంతంగా సందేహాలను, సలహాలు, కాలానుగుణంగా ఇస్తున్నారు.

ఏరువాక కేంద్రం, మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో 90 మంది రైతుల దగ్గర నుంచి అన్నపూర్ణ కృషి ప్రసార సేవ వినియోగం గురించి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఈ విధంగా తమ అనుభవాలను పంచుకున్నారు.

86.67 శాతం రైతులు అన్నపూర్ణ కృషి ప్రసార సేవ ద్వారా సమాచారం కాలానుగుణంగా అందుతోందని, 83.33 శాతం రైతులు సమాచారం (అక్షర, శబ్ద సందేశాలు) అర్థవంతంగా ఉంటోందని, 77.88 శాతం రైతులు సందర్భానుచితంగా సమాచారం అందుతోందని చెప్పారు.

అలాగే 55.55 శాతం రైతులు ఒక సమాచారం వారానికి రెండు సార్లు పంపాలని, 51.11 శాతం రైతులు తమ చరవాణికి వచ్చిన సమాచారాన్ని తోటి రైతులతో పంచుకోవడం, 48.89 శాతం రైతులు సమాచారం సాయంత్రం వేళలో పంపిస్తే బాగుంటుందని తెలియజేశారు.

అలాగే 94.44 శాతం రైతులు అన్నపూర్ణ కృషి ప్రసార సేవ ద్వారా పంటల పురుగులు, తెగుళ్ళ యాజమాన్యం గురించి ఎక్కువ సమాచారం కావాలని, 80.00 శాతం రైతులు అక్షర సందేశాల కన్నా శబ్ద సందేశాలు ఎక్కువ పంపాలని చెప్పారు.

**రైతు విజయగాథలు :**

ఎస్. అశోక్, ఫరీద్‌పూర్ గ్రామం, చిన్న చింతకుంట మండలం, మహబూబ్‌నగర్ జిల్లా, ఐ.డి. 247300967, చరవాణి నెం. 9949966860, నమోదు చేసుకున్న తేదీ : 23-07-2019

ఈ రైతు 4 ఎకరాలలో పత్తి సాగు చేస్తున్నారు. ఏరువాక కేంద్రం వారి అన్నపూర్ణ కృషి ప్రసార సేవలో జూలై మాసంలో చరవాణి నంబర్‌ను నమోదు చేసుకున్నారు. ఆగస్టు నెలలో పత్తిలో రసం పీల్చే పురుగుల ఉధృతిని గమనించారు. దేవరకద్రలోని పురుగు మందుల దుకాణంలో ఎమామెక్టిన్ బెంజోయేట్ + ఫిప్రోనిల్, ఎసిటామిప్రిడ్, ఫెనిటో రూ.5744 ఇచ్చి తీసుకున్నారు. అదే సమయంలో ఏరువాక కేంద్రం వారి అన్నపూర్ణ కృషి ప్రసార సేవ నుండి ఆగస్టు 14న రసం పీల్చే పురుగు ఉధృతిని తగ్గించడానికి ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాల్సిందిగా అక్షర సందేశం వచ్చింది. వెంటనే ఏరువాక కేంద్రం వారి టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి దుకాణంలో తీసుకున్న మందుల గురించి చర్చించి ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లీటరు నీటికి మందు మాత్రమే సరిపోతుందని, మిగతా మందులని దుకాణంలో ఇవ్వమని చెప్పారు. ఇలా చేయడం వల్ల ఒక హెక్టారుకు పురుగు మందులకు అయ్యే ఖర్చులో రూ.2813 తగ్గించుకున్నారు. అన్నపూర్ణ కృషి ప్రసార సేవ ద్వారా సరైన సమయంలో సరైన సందేశాలు సందర్భానుచితంగా రావడం వల్ల రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు కలుగుతుందని అశోక్ చెప్పారు. అలాగే తన చరవాణికి వచ్చిన సందేశాలను ఇతర రైతులకు కూడా చెపుతున్నానని, ఈ విధంగా ఏరువాక కేంద్రం వారు ఎప్పుడూ సందేశాలు రైతులకు పంపాలని కోరారు.

డి.రవీందర్ గౌడ్, బుద్దారం గ్రామం, హన్వాడ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా, రైతు ఐడి. 24730021, చరవాణి నెంబరు : 966681200, నమోదు తేదీ : 12-02-2018.

రవీందర్‌గౌడ్ 4 ఎకరాలలో మొక్కజొన్నను పండిస్తున్నారు. ఏరువాక కేంద్రం వారి అన్నపూర్ణ కృషి ప్రసార సేవలో ఫిబ్రవరి 2018లో చరవాణి నంబర్‌ను

# భారీ వర్షాల సమయంలో పిడుగుపాటుకు గురికాకుండా రైతులు పాటించవలసిన జాగ్రత్తలు

బి.శ్రీలక్ష్మి, డా.ఎస్.నవీన్ కుమార్, డా.బి.వెంకట రాజ్ కుమార్, డా.ఎం.సురేష్, డా.ఎం.శ్వేత, పి.విజయ్ కుమార్,
వ్యవసాయ వాతావరణ విభాగం, కృషి విజ్ఞాన కేంద్రం, నిజామాబాద్.

అక్టోబర్ మాసంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత పెరిగి వాతావరణంలోని గాలి వేగం, గాలి దిశలో తేడాలు చోటు చేసుకుని భారత తీర పరిసరంలోని బంగాళాఖాతంలో అల్పపీడనాలుఏర్పడి తుఫానుకు దారితీస్తాయి. ఈ తుఫానుల ప్రభావంతో దట్టమైన నల్లని మేఘాలైన cummulo nimbus మబ్బులు ఆకాశం అంతటా విస్తరించి ఉరుములు మెరుపులు, పదునైన జల్లులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలకు దారితీస్తాయి. ఈ ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని భారత వాతావరణ విభాగం వారు ముందుగానే తుఫాను ఏర్పడకముందే వాటి హెచ్చరికలను జారీ చేస్తారు. ఈ హెచ్చరికలను తమ స్థానిక ప్రదేశంలోని రైతులకు వెంటనే తెలియజేయడానికి కృషి విజ్ఞాన కేంద్రాల నుండి DAMU శాస్త్రవేత్తలు వివిధ అనుసంధాన సామాజిక మాధ్యమాల ద్వారా అందజేస్తారు. కావున రైతులు తుఫాను సమయంలో వాతావరణ శాఖ వారు అందించే ముందస్తు వాతావరణ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకొని కింద తెలుపబడిన జాగ్రత్తలను పాటించాలి.

**ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే సూచనను అందించినప్పుడు రైతులు పాటించవలసిన జాగ్రత్తలు:**

- వర్షం కురిసినపుడు చెట్ల కింద తలదాల్చుకోకూడదు. పిడుగులు పొడవైన చెట్ల మీద పడే అవకాశమే ఎక్కువగా ఉంటుంది ఎందుకంటే చెట్లులోని తేమ పిడుగును ఆకర్షించుకుంటుంది.
- విద్యుత్ సరఫరా అయ్యే పరికరాలకు (ముఖ్యంగా విద్యుత్ స్థంబాలు, సెల్ ఫోన్ టవర్లు, బోర్ పంప్ సెట్లు) దూరంగా ఉండాలి. వాటి నుంచి వచ్చే నీటిని కూడా ఆ సమయంలో ఉపయోగించకూడదు.
- బహిరంగ ప్రదేశాలలో పిడుగు పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది కాబట్టి బహిరంగ ప్రదేశాలలో ఉండకూడదు.
- పంట పొలాలలో మొబైల్ ఫోన్లను వాడకూడదు. ఎందుకంటే మొబైల్ ఫోన్ల నుంచి వచ్చే సిగ్నల్ పిడుగు పడే అవకాశాన్ని ఎక్కువ చేసి పిడుగును ఆకర్షించుకుంటుంది.
- పాడి పశువులను మేతకు బయటికి తీసుకెళ్లకుండా పశువుల పాకలలోనే ఉంచాలి.
- నల్లని మబ్బులు ఆకాశం అంతటా విస్తరించి భారీ వర్షం కురుస్తున్నప్పుడు రైతులు పంట పొలాలలో తిరగకుండా ఏవైనా భవనాల కిందే తలదాల్చుకునే లాగా చూసుకోవాలి. ఒకవేళ వారికి అందుబాటులో ఏదైనా భవనం లేకపోతే తాము ఉన్న స్థావరంలోనే మోకాళ్లపై కూర్చొని రెండు చెవులను తమ చేతులతో మూసుకోవాలి.
- స్మార్ట్ ఫోన్ వాడే రైతులు తమ మొబైల్ ఫోన్‌లోని ప్లే స్టోర్ నుండి DAMINI అనే మొబైల్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలి. ఈ DAMINI యాప్ తమ స్థానిక ప్రదేశం నుండి 20 నుండి 40 కిలోమీటర్ల పరిధిలో సంభవించే ఉరుములు మెరుపులు, పిడుగుల హెచ్చరికలను ముందుగానే జారీచేస్తుంది.

**మరిన్ని వివరాలకురైతులు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:** డా. ఎస్. నవీన్ కుమార్, (ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, సెల్: 9989623830, బొట్టు శ్రీలక్ష్మి, శాస్త్రవేత్త (వ్యవసాయ వాతావరణ విభాగం - డి.ఎ.ఎం.యు.), సెల్: 8106894839, కృషి విజ్ఞాన కేంద్రం, నిజామాబాద్.

---

నమోదు చేసుకున్నారు. 2019 ఖరీఫ్ మాసంలో మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతిని గమనించారు. జూలై మాసం నుండి సెప్టెంబర్ మాసం వరకు కత్తెర పురుగు యాజమాన్య పద్ధతుల గురించి అక్షర, శబ్ద సందేశాలను, ఏరువాక కేంద్రం, మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో పంపారు. రవీందర్ గౌడ్ ఆ సలహాలను, సందేశాలను క్రమ పద్ధతిలో పాటించడం వల్ల మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును సమర్థవంతంగా నిర్మూలించి, ఎకరాకు 20 క్వింటాళ్ళ దిగుబడిని పొందారు. ఏరువాక కేంద్రం వారు అన్న పూర్ణ కృషి ప్రసార సేవ ద్వారా సరైన పురుగు మందులు, సరైన మోతాదులో, సరైన సమయంలో పంపడం వల్ల రైతులు అనవసరంగా పెట్టే పురుగు మందుల ఖర్చులను తగ్గించుకుని అధిక దిగుబడులను పొందవచ్చు అని చెప్పారు.

# ఆలుగడ్డ సాగు యాజమాన్యం

కె.సరిత, శాస్త్రవేత్త, కె.రాహుల్ విశ్వకర్మ, కోఆర్డినేటర్, డాట్ సెంటర్, సంగుపేట్



ప్రాంతాన్ని బట్టి ఆలుగడ్డను బంగాళదుంప, ఉర్లగడ్డ అనికూడా పిలుస్తుంటారు. అత్యధిక కార్బోహైడ్రేట్లు కలిగిన ఈ దుంప పంటను సాగు చేయడానికి రైతులు ఎక్కువ మొగ్గ చూపుతుంటారు.

మన తెలంగాణలో చల్లని వాతావరణం ఉన్న జిల్లాలు అయినటువంటి ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో రబీలో ఎక్కువగా సాగుచేస్తుంటారు.

**నాటే సమయం :** అక్టోబర్ 2వ పక్షం నుండి - నవంబర్ మొదటి పక్షం వరకు నాటుకోవడానికి అనుకూలం. ఆలుగడ్డ సాగుకు చల్లని వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

**నేలలు :** ఆలుగడ్డని సారవంతమైన ఇసుక నేలలు, తేలికపాటి నేలల్లోసాగుచేయడానికి అత్యధికంగా అనుకూలంగా ఉంటాయి. బరువైన నేలలు ఈ పంటసాగుకు పనికిరావు.

**నేల తయారీ :** విత్తే ముందు నేలను ఒకసారి లోతు దుక్కి చేసుకోవాలి. అంతే కాకుండా గొర్రుతో 2-3 సార్లు దుక్కి చేసుకుని పంట నాటుకోవడానికి సిద్ధం చేసుకోవాలి.

**రకాలు :** మన ప్రాంతంలో సాగుకు కుఫ్రీజ్యోతి, కుఫ్రీ చంద్రముఖి, కుఫ్రీ ప్రక్‌రాజ్, కుఫ్రీ బాద్‌షా రకాలు అనుకూలంగా ఉంటాయి. 90-100 రోజుల పంటకాల పరిమితి కలిగిన రకాలు ఎకరాకు 9-12 టన్నుల దిగుబడిని ఇస్తాయి.

**విత్తన మోతాదు :** ఎకరాకు 600-800 కిలోల విత్తనం అవసరం అవుతుంది. విత్తనాలుగా పెద్ద దుంపలను తీసుకున్నట్లయితే వాటిని చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని, ఒక్కో ముక్కకు 2-3 కనులు ఉండేటట్లు చూసుకోవాలి.

**విత్తనశుద్ధి :** విత్తనాన్ని నాటుకోవడానికి ముందు విత్తనశుద్ధి చేసుకోవాలి. ఇందుకుగాను సి.ఒ.సి. 3 గ్రా. లీటరు నీటికి కలిపిన ద్రావణంలో 2-3 నిమిషాలు ముంచి ఆ తరువాత నాటుకోవాలి. లేదా 25-50 గ్రా.ల మిథైల్ ఇథాక్సీ మెర్క్యురిక్ క్లోరైడ్‌ను 10 లీటర్ల నీటికి కలిపిన ద్రావణంలో 2-5 నిమిషాల పాటు దుంపలను నానబెట్టి విత్తుకోవాలి.

**నాటడం :** ఆలుగడ్డను బోదెలు, కాలువల పద్ధతిలో నాటుకోవాలి. వరుసల మధ్య 50 సెం.మీ., వరుసలోని మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా బోదెలకు ఒక పక్కగా, కన్నులు పైవైపు వచ్చేలా నాటుకోవాలి.

**ఎరువుల యాజమాన్యం :** ఆలుగడ్డకు సిఫారుసు చేసిన మేరకు పోషకాలని వేయాలి. ఆఖరి దుక్కిలో పశువుల ఎరువును 10-12 టన్నులు వేయాలి. దీనితో పాటు 40 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 30 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలి. విత్తిన 30 రోజులకు 40 కిలోల యూరియా, 50 రోజులకు 20 కిలోల యూరియా, 30 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పైపాటుగా వేయాలి.

**కలుపు యాజమాన్యం :** విత్తిన 2-3 రోజులకు ఎకరాకు ఒక లీటరు అలాక్లోర్ లేదా 300 గ్రా. మెట్రిబ్యుజిన్‌ను పిచికారీ చేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత 3-4 సార్లు మట్టిని మొక్కల మొదళ్ళకు ఎగదోయాలి. లేకపోతే అభివృద్ధి చెందుతున్న దుంపలపై సూర్యరశ్మి పడి దుంప ఆకుపచ్చ రంగుకు మారుతుంది. తద్వారా దుంప నాణ్యత కోల్పోయే ప్రమాదం ఉంది. కాబట్టి మట్టి ఎగదోత తప్పనిసరి.

**నీటి యాజమాన్యం :** ఆలుగడ్డ సాగు చేస్తున్న నేల, వాతావరణ పరిస్థితులను బట్టి నీటి తడులను ఇవ్వాల్సివస్తుంది. చెల్కా నేలలో మొలకెత్తడానికి ముందు 7-8 రోజుల వ్యవధి లోను, దుంప ఏర్పడే దశలో 4-5 రోజుల వ్యవధిలో నీటి తడులు ఇవ్వాలి.

**పురుగులు, తెగుళ్ళ యాజమాన్యం :**

**ఆకుమాడు తెగులు :** ఆలుగడ్డకు ప్రధాన సమస్యగా ఉంటుంది. ఈ తెగులు ఆశించినప్పుడు ఆకులు, కొమ్మలపై నల్లని మచ్చలుఏర్పడతాయి. తెగులు తీవ్రత ఎక్కువైనప్పుడు మొక్కలు ఎండిపోయి నేలపై రాలిపోతాయి.

# స్వల్పకాలిక పంట ధనియాల సాగు

డా.పిడిగెం సైదయ్య, శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, 7780509322

ప్రస్తుత నీటి ఎద్దడి పరిస్థితుల నేపథ్యంలో స్వల్పకాలిక పంటల వైపుమొగ్గు చూపాలి. ఇందుకు ధనియాల సాగు ఉత్తమం. ఈ పంటను ప్రతి పదిహేను రోజులకు ఒకసారి మార్కెట్లో విక్రయించి ఆదాయం పొందవచ్చు. ఏడాది అంతా ఆదాయ మార్గంగా ఉంటుంది.

ధనియాల పంట ఆకులను, గింజలను సుగంధ ద్రవ్యంగా వాడుతారు. స్వల్పకాలిక పంట కావడం, విత్తనాలతో సాగు చేసే సౌలభ్యం ఉండటంతో పాటు, మండలాలు, పట్టణాల్లో కొత్తిమీరకు ఎప్పుడూ గిరాకీ ఉంటుంది. దీంతో ఈ పంట సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. తక్కువ నీటితో వర్షాధారంగా సాగు చేసుకోవచ్చు. చీడపీడల సమస్య తక్కువ. సాగు నీటి ఆధారంగా దిగుబడులు పెరుగుతాయి. ధనియాల పంటకైతే రకాన్ని బట్టి సాగు కాలం మారుతుంది. కొత్తమీర కోసం ఒక నెలలోనే దిగుబడి చేతికి వస్తుంది.

**నేలలు, వాతావరణం:** మురుగు నీరు పోయే సౌకర్యం ఉన్న ఇసుక, ఒండ్రు నేలలు ఈ పంట సాగుకు అనుకూలం. వర్షాధార పంటకు ఒండ్రు నేలలు అయితే మేలు. ఉదజని సూచిక 6-8 మధ్య ఉండాలి. 20-25 డిగ్రీల ఉష్ణోగ్రత అనుకూలం. మంచురహిత, చల్లని, పొడి వాతావరణంలో ఆకుల అభివృద్ధి బాగుంటుంది.

**విత్తనశుద్ధి:** హెక్టారుకు 1.5 కిలోల చొప్పున అజోస్పైరిల్లం జీవన ఎరువు ను వాడి విత్తనశుద్ధి చేస్తే మొక్కల సాంద్రత పెరుగుతుంది. అదే జీవన ఎరువుతో విత్తనశుద్ధి కూడా చేయాలి. వర్షాధార పంట లో నీటి ఎద్దడిని తట్టు కునేలా చేసుకునేందుకు లీటరు నీటిలో 10 గ్రాముల పొటాషియం డై హైడ్రోజన్ పాస్ఫేట్‌ను కలిపి తయారుచేసిన ద్రావణంతో 16 గంటల పాటు శుద్ధి చేయాలి. కిలో విత్తనానికి నాలుగు గ్రాముల చొప్పున ట్రైకోడెర్మా విరిడి తో విత్తనశుద్ధి చేస్తే వడల తెగులు నుంచి కాపాడుకోవచ్చు.

**రకాలు :**

**స్వాతి:** 80-85 రోజుల పంట కాలం. స్వల్ప కాలిక పంట. బూజు తెగులు తట్టుకుంటుంది. దిగుబడి హెక్టారుకు 900 కిలోలు.

**సింధు:** మధ్య కాలిక పంట. 95-100 రోజుల పంట కాలం. గింజ మధ్యస్థంగా ఉంటుంది. దిగుబడి హెక్టారుకు 1050 కిలోలు.

**సాధన:** మధ్య కాలిక పంట. 70 సెం.మీ వరకు పెరుగుతుంది. గింజలు, ఆకుల కోసం సాగు చేయవచ్చు. పేను బంకను తట్టుకుంటుంది. నల్లరేగడి నేలల్లో దిగుబడి ఎక్కువ. దిగుబడి హెక్టారుకు 1000-1100 కిలోలు.

**సుధ:** 80-98 రోజుల పంట. గింజలు మధ్యస్థ పరిమాణంలో ఉంటాయి. దిగుబడి హెక్టారుకు 850-1200 కిలోలు.

**సుగుణ:** 90-95 రోజుల పంట. దిగుబడి: 750-1350 హెక్టారుకు కిలోలు దిగుబడి వస్తుంది

**నివారణ :** ఈ తెగులు నివారణకు జినెబ్ 2 గ్రా. లేదా క్లోరోథలోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పంట విత్తిన 30 రోజుల తర్వాత నుండి ప్రతి 8 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి. ఇలా పంట కాలంలో అవసరాన్ని బట్టి 5-6 దఫాలు పిచికారీ చేయాల్సి ఉంటుంది.

**ఆకుతినే పురుగులు :** అప్పుడప్పుడు ఈ ఆకుతినే పురుగులు ఆశించి నష్టపరుస్తాయి. దీని నివారణకు గాను ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**కోత :** ఆలుగడ్డ పక్వతను గుర్తించడం అత్యంత కీలకం. నాటిన 90-100 రోజులకు దుంపలు తీయడానికి సిద్ధం అవుతాయి. నేలపై భాగంలో మొక్కలు వాలిపోయి, ఆకులు పసుపు వర్ణం నుండి గోధుమ వర్ణంకు మారి పడిపోతాయి. దుంపలకు తగలకుండా జాగ్రత్తగా గడ్డపారతో తవ్వినాగానీ, డిగ్గర్‌తో గానీ దుంపలను తీసి నీడలో ఆరబెట్టాలి.

ఈ విధమైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు ఎకరానికి 10-14 టన్నుల దిగుబడి సాధించడానికి అవకాశం ఉంటుంది.



**సురుచి:** విత్తిన 35-55 రోజుల్లో కోతకొస్తుంది. హెక్టారుకు 2.50-4.5 టన్నుల కొత్తిమీర దిగుబడినిస్తుంది.

**సుస్థిర:** 85-90 రోజుల పంటకాలం. వర్షాధారంగా సాగు చేస్తే హెక్టారుకు 12-14 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

**సస్యరక్షణ:**

**పేనుబంక:** లీటరుకు రెండు మి.లీ. మిథైల్డెమటాన్ లేదా డైమిథోయేట్ పిచికారీ చేయాలి.

**బూజు తెగులు:** కిలో విత్తనానికి 10 గ్రాముల చొప్పున సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్‌తో విత్తనశుద్ధి లేదా లీటరుకు రెండు గ్రాముల చొప్పున పైపాటుగా పిచికారీ చేయాలి. హెక్టారుకు ఒక కిలో చొప్పున తడి గంధకం లేదా హెక్టారుకు 250 మి.లీ. చొప్పున డినోక్యాప్ను మొదట తెగులు లక్షణాలు కన్పించిన వెంటనే ఒకసారి, 10 రోజుల తర్వాత మరోసారి పిచికారీ చేయాలి. 5 శాతం వేప గింజల కషాయం సైతం మూడు సార్లు పిచికారీ చేసి తెగులును నిర్మూలించవచ్చు.

**వడలు తెగులు:** హెక్టారుకు ఐదు కిలోల సూడోమోనాస్ ఫ్లోరి సెన్స్ను నేలలో వేసి నియంత్రించవచ్చు.

**గింజ బూజు:** గింజ కట్టిన 20 రోజుల తర్వాత హెక్టారుకు 500 గ్రాముల చొప్పున కార్బండిజం పిచికారీ చేసి నివారించవచ్చు.

**విత్తన మోతాదు:** సాగు నీటి ఆధారంగా అయితే హెక్టారుకు 10-15 కిలోల విత్తనాలు వాడాలి. అదే వర్షాధారంగా అయితే 20-25 కిలోల విత్తనం అవసరం. తాజాగా సేకరించిన విత్తనాల కంటే 15-30 రోజుల పాటు నిల్వ ఉంచితే విత్తనాలు బాగా మొలకెత్తుతాయి. 12-24 గంటల పాటు నీటిలో నానబెట్టినా మొలక శాతం ఎక్కువ. విత్తనాన్ని చేతితో రెండుగా విడదీసి నాటాలి. వరుసల మధ్య 30-40 సెం.మీ, మొక్కల మధ్య 15 సెం.మీ దూరంతో విత్తనాలు నాటాలి. మూడు సెం.మీ లోతులోనే నాటాలి. 10-15 రోజుల్లో విత్తనం మొలకెత్తుతుంది.

**ఎరువులు:** చివరి దుక్కిలో ఎకరాకు 10 టన్నులు బాగా చివికిన పశు వుల ఎరువు వేయాలి. వర్షాధారంగా లేదా సాగు నీటి ఆధారంగా సాగు చేసే అనే అంశంపైనే వాడాల్సిన ఎరువుల మోతాదు మారుతుంది. సాగు నీటి వసతి ఆధారంగా అయితే హెక్టారుకు 30 కిలోల నత్రజని, 40 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్నిచ్చే ఎరువులను వాడాలి. అదే వర్షాధారంగా అయితే 20 కిలోల నత్రజని, 30 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాస్‌లనిచ్చే ఎరువులు వాడాలి. నీటి వసతి ఉంటే నాటిన 30 రోజుల తర్వాత 15 రోజుల వ్యవధిలో నేలలో తేమను బట్టి నీటి తడులివ్వాలి.

**అంతర కృషి:** 30 రోజులలోపు కలుపు తీయాలి. కుదురుకు రెండు మొక్కలు మాత్రమే ఉంచి, మిగతా వాటిని తీసివేసి పలుచన చేయాలి.

**కోత:** పంట రకం, కాలాన్ని బట్టి 90-110 రోజుల్లో కోతకొస్తుంది. ధనియాలు ఆకుపచ్చ రంగు నుంచి గోధుమ రంగులోకి మారే సమయం లో కోయాలి. ఆలస్యమైతే కోత సమయంలో గింజలు రాలడం, ఆ తర్వాత శుద్ధి సమయంలో ధనియాలు పగిలిపోతాయి. కాబట్టి సకాలం లో కోయాలి. మొక్కలను కోయటం లేదా పీకి చిన్న కుప్పలుగా వేసి, కట్టెలతో కొట్టి లేదా చేతులతో గింజలు సేకరించాలి. పాక్షిక ఎండలో ఆరబెట్టి, కాగితాలతో చుట్టిన నార సంచులలో నిల్వ చేసుకోవాలి.

**దిగుబడి:** వర్షాధార పంటలో హెక్టారుకు 400-500 కిలోల ధనియాల దిగుబడి. సాగు నీటి వసతి ఆధారంగా అయితే హెక్టారుకు 600-1200 కిలోలు. కొత్తిమీర కోసం అయితే 30-40 రోజుల తర్వాత మొత్తం మొక్కను పీకి, మార్కెట్కు తరలించాలి. కొత్తిమీర దిగుబడి: హెక్టారుకు 6-7 టన్నులు.

**కొత్తిమీర కోసం:** ఒకేసారి పొలమంతా విత్తనం వేయకుండా దఫాలుగా వేస్తే మార్కెట్కు అవసరం మేరకే తరలించవచ్చు.

సాగు.. సంగతులు

# సాగు... సంగతులు..2

(వ్యవసాయంలో రైతులు మెరుగైన నిర్ణయాలు చేయడానికి ఉపయోగపడే సమాచారాన్ని వైవిధ్య వ్యవసాయ పద్ధతులను అందుబాటులోకి వస్తున్న, వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన వివరాలను ఒక దగ్గర రైతులకు అందజేసే ఉద్దేశంతోనే ఈ శీర్షిక. రైతులకు ఉపయోగపడే, మన వ్యవసాయ మెరుగుదలకు ఉపయోగపడేవన్నీ సాగు.. సంగతులే..)

సేకరణ-సంకలనం : డి.వి.రామక్రిష్ణారావు, సహాయ సంపాదకులు, వ్యవసాయ పాడిపంటలు, వ్యవసాయ కమిషనర్ కార్యాలయం, హైదరాబాద్

## యాసంగిలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలే సాగుచేసుకుందాం..

12 సెప్టెంబర్ 2021న రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధ్యక్షతన వ్యవసాయశాఖ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. బాయిల్డ్ రైస్‌ను కేంద్ర ప్రభుత్వం కొనబోదని, తెలియజేసిన నేపథ్యంలో యాసంగిలో రైతులు వరి పంట వేయడం శ్రేయస్కరం కాదని అన్నారు. వరికి బదులుగా శనగలు, వేరుశనగ, మినుము, పెసర, నువ్వులు, ఆవాలు, పొద్దు తిరుగుడు, ఆముదాలు, కూరగాయల్లాంటి పంటలు పండిస్తే రైతులకు లాభదాయకమని సూచించారు. పంటల వైవిధ్యీకరణతోనే వ్యవసాయానికి, రైతులకు మెరుగైన భవిష్యత్తు సాధ్యమని అన్నారు.

## వ్యవసాయ కార్యదర్శిగా ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్.

రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్. వ్యవసాయశాఖ కార్యదర్శి, కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ 30 ఆగస్టు 2021న ఉత్తర్వులు జారీ చేశారు.

## మైక్రో గ్రీన్స్‌తో ఆరోగ్యం - ఉపాధి

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం లభించే వాటిలో మైక్రోగ్రీన్స్ పెంపకం ఒకటి. మనం నిత్యం



వాడుకునే విత్తనాలు, గింజలు, కూరగాయలు, ఆకుకూరలకు చెందిన మొలకలే ఈ మైక్రోగ్రీన్స్. ఇందుకు ట్రేలు, కుండీలు పెట్టుకోవడానికి సరిపడా కొద్దిపాటి స్థలం ఉంటే చాలు. మార్కెట్‌లో అందుబాటులో ఉండే గోధుమ గడ్డి, పొద్దుతిరుగుడు, గుమ్మడి, ముల్లంగి, బీట్‌రూట్, ఆవాలు, మెంతులు, క్యాబేజి, జీలకర్ర, వాము, పెసర్లు వంటి పలు రకాల విత్తనాలను మైక్రోగ్రీన్స్ గా పెంచవచ్చు. దీన్ని ఉపాధిగా మలుచుకునే వారికి గొప్ప అవకాశం. మార్కెట్‌లో వీటి ధర కిలోలు వెయ్యి రూపాయల వరకు పలుకుతోంది. తక్కువ కష్టంతో ఎక్కువ ఆదాయం పొందడానికి మేలైన మార్గం.

## మార్కెట్‌లోకి విజయ ఉత్పత్తులు..

నాణ్యతకు మారుపేరైన విజయ ఉత్పత్తులను ఆదరించాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వినియోగదారులను కోరారు. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో విజయ బ్రాండ్‌తో తీసుకువచ్చిన 23 రకాల కొత్త ఉత్పత్తులను ఆయన 23 ఆగస్టు 2021న మార్కెట్‌లోకి విడుదల చేశారు. కల్తీ లేని నాణ్యమైన ఉత్పత్తులను సరసమైన ధరలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వంరంగ సంస్థ ఈ పనికి పూనుకుందని మంత్రి తెలిపారు. మార్కెట్‌లో కల్తీలను అరికట్టేందు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో నూనె గింజల సాగు విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

## నానో ట్రాక్టర్..

విత్తనాలను వేయాలన్నా, కలుపు తీయాలన్నా, పురుగు మందులు పిచికారీ చేయాలన్నా కూలీలు అవసరం. ఇప్పుడు మారుతున్న పరిస్థితుల్లో వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం కష్టంగా మారిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో చిన్న కమతాలు గల రైతులకు సైతం



అందుబాటులో ఉండే విధంగా ఎలక్ట్రిక్ నానో ట్రాక్టర్‌కు రూపకల్పన చేశారు. విద్యుత్‌తో నడిచే ఈ యంత్రానికి వెనక ట్రాలీ తగుల్చుకుని దానిపై ఇద్దరు వ్యక్తులు కూర్చొని పంటపై పురుగు మందులు పిచికారీ చేసే వెసులుబాటు చేశారు. రవాణాకు కూడా దీన్ని వాడుకోవచ్చు. ఈ నానో ట్రాక్టర్‌కు అదనంగా 2 హెచ్.పి. మోటార్‌ను బిగించుకుంటే గడ్డిని కూడా కత్తిరించుకునే వీలుంటుంది.

### ఇంటింటా మిద్దెతోట..

సూర్యాపేట మిద్దె పంటల పేటగా మారింది. మున్సిపాలిటీ లోని ఇండ్లపై పందిరి తోటల పంట పండుతున్నది. క్యాంప్ కార్యాలయంలో మంత్రి జగదీశ్‌రెడ్డి నాటిన బీజం సూర్యాపేట ప్రజలకు ప్రేరణగా నిలిచింది. సూర్యపేట పట్టణంలో 1050 ఇళ్లపై సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పూలు, పండ్లు సాగు చేస్తున్నారు. వీటి ద్వారా ప్రతి రోజు 1500 కిలోలకు పైగా వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. 10 వేల రూపాయలు విలువ చేసే రూఫ్ గార్డెన్ కిట్లను రూ.1500లకే అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మిద్దె తోటలను ప్రోత్సహిస్తోంది.

### అనవసర సాగు ఖర్చును నివారించాలి

దేశంలో రైతు కుటుంబాల సగటు అప్పులు ఐదేళ్ళలో 57 శాతం పెరిగాయని జాతీయ గణాంక కార్యాలయం తాజాగా విడుదల చేసిన 77వ రౌండ్ సర్వే తెలియజేస్తోంది. సగటున ఆంధ్రప్రదేశ్‌లో అప్పు 2.46 లక్షలు, కేరళలో 2.43 లక్షలు, పంజాబ్‌లో 2.03 లక్షలు కాగా తెలంగాణలో సగటు అప్పు 1.52 లక్షలుగా ఉన్నట్లు ఈ గణాంకాలు చెబుతున్నాయి. రైతులు భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులను వినియోగించడం, చీడపీడల ఉధృతిని అనుసరించి శాస్త్రవేత్తలు సూచించిన మేరకే సస్యరక్షణ చర్యలను చేపట్టడం, విత్తనాలను గ్రామ స్థాయిలోనే ఉత్పత్తి చేసుకోవడం, తమ నేలకు అనుకూలమైన పంటలనే పండించడం, మార్కెట్ అవసరాలను బట్టి లాభదాయక సాగు చేపట్టడం, ఉత్పాదకాలను, వనరులను అవసరం మేరకే వినియోగించుకోవడం ద్వారా అనవసర ఖర్చు నుంచి తద్వారా అనవసర పెట్టుబడి, అప్పుల నుంచి తప్పించుకునే దిశగా రైతాంగం ఆలోచించాలి.

### మూడొంతుల రైతులకు హెక్టారులోపే భూమి..

దేశంలో మూడొంతుల రైతుల వద్ద ఉన్న భూమి మొత్తం విస్తీర్ణంలో 3వ వంతు మాత్రమేనని 77వ జాతీయ నమూనా సర్వేలో వెల్లడించింది. దేశంలో ఉన్న భూమి, కమతాలు, రైతు కుటుంబాలు, పాడిపశువుల పెంపకం తదితరాలపై చేసిన సర్వేలను జాతీయ కార్యక్రమాల అమలు, గణాంకాల శాఖ విడుదల చేసింది. తెలంగాణలో హెక్టారు లోపు భూమి ఉన్నవారు 42.2 శాతం, 1-2 హెక్టార్లలోపు భూమి ఉన్నవారు 30.8 శాతం, 2-4 హెక్టార్లలోపు భూమి ఉన్నవారు 20.2 శాతం, 4-10 లోపు హెక్టార్లు భూమి ఉన్నవారు 6.3 శాతం, 10 హెక్టార్లకు పైన ఉన్న కుటుంబాలు 0.4 శాతంగా ఈ సర్వే తెలియజేస్తోంది.

### 'కృషి తంత్ర'

రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించడం, భూసార పరీక్షల ప్రయోజనాలు వివరించడం వంటి అంశాలను పొందుపరుస్తూ వారి కోసం 'కృషి తంత్ర' వెబ్‌సైట్‌ను నాబార్డు రూపొందించింది. వారు ఆదాయ, ఉత్పత్తి మార్గాలను పెంచుకునేందుకు అవసరమైన సమాచారంతో పాటు పలు విషయాల్లో కర్షకులకు ఇది ప్రయోజనకరం. ఈ వెబ్‌సైట్‌ను 2021 ఆగస్టు 15న నాబార్డు సి.ఒ.ఒ. నిరజ్‌కుమార్ వర్చువల్‌గా ఆవిష్కరించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ పద్ధతిలో వారికి అవగాహన కల్పించడం కోసం నాబార్డు కృషి చేస్తోందని ఆయన తెలిపారు.

# జాతీయ పోషకాహార వారోత్సవాలు-2021 పై ప్రత్యేక కథనం !
# పోషక ధాన్యాలు, పోషక పెరటి తోటల సాగు లోనే మన దేశ ఆరోగ్య భద్రత!

ఎ.పోశాద్రి, ఎం.సునీల్ కుమార్, జి.శివ చరణ్, ఎం.రఘు వీర్, ఎ.రమాదేవి, వై.ప్రవీణ్ కుమార్, ఎం.రాజేందర్‌రెడ్డి, ఎం.ఉమాదేవి
కృషి విజ్ఞాన కేంద్రం, అదిలాబాద్.

కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ బోర్డ్ సంయుక్తంగా 1982 నుండి సెప్టెంబర్ మొదటి వారంను జాతీయ పోషకాహార దినోత్సవం గా దేశవ్యాప్తంగా జరుపుతున్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం దేశంలో పోషకాహార లోపాలను అధిగమించడానికి తీసుకోవాల్సిన ఆహారం, వివిధ పోషకాలు పైన అవగాహన పెంపొందించడం. మన దేశంలోని ప్రజలందరికీ పండ్లు, కూరగాయలను తినడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిసినప్పటికీ ప్రజలు వాటిని తగిన మోతాదులో తీసుకోవడం లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. మరొకసారి ప్రజలందరినీ చైతన్యపరిచి 2021 సంవత్సరం పోషణ మాసంలో భాగంగా పెరటి తోటల పెంపకం, చిరుధాన్యాల తో చేసిన ఆహారాన్ని విరివిగా తీసుకోవడం, తగిన మోతాదులో కాలానుగుణంగా లభించే వివిధ రకాల రంగులు గల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను పండించి విరివిగా తింటే సరైన పోషణ లభించి దేశ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారు అనే ఉద్దేశంతో "సహీ పోషణ్ దేశ్ రోషన్" అనే అంశాన్ని తెర ముందుకు తెచ్చారు.




పండ్లు, కూరగాయలు లో మానవ శరీరానికి కావలసిన అతిముఖ్యమైన సూక్ష్మపోషకాలు విటమిన్లు, ఖనిజలవణాలు, పీచుపదార్థాలు, యాంటీఆక్సిడెంట్స్ ఎక్కువ మోతాదులో దొరుకుతాయి. పండ్లు కూరగాయలను ఎక్కువ మోతాదులో తినడం వలన ఆరోగ్యమైన పెరుగుదలతో పాటు రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. నేటి బాలలే రేపటి పౌరులు కావున చిన్న పిల్లలకు, కిశోర బాలికలకు, ఎదిగే పిల్లలకు అందరికీ మంచి పోషణను అందించి భవిష్యత్తులో ఆరోగ్యమైన భారత్ ను నిర్మించడంలో మనమందరం పాత్రులు కావాలని మన ప్రధాని నరేంద్ర మోడీ కోరారు. మన రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పోషణ వైవిధ్యతను తీసుకురావడానికి పెరటి తోటల పెంపకం చాలా అవసరం. శాస్త్రీయ పద్ధతిలో పెరటి తోటల పెంపకాన్ని చేపట్టి నట్లయితే కుటుంబానికి కావలసిన వివిధ వైవిధ్యమైన కూరగాయలు మరి ఆకుకూరలను భోజనంలో తీసుకోవడం ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగవుతుంది. అంతేకాకుండా వారి చుట్టుపక్కల ఉన్న వారికి కూడా తక్కువ ఖర్చులో అన్ని రకాల కూరగాయలను అందించడానికి ఆస్కారం ఉంటుంది. ఏడాది పొడవునా కుటుంబానికి కావలసిన కూరగాయలు సేంద్రీయ పద్ధతిలో పండించడంతో పాటు, కూరగాయల కోసం వెచ్చించే డబ్బులు ఆదా చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాలలోఆహారపు అలవాట్లలో మార్పు రావడం వలన చాలామంది పూర్వకాలపు ఆహార పదార్థాల నుండి ఆధునిక కాలంలోని బాగా పాలిష్ చేసిన బియ్యం ను అన్నం గా వండుకొని తింటున్నారు. దీని వలన పోషకాహార లోపాలు మరింత అధికమయ్యాయి.

జొన్నలు, చిరుధాన్యాలు పోషక విలువలతో పాటు, వాటిని తినడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలు పైన ఎలాంటి అవగాహన లేకపోవడం వలన ప్రజలు వాటిని సాగు చేయడం, తినడం తగ్గించారు. జొన్నలు, చిరుధాన్యాలు తో తయారు చేసిన ఆహార పదార్థాలను తినడం ద్వారా చక్కెర వ్యాధి, రక్తహీనత, గుండె సంబంధిత వ్యాధులు, స్థూలకాయం వంటివి రాకుండా ఉపయోగపడతాయని ఇప్పుడిప్పుడే అవగాహన తెచ్చుకుంటున్నారు. చిరు ధాన్యాలను తీసుకోవడం ద్వారా కలిగే అదనపు ఆరోగ్య ప్రయోజనాలు ముఖ్యంగా వీటిలో అధిక మొత్తంలో పీచు పదార్థం, గ్లూటెన్ ఫ్రీ ప్రోటీన్లు, తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్, ఇతర బయో యాక్టివ్ సమ్మేళనాలు కూడా అధికంగా ఉంటాయి. జొన్నలు, చిరుధాన్యాలలో సగటున కార్బోహైడ్రేట్లు 56.88-72.97%, ప్రోటీన్లు 7.5-12.5%, కొవ్వు పదార్థాలు 1.3 -6.0% ఉంటాయి. అంతేకాకుండా అతి ముఖ్యమైన పీచుపదార్థం, విటమిన్లు, ఖనిజ లవణాలు కూడా విరివిగా దొరుకుతాయి.

## మన ఆహారం, మన ఆరోగ్యం గురించి మీకు తెలుసా!

- జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2019-2020) అంచనాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ప్రోటీన్ క్యాలరీ పోషకాహార లోపం చిన్నపిల్లల్లో, గర్భిణీ స్త్రీలలో, పాలిచ్చే తల్లులలో ప్రధానంగా కనిపిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో ఐదు సంవత్సరాల లోపు చిన్న పిల్లల్లో సుమారు 31.8% పిల్లలకు వయసుకు తగ్గ బరువు లేదు, 33.1% మంది పిల్లల్లో వయసుకు తగ్గ ఎత్తు లేదు, 70.0% పిల్లలు రక్తహీనత తో బాధపడుతున్నారు.
- జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2019-2020) అంచనాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన ప్రాంతాలలో అలాగే గిరిజన ప్రాంతాలలో ఐదు సంవత్సరాల లోపు చిన్న పిల్లల్లో సుమారు 52.0% పిల్లలకు వయసుకు తగ్గ బరువు లేదు, 45.7% మంది పిల్లల్లో వయసుకు తగ్గ ఎత్తు లేదు, 76.3% పిల్లలు రక్తహీనత తో బాధపడుతున్నారు.
- సాధారణ మనిషికి రోజుకు సుమారు 2000 నుండి 2500 కేలరీల శక్తి అవసరం
- జాతీయ పోషకాహార సంస్థ నిర్దేశించిన ప్రకారం సగటున ప్రతి రోజు,ప్రతి వ్యక్తి సుమారు 400గ్రాముల తృణధాన్యాలు లేదా మిల్లెట్స్ ఆహారంగా తీసుకోవాలి. తక్కువ పాలిష్ చేసిన ధాన్యాలను ఆహారంగా తీసుకుంటే మంచిది.
- జాతీయ పోషకాహార సంస్థ నిర్దేశించిన ప్రకారం సగటున ప్రతి రోజు, ప్రతి వ్యక్తి సుమారు 80గ్రాముల వివిధ పప్పులను ఆహారంగా తీసుకోవాలి.
- దేశంలో ఈరోజు తలసరి పప్పు ధాన్యాల లభ్యత సుమారు 24 గ్రాములు. కానీ ఐసీఎంఆర్ సూచించిన తలసరి పప్పుధాన్యాల వినియోగం సుమారు 80 గ్రాములు.
- జాతీయ పోషకాహార సంస్థ నిర్దేశించిన ప్రకారం సగటున ప్రతి రోజు, ప్రతి వ్యక్తి సుమారు 300గ్రాముల పాలు, పాల పదార్థాలను ఆహారంగా తీసుకున్నట్లయితే శరీరానికి కావలసిన ఖనిజ లవణాలు లభిస్తాయి.
- జాతీయ పోషకాహార సంస్థ నిర్దేశించిన ప్రకారం సగటున ప్రతి రోజు,ప్రతి వ్యక్తి సుమారు 300గ్రాముల వివిధ కూరగాయలు, ఆకుకూరలను కూరగా వండుకొని లేదా సలాడ్ గా తినాలి.
- జాతీయ పోషకాహార సంస్థ నిర్దేశించిన ప్రకారం సగటున ప్రతి రోజు, ప్రతి వ్యక్తి సుమారు 30గ్రాముల నూనెను వంటనూనెల నుండి గాని లేక ఇతర ఆహార పదార్థాల ద్వారా తీసుకోవాలి. అధిక నూనెలను తీసుకున్నట్లయితే శరీరంలో కొలెస్ట్రాల్ పేరుకుపోతుంది.
- ప్రతిరోజు 21 నుండి 70గ్రా. వాల్నట్ (అక్రోటు కాయ) తినడం ద్వారా శరీరానికి కావలసిన అతి ముఖ్యమైన ఒమేగా త్రీ కొవ్వు ఆమ్లాలు, పీచు పదార్థం లభిస్తాయి. తద్వారా శరీరంలో కొలెస్ట్రాల్ పెరుగుదలను నియంత్రించి గుండెపోటు వంటి సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు.
- పాలు, పాల సంబంధిత పదార్థాలు, గుడ్లు, మాంసం, చేపలు, పప్పు ధాన్యాలలో అధిక మోతాదులో ప్రోటీన్లు లభిస్తాయి. జంతువుల నుండి లభించే ఆహార పదార్థాలలో అధికమోతాదులో నాణ్యమైన ప్రోటీన్లు ఉంటాయి. ముఖ్యంగా శరీరానికి కావాల్సిన అన్ని రకాల అమినో యాసిడ్స్ దొరుకుతాయి. అందుకే గుడ్లను సంపూర్ణ ఆహారంగా పరిగణిస్తారు.
- అన్నం, గోధుమలు, చిరుధాన్యాలు, పప్పు దినుసుల లో కొన్ని రకాల అమైనో ఆసిడ్స్ లభించవు. అందుకనే అన్నం- పప్పు, ఇడ్లీ, దోస వంటి ఆహారంలో ధాన్యం, పప్పు దినుసుల కాంబినేషన్లో తీసుకోవడం ద్వారా శరీరానికి కావలసిన అన్ని రకాల అమినో యాసిడ్స్ లభిస్తాయి
- గర్భిణీ స్త్రీలు రోజు సుమారు 8 నుండి 12 గ్లాసుల శుభ్రమైన కాచి వడపోసిన నీళ్లు తాగాలి.
- గర్భం దాల్చిన తర్వాత మహిళలు సుమారు 350 క్యాలరీల అదనపు శక్తినిచ్చే ఆహారాన్ని తీసుకోవాలి. మొదటి త్రైమాసికంలో 0.5గ్రా., రెండవ త్రైమాసికంలో 6.9 గ్రా., మూడవ త్రైమాసికంలో 22.7గ్రా. అదనపు ప్రోటీనులను ప్రతి రోజూ ఆహారంగా తీసుకోవాలి.
- గర్భిణీ స్త్రీలలో బరువు పెరగడం కోసం ప్రోటీన్లు అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం చాలా అవసరం. సుమారు 10 నుండి 12 కిలోల అదనపు బరువును గర్భిణీ పొందాలి. తద్వారా పుట్టబోయే బిడ్డ సుమారు మూడు కిలోల బరువు ఉండే అవకాశం ఉంది.
- గర్భిణీ స్త్రీలు పుట్టబోయే బిడ్డ మంచి బరువు, ఆరోగ్యంగా ఉండటం కొరకు గర్భం దాల్చిన తర్వాత సుమారు 14




నుండి 16 వారాల తర్వాత అదనంగా శరీరానికి కావలసిన ఖనిజలవణాలు అయినా క్యాల్షియం, ఐరన్, ఫోలిక్ యాసిడ్ విటమిన్ టాబ్లెట్ల రూపంలో తీసుకోవాలి.

- ❖ గర్భిణీస్త్రీలలో మలబద్ధకం సమస్య రాకుండా పీచు పదార్థం అధికంగా లభించే చిరుధాన్యాలు, తక్కువ పాలిష్ చేసిన ధాన్యాలను, పప్పు దినుసులను, ఆకుకూరలను అధికంగా తీసుకోవాలి.
- ❖ బిడ్డ పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లిపాలను పట్టించాలి. బిడ్డ వయసు రెండు సంవత్సరాలు వచ్చేదాకా తల్లిపాలు తప్పక తాగించాలి.
- ❖ పాలిచ్చే తల్లులు వారి ప్రాంతాల్లో లభించే వివిధ వైవిధ్యమైన ఆహారపదార్థాలను, మంచి రంగులో ఉన్న ఆకుకూరలు, పండ్లు, కూరగాయలను సమపాళ్ళల్లో తీసుకోవడం వల్ల తల్లి పాల ద్వారా బిడ్డకు సమతుల్య ఆహారం అందుతుంది
- ❖ బిడ్డ వయస్సు సుమారు ఆరు నెలలు వచ్చాక తల్లి పాలతో పాటు అదనంగా జావా వంటి ఆహార పదార్థాలను తినిపించాలి. తద్వారా ఎదిగే బిడ్డకు సరైన పోషణ లభిస్తుంది
- ❖ ఎదిగే పిల్లల లో విటమిన్ -ఏ, ఐరన్ పోషకాహార లోపాలను అధిగమించడం కోసం వివిధ రంగుల లో ఉన్నటువంటి పండ్లు, క్యారెట్లు, ఆకుకూరలను తినే విధంగా ప్రోత్సహించాలి
- ❖ ఇక్రిసాట్ వారు జొన్నలు, చిరుధాన్యాలతో చేసిన ఆహార ఉత్పత్తులను స్మార్ట్ ఫుడ్స్ గా పేర్కొంటారు. ఎందుకంటే ఇవి ఆరోగ్యానికి మంచివి, ప్రకృతిని విషతుల్యం చేయదు, తక్కువ వనరులతో పండించవచ్చు. మార్కెట్‌లో వీటికి మంచి ధర ఉంది తద్వారా అధిక లాభాలను రైతులు పొందవచ్చు.
- ❖ జొన్నలు, చిరుధాన్యాలలో సగటు కార్బోహైడ్రేట్లు 56.88-72.97%, ప్రోటీన్లు 7.5-12.5%, కొవ్వు పదార్థాలు 1.3 -6.0% ఉంటాయి. అంతేకాకుండా అతి ముఖ్యమైన పీచుపదార్థం, విటమిన్లు, ఖనిజ లవణాలు కూడా విరివిగా దొరుకుతాయి.
- ❖ చిరు ధాన్యాలను (మిల్లెట్స్) తరచుగా ఆహారంగా తీసుకోవడం వలన మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, ఆర్థ్రైటిస్, ఎనీమియా, ఊబకాయం మొదలగు రుగ్మతలు రాకుండా కాపాడుకోవచ్చు
- ❖ వరి, గోధుమల కన్నా జొన్నలు, చిరుధాన్యాలలో అధిక పోషక విలువలు ఉంటాయి. ముఖ్యంగా వీటిలో అధిక మొత్తంలో పీచు పదార్థం, గ్లూటెన్ ఫ్రీ ప్రోటీన్లు, తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్, ఇతర బయో యాక్టివ్ సమ్మేళనాలు కూడా అధికంగా ఉంటాయి.
- ❖ జొన్న లేదా చిరుధాన్యాల గట్క లేక ఇతర జావా వంటి ఆహార పదార్థాలను పెరుగు లేదా లస్సి లేదా మజ్జిగ వంటివి కలుపుకుని తినడం ద్వారా పెరుగులో ఉన్నటువంటి ఉపయోగకరమైన సూక్ష్మజీవులు శరీరంలో ప్రవేశించి ఆరోగ్యకరమైన జీర్ణ వ్యవస్థ పెంపొందించడానికి తోడ్పడతాయి
- ❖ సోయాబీన్ పోషక విలువల పరంగా చాలా శ్రేష్టమైనది. ఎక్కువ మోతాదులో ప్రోటీన్లు, కొవ్వు ఆమ్లాలు, ఐరన్, జింకు, క్యాల్షియం, ఐసోఫ్లవోన్స్, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్లు దొరికే చౌకైన ఆహార ధాన్యం.
- ❖ కండరాలు ప్రోటీన్లతో నిర్మితమై ఉంటాయి కావున ఆరోగ్యమైన కండరాలు, మెరుగైన పనితీరు కోసం రోజూ

తినే ఆహారంలో ప్రోటీన్లు విధిగా ఉండేటట్లు చూసుకోవాలి. పాలు, పాల పదార్థాలు, పప్పు దినుసులు, గుడ్లు, మాంసం, చేపల ద్వారా మనకు అధిక మొత్తంలో ప్రోటీన్లు శరీరానికి అందుతాయి.

❖ ప్రతి రోజు శరీరానికి కావలసిన మాంసకృత్తులు వయసు, శారీరక శ్రమ, ఒత్తిడి బట్టి మారుతూ ఉంటాయి. ఎదిగే పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు, అధిక ఒత్తిడి, జబ్బులకు, వ్యాధులకు గురి అయిన వారికి అధిక మోతాదులో ప్రోటీన్లు అవసరం. జబ్బులు, వ్యాధుల నుండి కోలుకుంటున్న వారికి అధిక మోతాదులో ప్రోటీన్లు అవసరం

**మాంసకృత్తులు శరీరంలో ఈ కింది ప్రక్రియలో నిర్వహించడానికి ఎంతో ఉపయోగపడతాయి**

- ప్రోటీన్లు శరీరానికి కావల్సిన శక్తిని అందిస్తాయి
- జీవన క్రియ పెంపొందించడానికి తోడ్పడతాయి.
- శరీర నిర్మాణం, గాయాలు, పుండ్లు మానడంలో ప్రోటీన్లు ఎంతో తోడ్పడతాయి.
- మాంస కండరాల బరువు, ఎముకల సాంద్రత పెరగడంలో తోడ్పడతాయి.
- రోగనిరోధక శక్తిని పెంచే ప్రతి నిరోధకాల ఉత్పత్తిలో ప్రముఖ పాత్ర వహిస్తాయి.
- శరీరంలోని వివిధ ఎంజైమ్లు, హార్మోన్లు ఉత్పత్తిలో కూడా తోడ్పడతాయి

❖ కరోనా వంటి రోగాలను ఎదుర్కోవాలంటే తక్షణ రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవాలి. 11 రకాల స్థూల, సూక్ష్మపోషకాలు తగిన మోతాదులో తీసుకున్నట్లయితే రోగనిరోధక శక్తి పెరిగి పెరుగుతుంది. ప్రోటీన్లు, విటమిన్- ఏ, విటమిన్- సి, విటమిన్- డి, విటమిన్ -ఈ, విటమిన్ -బి 6, విటమిన్ -బి 12, పోలిక్ యాసిడ్, ఐరన్, కాపర్, జింక్.

❖ బత్తాయిలు, కమలాలు, నిమ్మకాయలు మొదలగు సిట్రస్ జాతి పండ్లతో పాటు జామ, ఉసిరి వంటివి తినడం వలన శరీరానికి అధిక మొత్తంలో విటమిన్- సి దొరుకుతుంది తద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇంట్లో మనం తయారు చేసుకునే వివిధ కూరలు, ఆహార పదార్థాలలో పసుపు, అల్లం, వెల్లుల్లి, మిరియాలు వాడడం వలన కుటుంబ ఆరోగ్యం బాగుంటుంది.

❖ జీవనశైలిలో మార్పు, సమతుల్యమైన ఆహారం, శారీరక వ్యాయామం, సరైన నిద్ర, ఒత్తిడిని జయించడం ద్వారా రోగ నిరోధక శక్తిని పెంచుకోవచ్చు.

❖ శీతాకాలంలో రోజు ఒక శుభ్రపరిచిన క్యారెట్ని తినడం ద్వారా శరీరానికి కావలసిన విటమిన్ ఎ, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు లభించడం వలన ఆరోగ్యంగా ఉంటాము.

❖ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వారు తీసుకొచ్చిన ఈట్ రైట్ ఇండియా, ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పోషకాహార లోపాలను అధిగమించడం కోసం - దుకాణానికి వెళ్లినప్పుడు డబుల్ ఫోర్టిఫైడ్ ఉప్పును కొని వాడుకోవాలి.

❖ దుకాణానికి వెళ్లినప్పుడు ఫోర్టిఫైడ్ చేసిన ఉప్పు, పాలు, గోధుమపిండి, వంటనూనెలు కొని వాడుకోవాలి.

❖ దుకాణానికి వెళ్లినప్పుడు ఫోర్టిఫికేషన్ సింబల్ ఉన్న ఆహార పదార్థాలను కొనాలి.

❖ కాలానుగుణంగా మీ ప్రాంతంలో లభించే వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పులను విరివిగా వాడడం వలన పోషకాహార లోపాలను అధిగమించవచ్చు.

❖ తొగరి సోలాలు (పచ్చి కందులు) తో వివిధ సంప్రదాయ ఆహారపదార్థాలు వండుకొని తినే ముందు నిమ్మరసాన్ని కలిపి తింటే కందుల లోని ఐరన్ లభ్యత పెరిగి శరీరానికి పుష్కలంగా ఐరన్ దొరుకుతుంది.

❖ తొగరి సోలాలు (పచ్చి కందులు), ఇతర పప్పు దినుసులు విరివిగా తినడం వలన పప్పుల లో ఉండే సూక్ష్మ పోషకాలైన విటమిన్లు, ఖనిజ లవణాలు లభిస్తాయి.

❖ తొగరి సోలాలు (పచ్చి కందులు), ఇతర పప్పు దినుసుల లో ఫైటో ఈస్ట్రోజెన్ అనే రసాయన పదార్థం ఉంటుంది. పప్పులను తినడం వలన బుద్ధిమాంద్యం, మోనోపాస్ సమస్యలను అధిగమించవచ్చు.

❖ తొగరి సోలాలు (పచ్చి కందులు), ఇతర పప్పు దినుసుల ఎందుకు తినాలంటే వీటిలో తక్కువ మోతాదులో చక్కెరలు, కొవ్వు, సోడియం ఉంటాయి, వీటిలో ఎటువంటి కొలెస్ట్రాల్, గ్లూటెన్ అనే ప్రోటీన్ ఉండదు.

❖ తొగరి సోలాలు (పచ్చి కందులు), ఇతర పప్పు దినుసుల ఎందుకు తినాలంటే వీటిలో అధిక మోతాదులో మన

# పాడి అభివృద్ధికి దూడల పోషణ

డా.జె.సాయి ప్రసన్న, సహాయ ఆచార్యులు, పశు జన్యుశాస్త్ర – ప్రజనన విభాగం, పశువైద్య కళాశాల, రాజేంద్రనగర్

“నేటి పెయ్య దూడ రేపటి పాడి పశువు”అన్న సంగతి గుర్తుంచుకొని పెయ్య దూడలను శాస్త్రీయ పద్ధతిలో పోషించినట్లయితే వాటిని మంచి పాడిపశువులుగా అభివృద్ధి చేసుకోవచ్చు. మంచి పోషకాహారం తో దూడలు బాగా పెరిగి, త్వరగా యుక్త వయసుకు చేరతాయి. యుక్త వయసు వచ్చే సమయానికి పశువు శరీర బరువులో 70 నుంచి 75 శాతం సాధించాలి. మేలైన పోషణ తో రెండు సంవత్సరాల్లోపే చూలు కట్టి, మూడు సంవత్సరాల లోపే ఈనుతాయి.

వాస్తవానికి దూడల సంరక్షణ తల్లి గర్భంలో ఉన్నప్పటినుండే ప్రారంభమవుతుంది. అంటే చూడిదశలో పశువులను బాగా మేపినట్లైతే ఆరోగ్యవంతమైన, ఎక్కువ బరువు కలిగిన దూడ పుడుతుంది. ముఖ్యంగా చూలి చివరి మూడు మాసాల్లో గర్భంలోని దూడ పెరుగుదల మూడింట రెండు వంతులుంటుంది. కాబట్టి పశువులు చూలిగా ఉన్నప్పుడు శరీర పోషణకే కాకుండా గర్భంలోని దూడ పెరుగుదలకు, ఈనిన తరవాత అధిక పాలుత్పతికి మామూలుకంటే అదనంగా పోషకాహారం అందించాలి.

### దూడ పుట్టగానే తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

**ముక్కు, నోరు శుభ్రపరచడం:** పుట్టిన వెంటనే ముక్కులో, నోటిలో ఉన్న మావి పొర లేదా జిగురు పదార్థాన్ని (శ్లేష్మం) తుడిచి వేయాలి. సాధారణంగా పుట్టిన వెంటనే దూడను తల్లి ఆవు నాకుతుంది. దీనివలన దూడ శరీరంపై తడి ఆరిపోయి శ్వాసక్రియ, రక్త ప్రసరణ ఉత్తేజపడుతుంది. తల్లికి దూడకు అనుబంధం పెరిగి, తల్లి సులభంగా దూడను తన దగ్గరకు చేరనిస్తుంది. తల్లి అలా నాకని పక్షంలో కానీ, వాతావరణం చల్లగా ఉన్నప్పుడు కానీ, దూడను పొడి బట్టతోనో, గోనె సంచి బట్టతోనో రుద్ది పొడిగా తుడవాలి. ఛాతీ భాగాన్ని చేత్తో ఒత్తి వదిలిపెడుతూ కృత్రిమ శ్వాసను అందివ్వాలి.

**బొడ్డు కత్తిరించడం:** దూడ జన్మించిన వెంటనే బొడ్డు కింద 2 అంగుళాలు వదిలి దారంతో కట్టి, ముడి దిగువ భాగంలో 1 సెం.మీ. దూరంలో కత్తిరించి టించర్ అయోడిన్ లేదా బోరిక్ ఆమ్లం లేదా ఏదైనా ఆంటీబయాటిక్ కానీ అద్దాలి. ఇలా చేయడం వలన బొడ్డు వాపు మొదలగు వ్యాధులు రాకుండా ఉంటాయి.

**జున్ను పాలు పట్టించడం:** దూడ నోటిలో రెండు వేళ్లు చొప్పించి, నాలుక మీద మెల్లగా రాసి, ఆ తర్వాత తల్లి పొదుగులో పాల సండ్లని పట్టించాలి. సహజంగా పుట్టిన ఒక గంటలో, దూడ నిల్చుని పాలు తాగడానికి ప్రయత్నిస్తుంది. దూడ బలహీనంగా ఉంటే అందుకు సహాయం చెయ్యాలి.

**జున్ను పాలు – ప్రాముఖ్యత:** అప్పుడే పుట్టిన దూడకు మొట్టమొదటి సారిగా ఇచ్చే అతి ముఖ్యమైన ఆహారం జున్నుపాలు. దూడ పుట్టిన అరగంట నుండి రెండు గంటల లోపు జున్ను పాలు తాగనివ్వాలి. దూడ పుట్టిన తర్వాత 7 రోజులవరకూ తల్లికి జున్నుపాలు ఉంటాయి. జున్నుపాలలో మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, ఖనిజ లవణాలు మొదలగు పోషకాలు అధిక స్థాయిలో ఉండడమే కాకుండా వివిధ రకాల వ్యాధికారక క్రిముల

---

శరీరానికి కావలసిన ప్రోటీన్లు, ఐరన్, పీచుపదార్థము, పోలిక్ యాసిడ్ లభిస్తాయి.

- మనం తీసుకునే ఆహారంలో తక్కువ మోతాదులో చెక్కెర, ఉప్పు, తక్కువ పాలిష్ చేసిన ఆహార ధాన్యాలు ఉండేటట్టు చూసుకోవాలి.
- ఒక నెలలో వివిధ రకాల వంట నూనెలను వాడటం వలన సమపాళ్ళలో శరీరానికి కావలసిన కొవ్వు ఆమ్లాలు, ఇతర సూక్ష్మ పోషకాలు లభిస్తాయి.
- చక్కని శరీర బరువు కోసం మొలకెత్తిన పప్పు ధాన్యాల గింజలు, తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, నట్స్, తక్కువ కొవ్వు కలిగిన పాల పదార్థాలు సమపాళ్లలో తినాలి.
- కలుషితమైన వాతావరణ పరిస్థితులలో రోడ్డుపైన దొరికే జంక్ ఫుడ్ లు తినడం వలన శరీరంలోకి విషపదార్థాలు వెళ్లే ఆస్కారం ఉంది. కలుషిత వాతావరణం లో జంక్ ఫుడ్ లు తినవద్దు.
- వెయ్యి సంవత్సరాల తర్వాత భూమిలో కలిసిపోయే ప్లాస్టిక్కు 10 నిమిషాల అవసరం కోసం వాడడం ఎందుకు. ప్రజలందరూ దుకాణానికి సంచి తీసుకొని వెళ్లి పర్యావరణాన్ని కాపాడుకుందాం.

నుండి రక్షణ కలిగించే 'ఇమ్యూనోగ్లోబులిన్స్' అనే 'యాంటీబాడీస్' అనగా ప్రతిరక్షకాలు కూడా ఉంటాయి. ఇవి దూడలకు నిష్క్రియాత్మక రోగనిరోధక శక్తిని అందిస్తాయి. నవజాత దూడల పేగులకు ఈ యాంటీ బాడీలను శోషించే శక్తి మొదటి గంటలో అధికంగా ఉంటుంది. సమయం గడిచేకొద్దీ ఈ పారగమ్యత సన్నగిల్లుతుంది. కాబట్టి పుట్టిన 24 గంటల్లో దూడ కనీసం మూడు నాలుగు సార్లు జున్ను పాలు తాగేలా చూడాలి. లేగ దూడలకు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. మామూలు పాలతో పోలిస్తే జున్ను పాలలో మాంసకృత్తులు నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంటాయి. విటమిన్ ఎ పది రెట్లు అధికంగా ఉంటుంది. ఖనిజ లవణాలు కూడా పుష్కలంగా ఉంటాయి. జున్ను పాలు మలబద్ధకాన్ని నివారించి, విరోచనం సాఫీగా జరగడానికి తోడ్పడతాయి. పుట్టిన ప్రతి దూడకు జున్ను పాలు వరప్రసాదం లాంటిది. ఈనిన పశువు మరణించిన సందర్భాల్లో, దూడ స్వయంగా పాలు తాగలేని సందర్భాల్లో లేదా ఏ ఇతర కారణాల వల్ల జున్ను పాలు దూడలకు లభ్యం కానీ పరిస్థితుల్లో "కృత్రిమ జున్ను పాలు" తాయారు చేసి తాగించాలి. ఒక లీటరు పాలు, మూడు కోడి గుడ్లు, మూడు టీ స్పూనుల కాడ్ లివర్ నూనె, నాలుగు స్పూనుల ఆముదం కలిపిన మిశ్రమాన్ని రోజుకు మూడు సార్లు దూడలకు తాగించాలి.

**నట్టల మందు తాగించడం:** పుట్టిన 7 – 10 రోజుల్లో ఏలికపాముల నిర్మూలనకు మొదటి సారి పైపర్ జీన్ అడిపేట్, ఆల్బెన్ డజోల్, ఫెంబెండజోల్ వంటి మందుల్ని తాగించాలి. తర్వాత అవసరాన్ని బట్టి నివారణ చర్యగా నెలకొక సారి ఆరు మాసాల వరకు డివార్మింగ్ చేయవచ్చు.

**లేగ దూడల మేపు (3 రోజుల నుండి – 90 రోజుల వరకు):** దూడకు తన శరీర బరువులో 10వ వంతు పాలు అవసరం. అంటే దూడ శరీరం 20కిలోలుంటే, దానికి రోజుకు 2 లీటర్ల పాలు కావాలి. లేగ దూడల పూర్తి ఎదుగుదలకు కేవలం పాలు సరిపోవు, కాబట్టి ఘనపు ఆహారం సాధ్యమైనంత త్వరగా దాణా, గడ్డి రూపంలో అందించాల్సి ఉంటుంది. లేగ దూడలు సెల్యులోస్ పీచు పదార్థం ఉన్న ఎండు మేతను పూర్తిగా వినియోగించుకోలేవు. కాబట్టి మూడు మాసాల లోపు దూడలకు తక్కువ మొత్తంలో పప్పు జాతికి చెందిన పిల్లి పెసర, అలసంద, లూసర్న్, బెర్సీం వంటి పశుగ్రాసాలను అందించాలి. వీటిని 5 – 7 వ రోజు నుండి కొద్దికొద్దిగా అందిస్తూ అలవాటు చేయాలి. దీని వల్లపెద్ద పొట్ట (రూమెన్ ) త్వరగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

**కాఫ్ స్టార్టరు:** దూడల కిచ్చే దాణా అంటే "కాఫ్ స్టార్టరు" ను మనకు అందుబాటులో ఉన్న పదార్థాలతో తాయారు చేసుకోవచ్చు. దూడలకు త్వరగా జీర్ణమయ్యే, పెరుగుదలకు కావలసిన పోషక పదార్థాలు గల దాణాను, పాలతో పాటు రెండవ నెల నుండి తినడం అలవాటు చేయాలి. దూడల దాణాలో ఎక్కువ మాంసకృత్తులు, తక్కువ పీచు పదార్థాలు కలిగి ఉండాలి. ఉదాహరణకి ఈ కింద చూపిన పదార్థాలను ఆయా పాళ్ళలో కలిపి తాయారు చేసుకోవచ్చు.

- జొన్న/మొక్క జొన్న/మొదలగు ధాన్యం – 45 పాళ్ళు
- వేరుశెనగ చెక్క – 35 పాళ్ళు
- వరి తవుడు – 10 పాళ్ళు
- చేపల పొడి – 7 పాళ్ళు
- ఖనిజ లవణాల మిశ్రమం – 3 పాళ్ళు

ఏ పదార్థాలను ఉపయోగించినా, దాంట్లో 20 శాతం మాంసకృత్తులు, 70 శాతం శక్తినిచ్చే పదార్థాలు ఉండేటట్లు చూసుకోవాలి.

**దూడల మేపు (3 నెలల నుండి 6 నెలల వరకు):** దూడలకు 3 నెలల వయసు రాగానే తల్లి నుండి వేరు చేసి పచ్చి మేత, దాణా పెట్టి మేపాలి. 3 వ నెల నుండి పచ్చి మేత 5 పాళ్ళు, ఎండు మేత ఒక పాలు చొప్పున ఇవ్వాలి. దూడలకు అలసంద, పిల్లి పెసర, లూసర్న్ వంటి కాయజాతి పచ్చి మేతలు మేపితే దాణా కొంత వరకు తగ్గించవచ్చు.

**దూడలకు అంటూ వ్యాధులు – నిరోధనకు టీకాలు :** గాలి కుంటూ, గొంతువాపు, దొమ్మ వ్యాధి, థైలేరియాసిస్ మొదలగు వ్యాధుల నివారణకు, క్రమం తప్పకుండా టీకాలను వేయించాలి.

దూడలను ఈ విధంగా శాస్త్రీయ పద్ధతిలో పోషించినట్లయితే వాటికి చేసిన ఖర్చు కంటే నాలుగు రెట్లు ఆదాయం పొందవచ్చు. కాబట్టి రైతులు దూడల పెంపకంలో మెళకువలను తెలుసుకొని ఆచరిస్తే, అవి త్వరగా యుక్త వయసుకు వచ్చి, పొర్లి, భవిష్యత్తులో చక్కటి పాడి పశువులుగా రైతు ఇంట్లోనే రూపొందుతాయి.




# ఫోన్ – ఇన్ – లైవ్

రైతులు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
040-27031431, 27031432, 27031433

## దూరదర్శన్ కేంద్రం వారి ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాలు

దూరదర్శన్ కేంద్రం, రామాంతపూర్, హైదరాబాద్ ద్వారా రాష్ట్రమంతటా అక్టోబర్ 2021లో ప్రసారం చేయనున్న ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాల వివరాలు ఈ కింద పొందుపరిచాం. రాష్ట్ర రైతాంగం ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

| తేది | విషయం | శాస్త్రవేత్త | చిరునామా |
|---|---|---|---|
| 01.10.2021 శుక్రవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | పంటల వైవిధ్యీకరణ | ఆర్.శివానంద్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ | వ్యవసాయ కమిషనర్ కార్యాలయం, హైదరాబాద్ ఫోన్ : 7288894818 tgagextn@gmail.com |
| 04.10.2021 సోమవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | మధ్య తెలంగాణ యాసంగి సాగు పంటల ప్రణాళిక | డా.ఆర్.ఉమారెడ్డి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ | ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్ ఫోన్ : 9989625223 adrrars_wgl@yahoo.co.in |
| 05.10.2021 మంగళవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | వర్షాకాలంలో పాడి పశువుల్లో వచ్చే వ్యాధులు - నివారణ | డా.ఎస్.అయోధ్య అసోసియేట్ ప్రొఫెసర్ & హెడ్ | పశువైద్య కళాశాల, కోరుట్ల, జగిత్యాల ఫోన్ : 9490003032 sayodhya6@gmail.com |
| 06.10.2021 బుధవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | వరి సూటి రకాల్లో విత్తనోత్పత్తి మెళకువలు | డా.శ్రీధర్ సిద్ది శాస్త్రవేత్త & హెడ్ | వ్యవసాయ పరిశోధనా స్థానం, కూనారం, ఫోన్ : 9849635235 siddu.35@gmail.com |
| 07.10.2021 గురువారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | కుసుమ సాగులో మెళకువలు | డా.సి.సుధాకర్ ప్రధాన శాస్త్రవేత్త | ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ సాఫ్లవర్, వ్యవసాయపరిశోధనాస్థానం తాండూరు, ఫోన్ : 9849626312 chouratsudhakar@yahoo.com |
| 08.10.2021 శుక్రవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | యాసంగికి అనువైన అపరాల రకాలు, యాజమాన్య పద్ధతులు | డా.కె.రుక్మిణి దేవి సీనియర్ శాస్త్రవేత్త | వ్యవసాయ పరిశోధనా స్థానం, మధిర, ఫోన్ : 7675050041 rukminirars@gmail.com |
| 11.10.2021 సోమవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | పురుగు మందుల చట్టం-బయో ఉత్పత్తుల గురించి అవగాహన | డా.ఎస్.జె.రహమాన్ సీనియర్ ప్రొఫెసర్ & యూనివర్సిటీ హెడ్ | వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్ ఫోన్ : 9848421791 sjrahman1964@rediffmail.com |
| 12.10.2021 మంగళవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | ఆవాల సాగులో మెళకువలు | డా.పి.మధుకర్ రావు శాస్త్రవేత్త | ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, జగిత్యాల, ఫోన్ : 9505507995 agro_madhu@yahoo.com |
| 13.10.2021 బుధవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | అధిక / అత్యధిక సాంద్రతల పండ్ల తోటల సాగులో మెళకువలు | డా.ఎ.కిరణ్ కుమార్ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ | శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం హైదరాబాద్ ఫోన్ : 9440108930 adapakirankumar@gmail.com |
| 14.10.2021 గురువారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | వానాకాలం వరిలో సస్యరక్షణ | డా.ఎన్.రామ గోపాల్ వర్మ ప్రధాన శాస్త్రవేత్త | వరి పరిశోధనా కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్ ఫోన్ : 9912079464 varmanrg@mailcity.com |
| 15.10.2021 శుక్రవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | | విజయదశమి సెలవు | |




# ఫోన్ – ఇన్ – లైవ్

రైతులు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : 040-27031431, 27031432, 27031433

## దూరదర్శన్ కేంద్రం వారి ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాలు

**దూరదర్శన్ కేంద్రం, రామాంతపూర్, హైదరాబాద్ ద్వారా రాష్ట్రమంతటా అక్టోబర్ 2021లో ప్రసారం చేయనున్న ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాల వివరాలు ఈ కింద పొందుపరిచాం. రాష్ట్ర రైతాంగం ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.**

| తేది | విషయం | శాస్త్రవేత్త | చిరునామా |
|---|---|---|---|
| 18.10.2021<br>సోమవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | పత్తి పంటల్లో చీడపీడల యాజమాన్యం | డా.బి.రాం ప్రసాద్<br>సీనియర్ శాస్త్రవేత్త | ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్<br>ఫోన్ : 9963073087<br>rampi_73@yahoo.com |
| 19.10.2021<br>మంగళవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | సాంద్ర పద్ధతిలో గొర్రెలు పెంపకం, పోషణలో మెళకువలు | డా.జె.నర్సింహ<br>ప్రోగ్రాం కోఆర్డినేటర్ | కృషి విజ్ఞాన కేంద్రం, మమ్నూర్, వరంగల్<br>ఫోన్ : 9440671108<br>simhavet@yahoo.com |
| 20.10.2021<br>బుధవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | పట్టుగూళ్ళ ఉత్పత్తి అనంతరం, చేపట్టాల్సిన పద్ధతులు - వివరణ | సాగి రవి<br>అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరీకల్చర్ | సెరీకల్చర్ డైరెక్టర్ కార్యాలయం, జూబ్లీహిల్స్, హైదరాబాద్<br>ఫోన్ : 9177827392<br>tm4.tech@gmail.com |
| 21.10.2021<br>గురువారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | పశువుల్లో పునరుత్పత్తి సమస్యలు - నివారణ | డా.ఎం.వెంకటేశ్వర్లు<br>అసిస్టెంట్ డైరెక్టర్ | పశుసంవర్ధక శాఖ, పశువైద్య శాల, అశ్వారావు పేట, భద్రాది కొత్తగూడెం జిల్లా<br>ఫోన్ : 9989101593<br>drmamillavenkateshwarlu@gmail.com |
| 22.10.2021<br>శుక్రవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | మిరపలో నాణ్యమైన అధిక దిగుబడులకు మెళకువలు | డా.కె.భాస్కర్<br>శాస్త్రవేత్త | ఉద్యాన పరిశోధనా స్థానం, మల్యాల<br>ఫోన్ : 7396059111<br>hrsmalyal@gmail.com |
| 25.10.2021<br>సోమవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | గొర్రెల, మేకల పెంపకంలో సందేహాలు - సమాధానాలు | డా.ఎ.శరత్ చంద్ర<br>ప్రొఫెసర్ & హెడ్ | పశువైద్య కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : 9848626969<br>amaravadhi9@gmail.com |
| 26.10.2021<br>మంగళవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | వర్షాకాలం తర్వాత తెలంగాణ రాష్ట్రంలో భూగర్భ జలాల ఉనికి | రాకేష్ చంద్ర<br>డిప్యూటి డైరెక్టర్ | హెడ్ ఆఫీస్ ఆఫ్ జి.డబ్ల్యూ.డి. హైదరాబాద్<br>ఫోన్ : 7032982013<br>tgsgwd@gmail.com |
| 27.10.2021<br>బుధవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | యాసంగి పంటల్లో సమగ్ర తెగుళ్ళ యాజమాన్యం | డా.బి.విద్యా సాగర్<br>ప్రొఫెసర్ | వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : 8179526928<br>bvidyasagar@gmail.com |
| 28.10.2021<br>గురువారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | వరిలో చీడ పీడల యాజమాన్యం | ఎస్.ఓం ప్రకాశ్<br>శాస్త్రవేత్త | ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం జగిత్యాల,<br>ఫోన్ : 9866373563<br>omprakashagrico@gmail.com |
| 29.10.2021<br>శుక్రవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | మిరప పైరును ఆశించే పలు వైరస్ తెగుళ్ళు - సమగ్ర యాజమాన్య పద్ధతులు | డా.ఎ.వెంకట్ రెడ్డి<br>ప్రొఫెసర్ & హెడ్ | వ్యవసాయ కళాశాల, వరంగల్<br>ఫోన్ : 9908186020<br>venkatreddyakkati1968@gmail.com |

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రి హబ్‌ను ప్రారంభించిన వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఈ కార్యక్రమంలో మంత్రులు కల్వకుంట్ల తారక రామారావు, సబితా ఇంద్రారెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు







**VYAVASAYA PADIPANTALU** A Telugu Monthly Journal of Department of Agriculture - RNI Regn. No. TELTEL / 2012 / 47334 - OCTOBER 2021

04 సెప్టెంబర్ 2021న ఆగ్రోస్ బోర్డు సమావేశం సందర్భంగా రాజేంద్రనగర్‌లోని
జాతీయ చిరుధాన్యాల పరిశోధన (ఐఐఎంఆర్) సంస్థలోని వివిధ యూనిట్లను సందర్శించిన
రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్.,
వ్యవసాయశాఖ ప్రత్యేక కమీషనర్ హన్మంతు కొండిబ, హాజరైన ఐఐఎంఆర్ డైరెక్టర్ డా.విలాస్,
న్యూట్రిహబ్ సీఈఓ డా.దయాకర్ రావు, ఆగ్రోస్ ఎం.డి. రాములు, తదితరులు





Printed & Published by **M. Raghunandan Rao, I.A.S,** Commissioner of Agriculture,
Government Of Telangana, Basheer Bagh, Hyderabad - 500 001 on behalf of
Commissioner & Director of Agriculture, Telangana, and **Printed** at M/s.Sri Chaithanya Graphics,
Shop No.2, #3-5-377, Vittalwadi Center, Narayanaguda, HYDERABAD - 500 029. **Editor : G. Nareemani**